


ఆంధ్ర సచిత్ర వార పత్రిక

8-8-69

40. పైసలు

మనసిచ్చిన వాణ్ణి కాదని మరొకర్ని పెళ్ళాడ
వలసివస్తే - ఆస్తుల చదరంగంలో నలిగి
పోయిన ఏ ఆడపడుచు అయినా ఏం
చేస్తుంది?... రసవత్తరంగా నిర్మించబడిన
కుటుంబ గాథ



డి.బి.యన్ డగా ఫిలిమ్స్

అన్నదమ్ములు


నిర్మాతలు డి.బి.నారాయణ, డ.రామగోపాలరెడ్డి

దర్శకత్వం వి.రామచంద్రరావు B.A.(Hons) సంగీతం కె.వి.మహదేవన్

NVKR



పాండ్స్ వానిషింగ్ క్రీమ్‌తో
మీ తరుణ సౌందర్యాన్ని పువ్వురేక మార్దవంగా వుంచుకోండి



పాండ్స్ వానిషింగ్ క్రీమ్‌లోగల ప్రత్యేక హ్యూమిక్టంట్‌తో మీ చర్మమందలి స్వాభావిక తేమను వుంచుకోండి పాండ్స్ వానిషింగ్‌క్రీమ్ మీ చర్మాన్ని సుకుమారంగా మార్దవంగా నిత్య యౌవనంగా వుంచి కాపాడుతుంది. దుమ్ము, వాతావరణాలనుండికూడా చర్మాన్ని రక్షిస్తుంది. అతి తేలికగా మంచులా వుండే వానిషింగ్ క్రీమ్ ఒక్కటే సమానంగా రాసుకోవచ్చు. లేకపోతే పౌడరుకు పునాదిగా రాసుకొని పౌడర్ అద్దుకుంటే గంటలకొద్దీ మీ సింగారము చెక్కుచెదరదు.

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎలో స్థాపితం)

పాండ్స్ వానిషింగ్‌క్రీమ్ పౌడర్‌కు విశిష్టమైన పునాది

వ్యాసాలు

మీరు ఆంధ్రపత్రికలో ప్రచురించే వ్యాసములు, చదివిన తదుపరి మీ ఆంధ్రా భాయిలకి, సిగ్గు మీకు వున్నదా, అనిపిస్తున్నది. తెలంగా వుద్యమము, ఎందుకు చేస్తున్నమే మీకు ఎరుకనా? వుద్యోగములలో మాకు ఎంత అన్యాయము చేసిండ్రు జాడకావులు. మీ ఆంధ్ర వారు రాకపోతే కూడా మేము మంచి వుదేటోళ్ళము, ఆంధ్ర

ఉత్తరాలు

కుక్కలతోపాటు, మా తెలంగాణా కుక్కలు జమయునని నా భర్త ఒక వున్నతద్వారులో యు డి సి. B.A. L.L B యిత్త వరకు సూపరుడెంటు, పిన్వలేదు 15 సం. సర్వీసు 1955—మద్రాసులో తంగి ఈడకు వచ్చిండ్రు. 1971—యిడికెలి తంటె, పుంటికూర దెంము పోవలె, మీకు మేవు సోదరలము, కాము, శత్రువులము, యాదికుంచుకొండి, మీకు సిగ్గు చేటుకాదు మాకు శిగ్గు చేటు, హైదరాబాద్‌లో యిల్లు కట్టి మండీ, మీతాత, జగీరు, వుందీ, ఎంమండీ, పుంటికూర రండీ, రోజులు దగ్గరబడాయండీ ఈ లెటరు ప్రచురించకపోతే—జాగ్రత్త సీతమ్మ చింతబస్తీ.

[తమ చిరునామా లేకుండా రచయిత్రి రాసిన ఉత్తరాన్ని యథాతథంగా వేస్తున్నాము. సం —]

* * *

మీ ఆంధ్రసచిత్ర వారపత్రికలో వారం వారం అచ్చు అవుతున్న వ్యాసాలు 2 1 లేక మాది మాకు — మీదిమాకె అన్నవి చదివిన తరువాత మీరు ఆంధ్రప్రజలను సంతోష పెట్టడానికా లేక తెలంగాణా ప్రజలను దుర్మార్గులుగా చిత్రించడానికో పూనుకున్నట్లు అందరికీ తెలిసిన విషయమే అసలు ఆంధ్ర తెలంగాణా 2 1 అన్నదే ఆంధ్ర ప్రజల లాభానికి ఉద్దేశింపబడినది. ఎందుకు అన్న ఆంధ్ర ప్రదేష్ రాష్ట్రంలో తెలంగాణా జనాభా 2/5 వంతు ఉంటుంది వైశాల్యం కూడా 2/5 ఉంటుంది. అందుచేత 3 2 ఉండుట సరియైనది మా అమాయకత్వమువలన 2 1 అంగీకరించబడినది. దీనిని బట్టే తెలంగాణా మిగులు నిధులు కనీసము 100 కోట్లు ఉంటాయన్నది నిర్వివాదాంశము. మీరు అంటున్నట్లు తెలంగాణా లోటు ప్రాంతంకాదు. ఫజాల్ అలీ కమీషన్ ప్రకారం తెలంగాణా కమ్ప్రైజింగ్ ఆఫ్ నైన్ డిస్ట్రిక్ట్స్ ఈజ్ ఎ వయబుల్ యూనిట్ దట్ ఇట్ సెల్ఫ్ విత్ సర్‌ప్లస్ బడ్జెట్ అన్నది మీరు మరచినట్లున్నారు. అమాయకోద్యోగులను ఎవరూ హింసించ

(63వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం. 8—8—'69
శ్రీ సౌమ్యనామ సం॥ నిజాషాఢ బహుళ ఏకాదశి

సంపుటము : 61 సంచిక : 50

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టు ద్వారా

సంవత్సర చందా	26 00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6 50

విషయానుక్రమణిక

ముఖచిత్రం
'డ్రైవర్ మోహన్'లో జయలలిత.


అజెండాలో తర్వాత వున్నది నువ్వే జాగ్రత్త!
ఇటు రండి నంబూద్రిగారూ!
రాజ్యతంత్రం
పత్రికలు
పార్టీ
అమెరికా చంద్రవిజయం గురించి మీరసలు వినగూడదు!
అతను వినడంలేదు, ఎందుకు వింటాడు?
OOMMEN

న్యూఢిల్లీ లేఖ

బాంకులతో బాటు దేవస్థానాలనీ, గురుద్వారాలనీ కూడా!

మహాత్మాగాంధీగారి స్వతంత్రోద్యమాన్ని వెక్కిరిస్తూ లార్డ్ బిర్కెన్‌హెడ్ (సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫార్ ఇండియా) అన్నారుట— 'కుక్కలు మొరిగినా కారవాన్ నడుస్తూనే ఉంటుంది' అని.

లార్డ్ బర్కెన్ హెడ్ అవహేళన నేటి భారత దేశం పరిపాలకుల ప్రధాన సూత్రం అని తోస్తుంది కొన్ని ఉదాహరణలు ఇవ్వవచ్చు

ప్రభుత్వంవారు సముద్రంలో పెట్రోలు అన్వేషణ విషయమయి జరిపే డ్రిల్లింగ్ పట్ల సరయిన విధానాలు అనుసరించటం లేదని భారత దేశంలోని 'వార్తాపత్రికలలో అధిక సంఖ్య కలవి అన్నాయి. ఇండియన్ ఎయిర్ లయిన్స్ కార్పొరేషన్ కోసం కొనపోయే విమానాల విషయం లోనూ ప్రభుత్వం విధానాలు సరిగ్గా లేవనే విమర్శ వెలువడింది

అవీ - ఇవీ

మేడమ్ గాంధిగారు 'అవీ—ఇవీ' అన్న ఆలోచనలనీ, బాంక్‌ల జాతీయం చెయ్యటాన్ని గురించి కూడా తీవ్ర విమర్శ వచ్చింది. 'అవీ—ఇవీ' అయిన ఆలోచనలని వాటిని రాసినవారు ఈ రకం ఉపోద్ఘాతంతో పంపించి ఉండవలసింది

'భారత దేశాన్ని ఒక పెనుభూతం ఆవరిస్తోంది అది బాంక్‌ల జాతీయం అనే పెనుభూతం' తుది మాటగా ఈ కింది వాక్యాలు వాడి ఉండవచ్చు—

'మీకు పోయేది ఏమీ లేదు కాని, మరో ప్రపంచం లభించవచ్చు. గందర గోళం శక్తులన్నీ ఐక్యం అగుగాక.'

పెట్టుబడిదారుల వేటకుక్కలు

ఈ విమర్శని ప్రభుత్వం ఎలాగ ఎదుర్కొంది? చెక్కు చెదరలేదుకదా, భారతదేశంలోని పత్రికలు పెట్టుబడిదారుల వేటకుక్కల కింద నిరసించింది. కుక్కలు మొరగ వచ్చు కారవాన్ సాగిపోతూ ఉంటుంది. (కొన్ని పత్రికలు అన్నిటికీ చప్పట్లు కొట్టాయి అవి శ్రీ కోసిజిన్ చెప్పినట్లు ఆడే బొమ్మలని అందరికీ తెలుసు. అవి అంతఃపురం లో ప్రవేశం కల పత్రికలు . .).

కొందరి దోరణి సహేతుకంగా ఉంటుంది. ఉద్యోగాలు పోతే నేరస్థులని గురించి రాస్తారు. ఉద్యోగాలు ఉన్నప్పుడు ముఖస్తుతులు రాయటానికి సందేహించరు.

సోషలిసమ్ కోసం సేవ

ఒక వాదం ఇలా ఉంది— సర్వజ్ఞులయిన పరిపాలకులని విమర్శించే బదులు తీరు తెన్నులు తెలుసుకుని పత్రికలవారు తమకి తామే ప్రధానమంత్రి సోషలిసమ్ కోసం చేస్తున్న సేవని బలపరచాలి.

నేరం చెయ్యరాదనేవారు వెర్రివారుట. సరే మనందరికీ దారిద్ర్యం అంటే భయం. దారిద్ర్యం అంటే ఏమిటో మేడమ్‌గాంధిగారి మంత్రులలో కొందరికి మాత్రం తెలుసు అందుకనే, బీదవారిని బాగుపరచలేకపోతే అందరినీ వారి స్థాయికి దింపుదామని వారు నిర్ణయించు కున్నారు

అభివృద్ధికావాలంటే ధనం కావాలి. ధనం ఎలా వస్తుంది? పన్నుల ద్వారా, పొదుపుద్వారావస్తుంది.

పన్నులు - పొదుపు

పన్నులు ఎక్కువ అయితే పొదుపు తగ్గుతుందన్న విషయం మేడమ్‌గాంధిగారి ఆర్థికోపాధ్యాయులకి తెలిసే ఉండవచ్చు వారు పుస్తకాలు చదువుతూనే ఉంటారు. ప్రభుత్వం చిన్న మొత్తాల పొదుపు కోసం ఎంత కష్టపడ్డా అవి అనుకున్నంత ఎక్కువ కాలేదు.

శ్రీ మొరార్జీదేశాయి నిర్బంధ పొదుపు స్కీమ్‌ని తయారు చేశారు. వారి వారసులు శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు దానిని రద్దుచేసి అంతకన్నా క్లిష్టమయిన ఏన్యుయిటీ డిపాజిట్ స్కీమ్‌ని తయారు చేశారు.

వితంతువులు, అనాథలు

ఇదంతా ఇలా ఉండగా ఎందరో మామూలు జనం (వితంతువులు, అనాథలు మొదలయినవారు) బాంక్‌లు తమ పట్ల శ్రద్ధ చూపిస్తున్నందువల్ల తమ ధనాన్ని వాటిలో వేసుకుంటూ వచ్చారు.

ఇది ఘోరమయిన విషయం కదా?

ప్రభుత్వరంగంలోని సంస్థలు ఉజ్వలంగా పని చేస్తూ ఉంటే కొందరు తెలివి తక్కువవారు ఎందుకు ఇలా ప్రయివేటురంగం బాంక్‌లలో డబ్బులు వేస్తూ వచ్చారు ?

బిర్లా, జెయిన్, భరత్‌రామ్

బాంక్‌ల లెక్కలు చూస్తే అవి కొన్ని వేల కోట్లు సేకరించి— వితంతువులు, అనాథలు మొదలయిన వారివద్ద నుంచి— వాటిని బిర్లా, శాంతిప్రసాద్ జెయిన్, భరత్‌రామ్ వగయిరా సంస్థలని పెంచగలిగాయి, అని తెలుస్తుంది బాబూ ఎస్ దత్‌గారు తమ లైసెన్సింగ్ విధానం నివేదికలో వీరి పేర్ల జాబితాని ఇచ్చారు.

చెడపనులు

వీరంతా— బిర్లాలు, టాటాలు, జెయిన్లు, భరత్ రామ్‌లు— చాలా నేరాలు చేశారు సిమెంట్ ఫ్యాక్టరీలని కట్టారు చక్కెర మిల్లులని నిర్మించారు. అంతేకాదు, వారు ఇంకా చెడ్డ పనులు చేశారు. తమ కంపెనీలని సరిగ్గా నడుపుకున్నారు! ఈ చివరి పనిచేసి ప్రభుత్వరంగం కంపెనీలకి కీర్తి నష్టం తీసుకు వచ్చారు

బాంక్‌లలో ఉన్న డబ్బుని బిర్లా, టాటాలు దండగ చేశారు; ప్రభుత్వం చేతికింద ఉన్న డబ్బుని ఎంతో సద్వినియోగం చేశారు—మంత్రుల విదేశీ పర్యటనలతో, అటువంటి సత్కార్యాలతో ఇటీవలే రాజధానిలో ఒక ఓపెన్ ఎయిర్ థియేటర్ కట్టారు దాని కర్చు? అంతగా ఏమీ లేదు 27 లక్షల రూపాయలు మాత్రమే. దాని నిర్వహణ వ్యయం? అదీ తక్కువే— సంవత్సరానికి 15 లక్షల రూపాయలు, ఈ థియేటర్‌వల్ల కొందరికి పేదరికం తగ్గిపోయింది. (అదే కంట్రాక్టర్లకి)

రియాక్షనరీ కార్యక్రమాలు

భారతదేశంలో చాలా రియాక్షనరీ పనులు కొన్ని జరుగు తున్నాయి. మచ్చుకి చెప్తాను— పాశ్చాత్య దేశాలు ఇచ్చే సహాయం, ప్రత్యేకంగా అమెరికా ఇచ్చే సహాయం. ఇది భారత ఆర్థిక వ్యవ

న్ధని చెడుమార్గాన పెడ్తాంగని మేడమ్ గాంధీ గారు పోయిన ఏడే సెలవిచ్చారు. శ్రీ దేశాయ్ బాంకులని జాతీయం చెయ్యటం మంచిది కాదన్నారు, పాశ్చాత్య దేశాల సహాయం చెడు కాదన్నారు.

శ్రీ జ్యోతిబాసూ పురోగమనవాది. ప్రజల నిరసన ప్రదర్శనలలో ప్రభుత్వంవారే పాల్గొని మార్గ దర్శకులు కావాలని ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా నిరూపించారు.

నిక్సన్ పట్ల నిరసన

త్వరలో శ్రీ నిక్సన్ భారతదేశం వస్తారు. మేడమ్ గాంధీగారు స్వయంగా ఒక ప్రదర్శనలో పాల్గొంటే బాగుంటుందని కొందరి అభిప్రాయం. 'నిక్సన్ తిరిగి వెళ్లిపో!' 'భారతదేశంలో యాంకీలు వద్దు! 'యాంకీల పాపపు డాలర్లు మాకు వద్దు!' అనే పోస్టర్లని కొన్ని ఈ ప్రదర్శనలో చూపించ వచ్చు. ప్రపంచ బాంక్‌ని అంగడి మూయ్యమని చెప్ప వచ్చు, భారతదేశానికి సహాయం చేసే పాశ్చాత్య దేశాలని మూటముల్లె కట్టుకుని పొమ్మనవచ్చు. ఆర్థికశాఖ కూడా తమదే కాబట్టి మేడమ్ గాంధీ అడ్డు లేకుండా ఈ పనులన్నీ చేయించవచ్చు. ఇవే కదా భారతదేశంలో ప్రజాస్వామ్యంతో కూడిన సోషలిసాన్ని అరికట్టాయి!

మఠాలు, దేవస్థానాలు

మరొక్కరంగం మిగిలింది. సర్ సి. పి. రామ స్వామి అయ్యర్‌గారు తమ నివేదికలో మఠాలని, దేవాలయాలని కూడా సమాజం అదుపులో ఉంచా లని సూచించారుట. ఈ నివేదికని కొందరు రియా క్షనరీలు తొక్కివేశారు. దక్షిణ భారత దేశంలో ఒక దేవస్థానానికి ఏటా ఒక ఉక్కు మిల్లు నిర్మించ గలిగే స్తోమత ఉంది. రాజస్థాన్‌లో కూడా ఒక గొప్ప గుడి ఉంది.

ఈ డబ్బంతా దండగ అవుతోంది.

దీనిని సద్వినియోగం చెయ్యటానికి ధైర్యం కావాలి!

ధైర్య, సాహసాలు మేడమ్ గాంధీకి పుష్కలంగా ఉన్న గుణాలని అందరికీ తెలుసు.

...వక్ఫ్‌లు, గురుద్వారాలు

మరొక ఆర్డినెన్సు జారీచేసి మేడమ్ గాంధీ గారు మఠాల, దేవస్థానాల డబ్బుని సద్వినియోగం చేసి భారతదేశంలో దారిద్ర్యం పోగొట్టటానికి మరొక ముందడుగు వెయ్యగలరు! మఠాలు, దేవ స్థానాలు ఉన్న జాబితాలో మహమ్మదీయుల వక్ఫ్ లనీ, సిక్కుల గురుద్వారాలనీ మాత్రం చేర్చరాదు?

ఈ వక్ఫ్‌లూ, గురుద్వారాలూ సోషలిసానికి విరోధమయిన భావాలని ప్రజలలో కలుగ చేస్తు న్నాయి కదా?

బిర్లా మందిరంవల్ల నష్టం!

కొందరు పారిశ్రామిక వేత్తలు వీటి ద్వారా పన్నులని ఎగగొట్టగలుగు తున్నారు! శ్రీ చంద్ర శేఖర్ చేసిన మహత్తర కృషిని చెడగొట్టగలుగు తోంది ఢిల్లీలోని బిర్లా మందిరం!!

ఇవన్నీ 'అవీ—ఇవీ' అన తగ్గ ఆలోచనలు కావు. భావిని సూచించే శకునాలు. శ్రీకృష్ణ

కొత్త యుగానికి ప్రారంభం!



ఆర్మ్‌స్ట్రాంగ్ తండ్రి ప్రస్తుతం ఓహాయో రాష్ట్రంలో ఒక శాఖకి అసిస్టెంట్ డయిరెక్టర్. ఈయనకి చిన్నప్పటినుంచి విమానాలంటే ఇష్టం; చిన్నప్పుడే చిల్లర ఉద్యోగాలుచేసి సంపాదించుకున్న డబ్బుతో (16వ ఏట) పయిలట్ లయిసెన్సు తీసుకున్నాడు! పర్‌డ్యూ విశ్వవిద్యాలయంలో ఎయిరోనాటికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్న నెయిల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబాన్ని పయి బొమ్మలో చూడవచ్చు—భార్య జేనెట్, ఎరిక్ 12, మార్క్ 6.

[illegible] మొట్టమొదటి స్పుట్నిక్ అమాంతంగా ఒకరోజు ఆకాశంలో తిరుగుతున్నదని ప్రపంచం విన్నది! అపోలో—11 సంగతి వేరు. ఈ వ్యోమనౌక ప్రయోగం వెనుక ఎంతో చరిత్ర ఉంది. అంతా సర్వ ప్రపంచానికి తెలిసినదే. మానవుడు తొలి సారిగా చంద్రమండలంమీద కాలుపెట్టిన సంఘటనకి అన్నివిధాలుగా వీలయినంత ప్రచారం కూడా జరిగింది.

అందుకనే ముగ్గురు అమెరికన్ నావికుల ప్రయాణాన్ని కొలంబస్ అమెరికా అన్వేషణతో పోల్చటం అంత సరికాదేమో! కొలంబస్ ప్రయాణం శాస్త్ర, సాంకేతిక యుగాలకి కొంచెం ముందటిది; కేవలం కొందరి ధైర్య సాహసాలమీద ఆధారపడినది. అపోలో నావికుల యాత్ర కొన్ని శతాబ్దాల శాస్త్ర పురోగమనానికి నిదర్శనం. ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి, వినియోగానికి చిహ్నం. శాస్త్రపరిశోధన ఇప్పుడు వచ్చినట్లు కాక 'శాస్త్రీయంగా' జరుగగలదనటానికి కూడా చిహ్నం.

అయితే, ఇది ముగ్గురు అమెరికన్ అంతరిక్ష నావికుల ధైర్య సాహసాలని తగ్గించి చెప్పుకొనటం కాదు. ఆర్మ్‌స్ట్రాంగ్, ఆల్‌డ్రిన్, కాలిన్స్ పేర్లు అంతకిముందు ఆకాశంలోకి ఎగిరి వెళ్ళిన వారి పేర్లతో సహా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి. వారు మానవుడి ధైర్య సాహసాలకి చిహ్నాలు.

మానవుడు భూగోళాన్ని వదిలి ఖగోళాల వయిపు ఎగిరి వెళ్ళిపోగలిగిన యుగం ప్రారంభం అయింది. అపోలో—11 ప్రయోగాన్ని అన్నివిధాలా సక్రమంగా జరగటానికి కృషి చేసిన వారందరివలె వీరూ ఈ కొత్త యుగానికి చెందిన వారిలో మొదటి వారవటానికి సందేహం లేదు!

ఆల్డ్రిన్ తండ్రికూడా గొప్ప విమాన చోదకుడుగా పేరుపొందినవాడే. ఆయన సుప్రసిద్ధ విద్యాసంస్థ ఎమ్. ఐ. టి. లో ఆకాశయాన శాస్త్రంలో డాక్టరేట్ పుచ్చుకున్నారు. ఆల్డ్రిన్ సిద్ధాంతాలు వ్యోమగమనానికి ఎంతో తోడ్పడ్డాయి. ఆయన మంచి ఆటగాడు. మంచి ఫుట్‌బాల్ ఆటగాడు. ఆల్డ్రిన్ భార్య జోన్. పిల్లలు జె. మైకేల్ 14 (ఎడమవైపు వెనకగా), ఆండ్రూ 11, జానిస్ 12 వీరి ఈ బొమ్మలో ఆల్డ్రిన్‌తోబాటు చూడవచ్చు. ▶





◀ అపోలో-11తో వెళ్ళిన మిగిలిన ఇద్దరిలాగే మైకేల్ కాలిన్స్‌కూడా 1930 లో జన్మించాడు. ఆయన ఎత్తు 5 అడుగుల పదకొండు అంగుళాలు. ఈసారి కాలిన్స్ అపోలో నుండి దిగకపోయినా ఇంతకుముందు ఆయన 'గగనవిహారం' చేసినవాడే! ఒక పెద్ద మిలిటరీ అధికారి కుమారుడయిన కాలిన్స్ రోములో పుట్టారు. అమెరికా మిలిటరీ అకాడమీలో పట్టభద్రులయిన వీరి, భార్య పాట్రీషియా. ముగ్గురు పిల్లలు, కాథలీన్ 10, యాన్ 6, మైకేల్ 7 ని ఈ బొమ్మలో చూడవచ్చు. కాలిన్స్‌కి మంచి ఛలోక్తులు విసిరేవాడనే పేరు ఉంది. 'మానవుడు ఎక్కడికి వెళ్ళాలనుకున్నాడో అక్కడికి ఎప్పుడూ చేరుకుంటూనే ఉన్నాడు. ఏదైనా ఎన్నుకునే అవకాశం ఉండికూడా ఎదురుకుంటూ ఎంతో ముఖ్యమయినదానిని పోగొట్టుకుంటాడు. ఇది నా అభిప్రాయం' అన్నాడాయన ఒకసారి.


తండ్రీ కొడుకుల దౌర్జన్యం

సరాయి కొబ్బరిచెట్టెక్కి 22 ఏళ్ళ పెరుమాళ్ అనే అతను కొబ్బరి మట్టలూ అవీ కోశాడట. దాంతో ఆచెట్టు సొంతదారు దొరసామి పెరుమాళ్‌ని గూబ పగల కొట్టాడట. దాంతో పెరుమాళ్ళూ, అతని తండ్రి కలిసి దొరసామి యింటిమీద విరుచుకు పడ్డారట. అన్నం తింటున్న దొరసామి బయటకు వచ్చేసరికి పెరుమాళ్ తండ్రి అతన్ని ఎగిరి తన్ని. క్రింద పడ్డాక మీదెక్కి కూర్చుని, 'కత్తితో పొడిచి చంపెయ్' అని కొడుకును హెచ్చరించాడట. తండ్రికొడుకులిద్దరూ చేరి దొరసామిని వాళ్ల యింట్లోనే హత్య చేశారట. ఈ తండ్రికొడుకులకు చట్టం ఉరిశిక్ష విధించి తనకర్తవ్యం నెరవేర్చుకుంది. అప్పట్లో ఈ ఘోరం చెంగల్పట్టుకు చెందిన పౌరిపాకం అనే గ్రామంలో జరిగింది.

తియ్యని రహస్యం

సాంపమలి నెర్సైన జోహాన్నాడి ఫ్లడిన్ అనే ఆమె కడుపులో నొప్పిలాంటిది ఏదో తనకు వస్తోందని, అదో రకం వ్యాధి అని అనుమానించిందట. కొంతమంది ఆ మాత్రలు కూడా వేసుకుందట. చివరికి ఆమె డాక్టరు శరణు కోరితే, 'మతి కేన్సర్' అన్నారట. అయితే మంగళవారం 3వ తేదీన ఆమెకి నొప్పులు ఎక్కువైయ్యేసరికి ఆ బాధ ఏమిటో గ్రహించి పక్కింటి వారి సాయం కోరి చక్కని పండంటి ఆడపిల్లను కనేసిందట. 'నా కడుపులో యింత తియ్యని రహస్యం దాగి వున్నట్లు నేను తెలుసుకోలేకపోయాను.' అందట. ఇది ఓ జోహాన్స్‌బర్గ్ ముచ్చట!





నూతిలో తల - పొదలో మొండెం

29వ తేదీన చండీఘర్ ప్రాంతంలో ఒక నూతిలో ఒక తల దొరికిందట. ఆ అయిదురోజుల తర్వాత ఒక పొదలో ఆ తలమొండెం దొరికిందట. ప్రేమ వ్యవహారంలో ఎవరో హత్యచేసి వుంటారని అనుమానిస్తున్నారు ఆ (?) వ్యక్తిని.

టాక్సీ డ్రైవరుపై అఘాయిత్యం

బొంబాయిలో బైకుల్లా బ్రిడ్జివద్ద ఒక అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు చెంబూర్ వెళ్ళాలని ఒక టాక్సీని మాట్లాడుకున్నారట. తీరా చెంబూర్‌కు వెళ్ళాక, ఒకచోట కారు ఆపమని, దిగి చకచకా వెళ్ళిపోతుంటే టాక్సీడ్రయివరు పరశురావ్, [illegible]రావ్ తనకు డబ్బు యివ్వాలని గుర్తుచేశాడట, దాంతో ఆ నలుగురిలో ఒకతను రివ్వున వచ్చి కత్తితో పరశురావ్‌ని గాయపరచాడట. మిగతా వాళ్ళంతా కలిసి పరశురావ్ వద్ద వున్న 70 రూపాయలూ లాక్కుని, టాక్సీమీద ఎక్కి పోయారట కాళ్ళీడ్చుకుంటూ, గాయం తడుముకుంటూ పరశురావ్ యీ సమాచారం పోలీసులకు తెలియజేశాడట.

* * *

బిల్హోమాజి అనే హరిజనుడు తనకు కూలిడబ్బులు కొంచెం ఎక్కువ కావాలని అడిగినందువల్ల అతన్నీ, అతని కొడుకును కొట్టి చంపేశారట. ఇది గిదా పూరితోని ముచ్చట.

ప్రేమలేఖల వేలం


జూలియట్ డ్రావెట్ అనే ఒకనటీమణి 1830 ప్రాంతంలో విక్టర్‌హ్యూగోని కలుసుకుందట. ఆనక అతనిని ప్రేమించి రోజూ, రోజుకి కొన్ని ప్రేమలేఖలు రాసేదట. ఆరకంగా ఆమె యాభై సంవత్సరాలు రాసిన ప్రేమలేఖలు మొత్తం 18 వేలట. ఆ ప్రేమలేఖల్లో 16,500 ప్రేమలేఖలు వేలం వేస్తే విపరీతమైన డబ్బు వచ్చిందట. ఇది ఫ్రెంచి దేశం ముచ్చట.


* * *

'ప్రిన్సిపాల్‌ను తీసివెయ్యాలి' అని ఇండోర్ క్రిస్టియన్ కాలేజి విద్యార్థుల నినాదాలకు, మద్దతుగా చేస్తున్న మరికొన్ని కాలేజి విద్యార్థుల నినాదాలకు సమాధానంగా ఆ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. నాగెన్ నిరశనవ్రతం ప్రారంభించారట.

నల్లుల్లో విటమిన్‌లు, ప్రొటీన్‌లు

నల్లులను పట్టి, వంటి పక్కగా నేతిలో వేయించుకుని, ఉప్పుకారం జల్లుకుని తింటే శరీరానికి చాలా మంచిదట. నీరు ఎటుంటే గనుక నల్లి కుట్టే ఆ నల్లిని చంపి టక్కున నోట్లో వేసుకుని [illegible] తింటే వంటికి మంచిదన్న మాట. నల్లుల్లో మాంసకృత్తులు, విటమినులు కొల్లలుగా వుంటాయట. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ రోనాల్డ్ టైలర్ గారు కాలిఫోర్నియాలో అన్నారట. సీతాకోక చిలుకలు, గొల్లభామలూ యివన్నీ తినగా లేనిది నల్లి తినడానికేం బాధ! అన్నారటాయన. ఆఫ్రికాలో వెయించిన, ఉడకబెట్టిన గొల్లభామలను, మొదలైన వాటిని తింటారని, కొన్నిదేశాలలో చీమలను వేయించి, ప్లాస్టిక్ సంచిలలో పెట్టి అమ్ముతారని కూడా ఆయనన్నారట.




అంటే గోతులుగో గోతులుగా ఉంటుందా?
చందమామ చూద్దాం! జాబిల్లి చూద్దాం..
చందమామ వంటి మీ ముఖం మన్నగం అందంగా మారాలంటే మాకంపెనీ స్నో వాడండి!
ఇక్కడెవరూ లేరుగా! సిగ్గెందుకు?
చక్రధర్.

వేదం వేంకటరాయ శాస్త్రి

తెలుగువా రెవరు?

ఆంధ్ర — తెలంగాణా వివాదాల వల్ల 'ఆంధ్ర' శబ్దానికి ప్రాముఖ్యత పెరిగి నట్లు తోస్తుంది! అందుచేత ఆంధ్రపత్రిక సౌమ్య సంవత్సరాది సంచికలో పడిన శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారి వ్యాసం ఒకటి తిరిగి అచ్చువేస్తున్నాము.

క్రీస్తు శకం ప్రారంభం కావటానికి కొన్ని వందల సంవత్సరాల ముందు కొందరు సముద్రం మీదుగా దక్షిణ దేశానికి వచ్చారనీ, వారే ద్రావిడభాష(లు) మాట్లాడేవారనీ, వారు క్రమంగా దక్షిణ భారతదేశం అంతా వ్యాపించారనీ హెయిమెన్ డార్ఫ్ అనే మానవ శాస్త్రజ్ఞుడు కొంతకాలం క్రితం ప్రతిపాదించాడు. శ్రీ నీలకంఠ శాస్త్రిగారు కూడా ఈ సిద్ధాంతంలో చాలా నిజం ఉన్నదన్నట్లు రాశారు.

శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారి వ్యాసం పాఠకులకి సరికొత్త 'దృక్పథాలు' కొన్ని ప్రసాదించగలదని నమ్ముతున్నాము.

— సం॥

లోక వ్యవహారమందును, వాఙ్మయమందును ఆంధ్రము, తెలుగు అను పదములు సమానార్థకములుగా ప్రయోగింపబడుచున్నవి. ఆంధ్రులే తెలుగువారు. తెలుగువారే ఆంధ్రులు అనుటలో ఎవరికిని సందేహముగాని, ఆశ్చర్యముగాని లేదు. కాదన్ననే వింత. కాని నిజముగా ఆశ్చర్యపడవలసినది ఒకరికే రెండు పేర్లుండుట. తమిళ, మలయాళ, కన్నడములకుగాని, మహారాష్ట్ర గూర్జర వంగాది భారతీయ భాషలకుగాని, ప్రపంచములో తెలిసినంతవరకు మరియే భాషకుగాని రెండు పేర్లు లేవు. ద్రావిడ తమిళ శబ్దములొకటే. ద్రవిడమే తమిళమైనదో లేక తమిళమే త్రమిళ, ద్రమిళ, ద్రవిడ ద్రావిడములుగా పరిణమించినదో గాని అన్నియు ఒక్క పదము యొక్క వికారములే. అట్లే కన్నడమే కర్ణాటకము. సంస్కృతమును దేవభాష, గీర్వాణి ఇత్యాదిగా చెప్పుట వలన అవి వేరు పేర్లని తలంపరాదు; విశేషణములు. ఆంధ్రమునకు తెలుగు అట్టిదికాదు. పూర్తిగా సంబంధములేని రెండు పదములు మన భాషకు పేర్లుగా నుండుటయే వింత. దీనిని గూర్చి పండితులను, చరిత్రకారులును ద్రావిడ భాషా తత్త్వనిర్ణయ సంబంధమున చర్చచేసినను, మనభాషకు రెండు పేర్లేలయనుటను గూర్చి చింతించినట్లు కానరాదు. ఆంధ్ర, శబ్దము ప్రాచీనమే. ఐతరేయ బ్రాహ్మణము నుండియు, పురాణముల కాలమునుండియు కనబడుచున్నది. ఆంధ్ర శాతవాహన రాజులు దక్షిణాపథమును పాలించినదియు, ఆంధ్రపథము జాతి వాచకముగా నుండుటయు స్పష్టమే. వీరు తమిళుల కుత్తరమున నుండినందున వీరిని తమిళులు 'వడుగరు' (ఉత్తరాదివారు) అను నర్థమును పేర్కొనుచుండిరి. 'వడుగవళి' అనగా 'ఆంధ్రాపథము.'

కాని ఇంత ప్రాచీనకాలమున తెలుగు తెనుగు అను పదములు భాషనుగూర్చిగాని, జాతినిగూర్చిగాని కానరావు. ఆంధ్రభాషలో ప్రాకృత పదములు కోకొల్లలు. ఇవి ద్రావిడ పదములా ప్రాకృత పదములా యనియు సందేహమే. తర్వాతి కాలపు తెనుగు భాషలోని శబ్దములు ప్రాచీన ప్రాకృతములలో కనబడినంత మాత్రమున తెలుగు నాటినుండి కలదని గాని ప్రాకృతముమీద ద్రావిడభాషా ప్రభావమనిగాని, ద్రావిడముమీద ప్రాకృత ప్రభావమనిగాని నిర్ణయింపలేము. ఆంధ్రభాష ఎంత ప్రాచీనమో తెలుగుకూడ అంత ప్రాచీనమనుటకు ప్రమాణములు లేవు. ఏకకాలమున రెండు పేర్లుద్భవించి యుండుననుటకు తగిన చారిత్రకాంశములను లభింపలేదు. తెలుగు అను వ్యవహారము క్రీ. తర్వాత కొన్ని శతాబ్దములకే కనబడుచున్నది. నాగబు (నాగంబు) పదమును బట్టి చూచిన తెలుగు బాషా స్వభావము ప్రాచీనమనియే చెప్పవలసి యున్నది. ఇది ప్రాకృత మర్యాదకాదు. ఏదో దేశియము. తర్వాత తెలుగనబడినది. ఏలయన క్రీస్తుకు పూర్వము నుండియు తెలుగుండియుండిన ఎక్కడనైనను ఆ పదమో, దాని పూర్వరూపమో చిక్కదా? అగత్తియం అను తమిళ లక్షణ గ్రంథములో 'తెలుంగు' పదమున్నది. కాని తమిళ పండితులు ఇది ప్రాచీనము కాదనియు, అర్వాచీన విషయము లెన్నియో ఇందు ప్రక్షిప్తములు కలవనియు చారిత్ర కాధారముగా పనికిరాదనియు త్రోసివేసినారు. పుతనానూరులో 'ఆయ్ అండిరన్' ఒకడు కలడు. ఇతడు ఆంధ్రు డేమోయని మహాకవి ము. రాఘవయ్యంగారు శంకించినారు. కాని తెనుగని ఎక్కడను లేదు. తర్వాతి కాలమున విద్ధసాలభంజికలో రాజశేఖరుడు 'త్రిలింగాధిపతి' యని ప్రయోగించెనని మిత్రులు ఆరుద్ర గారు వ్రాసినారు. ఇది త్రికళింగాధిపతి యనుటకు అనంతరలేఖకుని పొరపాటుగానుండును. ఎందులకనగా ఈ కథను గ్రహించిన మంచన తెనుగుమీద అభిమానము కలవాడు, తెనుగువాడు, తన కాలమునకు ప్రచారమునకు వచ్చి అందరికిని అభిమానపదముగా నుండుదానిని మాని 'కళింగలో త్రపురి' యని యేల మార్చును? కావ్యముగా మూలమును మార్చి పేళ్లల్లో కొంతమార్చినను తనదేశము పేరు స్పష్టముగా కనబడుచున్నదానిని మార్చు బెందులకో!

కాబట్టి త్రికళింగమేగాని త్రిలింగమైయుండదు. రాజశేఖరుని నాటికి త్రిలింగ రూపము రాలేదు. మార్కండేయ వాయు పురాణములలో 'త్రిలింగ' పదమే కనబడుచున్నదని శ్రీ ఆరుద్రగారు తెలిపియున్నారు. కాని పురాణములలో ఫోర్జరీలు ఎక్కువ. ఇంతేగాక ఈ 'త్రిలింగ' 'తిలింగ' శబ్దములకును, త్రికళింగ శబ్దమునకును బొత్తిగా సంబంధము లేదు. కళింగము మూడు భాగములు. ఉత్తర మధ్య దక్షిణములు. ఉత్తర కళింగమే ఉత్కళము. ఉదీచ్యదేశముగాన ఉదీచ్య క్రమముగా ఒడిస్సా, ఒరిస్సాగా మారినది. ఇదంతయు తెలిసినదే. ప్రాచీన పురాణములలో త్రిలింగపదము లేదని శ్రీ మేడేపల్లి వెంకట రమణాచార్యులవారు తెలిపియున్నారు. (ఆం. సా. ప. పత్రిక. 2 ద్రావిడ బాషా పంచకము.) క్రీ. శ. 150 నాటి గ్రీకు భూగోళజ్ఞుడు టాలెమీ 'ట్రిలింగా' అను పదమును వాడెనని మనవారు తలంచిరిగాని పొరపాటు. అది 'ట్రిగ్లిప్టాన్' కళింగమని పెద్దల యభిప్రాయము. ఈ సందర్భమున శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారిని స్మరింపవలెను. ఇట్లు వ్రాసియున్నారు:

'క్రీస్తుశకము పదునాలుగవ శతాబ్దము మొదటి పాదములో ఓరుగంటి ప్రతాపరుద్రుని ఆస్థానమందుండిన విద్యానాథకవి తన ప్రతాపరుద్రీయమున ఈ దేశమును తిలింగ, తెలుంగ, తెలింగ అనికాక త్రిలింగమని వ్యవహరించి, శ్రీశైల కాళేశ్వర, దాక్షారామములలోని మూడు శివలింగములవలన ఈ దేశమునకు ఆ పేరు కలిగినట్లు—

> 'యైర్దేశః త్రిభి రేవ యాతి మహతీం
> ఖ్యాతిం త్రిలింగాఖ్యయా
> యేషాం కాకతిరాజకీర్తి విభవైః కైలాస
> శైలః కృతః
> తే దేవాః ప్రసరత్ప్రసాద మధురాః శ్రీశైల
> కాళేశ్వర
> ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం త్వచ్ఛ్రే
> యసే జాగ్రతు.'

అను శ్లోకములో సూచించి యున్నాడు. ఈ శ్లోకము శైవమతావలంబకుడయిన ప్రతాపరుద్ర చక్రవర్తిని గురించి చెప్పినది. కళింగము మినహాగా ఇప్పటి యాంధ్రదేశమునకంతకును కాకతి ప్రతాపరుద్ర చక్రవర్తి ప్రభువగుటచేత శివక్షేత్రములైన శ్రీశైల కాళేశ్వర దాక్షారామములను ఉజ్జాయింపుగా ఎల్లలుగా చెప్పి ఆ క్షేత్రములలోని శివలింగములవలనే ఈ దేశమునకు త్రిలింగమను పేరు కలిగినట్లు కవి చమత్కరించినాడు. అంతియే కాని అంతకు పూర్వ మీ దేశమునకు త్రిలింగమను పేరు ఉండినట్లు వాఙ్మయములోకాని శాసనములలో కాని ఎందును కానరాదు. కాకతి రాజ

న్యులు శైవులని, వారు పాలించిన కాలములో ఆంధ్రదేశములోని ప్రధాన మతము శైవమే యని మన మీ సందర్భమున జ్ఞాపకముంచు కొనవలసి యున్నది. కాని కొందర నుకొనునట్లు త్రిలింగపదము ప్రాచీనమైనది కాదు, తెలుగు— త్రిలింగ త్రికళింగ పదముల నుండిగాని, తెనుగు త్రినగముల నుండిగాని రానులేదు. విద్యానాథుడు చెప్పిన విషయమునే అతనికి తరువాతికాలపు తెలుగు లక్షణవేత్తలు ఉటంకించినారు.' (తెలుగు విజ్ఞాన సర్వస్వము సంపు 3 పు 2.)

ఇందులకు తగినట్లు విద్యానాథునికి కొంత ముందువాడు రుద్రాంబ సమకాలికుడు, యాదవరాజ మంత్రి హేమాద్రి, తన వ్రతఖండమున కాకతీయు లను 'తిల్లింగాధిపతు'లని వర్ణించినాడు. పదు మూడవ శతాబ్ది.

'తిల్లింగాధిపతేః పశోః విశసనం
రుద్రస్య రౌద్రాకృతేః.......

'తిల్లింగ క్షితిపాల తూలనివయ ప్రక్షేప చండానిలో......'

దీనింబట్టి యే ఉత్తరదేశస్థులును వారి ననుసరించి మహమ్మదీయులును ఆంధ్రదేశమందలి తెలంగాణా భాగమును తిలంగ్ అని వ్యవహరించిరి. మేరుతుంగా చార్యుడు (13వ శతాబ్ది) ప్రబంధ చింతామణిలో క్రీ. శ. 973—997 నడుమ పాలించిన తైలప చక్రవర్తిని, పశ్చిమ చాళుక్య కర్ణాటకుని తెలంగాణ ప్రభువనెను.

కాని ప్రాచీనాంధ్ర కవులు తిల్లింగ అనిగాని తెలింగ అనిగాని వ్రాయక తెనుంగనియు, తెలుగనియు, వ్రాసిరి. శాసనములలో తెలుగుపదమే గాని తెనుగు పదము కానరాదు. 'నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితారచన బంధురు డయ్యె' త్రినగముల భావము నాడుండినదో లేదో వేరువిధముగా తెలియదు. తెలుగుపదమే ఉచ్చారణలో తెనుగైనదో పరిశోధింప వలయును. మూడు కొండలు (త్రినగములు) అను భావము వెలనాటి దుర్జయులకుండినట్లు వారి పంద్రెం డవ శతాబ్ది శాసనపుదని శ్రీ శర్మగా రీ శ్లోకము నుదాహరించుట వలన తెలియుచున్నది.

'పూర్వాంభోనిధి కాలహస్తి శిఖరి శ్రీమన్మ హేంద్రాచల.
శ్రీశైలై ర్వలయీ కృతాంధ్ర విషయం'

దీనిబట్టి కాలహస్తి, శ్రీశైల మహేంద్రాదుల నడిమిదేశ మాంధ్రదేశమనియే గాని పైన ఉదా హృత శ్లోకమందలి కాళేశ్వర (మంథెన కాళేశ్వ రము, గోదావరీ తీరము, పూర్వపు హైదరా బాదు రాజ్యము) శ్రీశైల దాక్షారామముల నడి మిని కాదని తెలియుచున్నది. రెండును ఎంత, పరస్పర విరుద్ధములు!

కాబట్టి శ్రీ శర్మగారు 'ఈ రీతిని పూర్వ మాంధ్రదేశమున ఏ కొంత భాగమునో పరి పాలనము నెరపిన రాజులు తాము పాలించిన దేశము విస్తీర్ణముకాని, హద్దులుకాని తెలుపుచు వచ్చినారు. కాని మొత్తమాంధ్రదేశపు విస్తీ ర్ణముకాని, హద్దులు గాని తెలియవు. అందువలన పూర్వము ఆంధ్రదేశము మొత్తము పరిమితిగాని, దానిఎల్లలుగాని తెలిసికొను వీలు లేక పోవుచున్నది' అని వ్రాసినారు.

త్రినగములు త్రిలింగములు అన్న భావము వెల నాటి దుర్జయులకు ఉండగా అసలు శబ్దము తెనుగా తెలుగా యనునది అన్వేషింపవలయును. ఆంధ్రేతరులు తిలింగ్, తిల్లింగ్ అనియు దానినే తర్వాత తెలంగానాగా వ్యవహరించి నది తెలిసినది. వారెవ్వరును తెనంగ్ అని వ్యవహరింపలేద . తెలంగే. శ్రీ శర్మగారు దీనింగూర్చి వ్రాసినది— 'తెలుగు అన్నమాట నిపుడు ఆంధ్రమునకు పర్యాయ పదముగా వాడుచున్నాము. ఆంధ్రపదముతో ఏకార్థమును సాజాత్యములేని తెలుగు దానికి ఎట్లు ఎప్పటినుంచి పర్యాయపదమయ్యెనో తెలియదు. క్రీస్తు శకము పదివందలకు పూర్వపు శాసన ములలోకాని, వాఙ్మయములో కాని తెలుగు అను పదమే కానరాదు. తమిళ, కన్నడ శాసనముల లోను, ఆంధ్ర, కర్ణాటవాఙ్మయములలోను తెలుగు పదము పదునొకండవ శతాబ్దము ఆరంభము నుండియే కనబడును. శాసనములలో 'తెలుంగు భూపాలురు', 'తెల్లరవారి', 'తెలింగకులకాల' 'తెలుంగ' 'తెలుంగనమల్ల' మొదలైన పదములు కానవచ్చును. ఈ శాసనములలో కూడా 'తెలుంగ' 'తెలింగ' పదములు జనవాచకము లేదా జాతి వాచకముగనే కనబడును. ఒక్క శాసనములో మాత్రము 'తెలుంగ నాడొళగణ మాధవియ కెరగ' అని తెలుగు దేశములోని మాధవియకెరె అను గ్రామము పేర్కొన బడినది. ఇందు తెలుగువాడు అని తెలుగు దేశముదాహృత మైనది. ఆనాటి ఆంధ్రత్రిలింగ లేక తెలంగ పదములు ఒకటే జాతిని దేశమును తెలుపు టకు అభేదముగ వాడబడినవి. తెలుగునుదేశ పరముగాను, జాతిపరముగాను వాడిన శాసనము లింకను ఉండవచ్చును. కాని అవియన్నియు క్రీ. శ. పదవ శతాబ్దమునకు తరువాతివే కాని అంతకు పూర్వపువి కావు. పూర్వోక్తోదాహరణ ముల ననుసరించి చూడగా తెలుగురూపమే— అది తెలుంగు కానీ, తెలింగ కానీ—మొదటిది. పదునొకండవ శతాబ్ది మధ్య కాలమున పూర్వ చాళుక్య రాజరాజ నరేంద్రుని ఆస్థానమున నుండిన నన్నయ భట్టారకుని నాటికి తెలుగు రూపాంతరముగా తెనుగు వచ్చినది. పదునాలుగవ శతాబ్దమునకు పూర్వమందుండిన నన్నయ నన్నె చోడులు తెనుగును భాషా పరముగా వాడి యున్నారు. పదుమూడవ శతాబ్దములోని మహ మ్మదీయ చరిత్ర కారులు ఈ దేశమును తిలింగ్ (తిలింగ) అని వ్యవహరించిరి. ఈవిధముగ తిలింగ, తెలుంగు, తెలింగపదములు దేశమును భాషను జాతిని సూచించు ఆంధ్రమునకు పర్యాయ పదములైనవి.'

ఎల్లలను బట్టి, భావములు మారిన తీరునుబట్టి రుద్రుని కాలములో (క్రీ. శ. 1158—1195)ని దానికి, ప్రతాపరుద్రుని కాలములోని (1296— 1323) దానికిని ఇంత మార్పుండగా నడుమ రుద్రుని కాలమున త్రిలింగ పదము లేదు సరిగదా దాక్షారామ కాళేశ్వరము ప్రసక్తములును లేవు. కాకతీయుల యభివృద్ధిని చూడగా రుద్రదేవుని కాలముననే స్వాతంత్ర్య సంపాదనమును రాజ్యాభి వృద్ధియు సామ్రాజ్య విస్తరణమును కనబడు చున్నవి. మొదటి పర్యాయము సామ్రాజ్యపు టెల్లలు చెప్పబడినవి.

'రాజ్యం ప్రాచ్యాం లవణ జలధే స్తీర పర్యన్త మస్య
శ్రీశైలాన్తం పచరతి సదా దక్షిణస్యాం సమగ్రం
ప్రాతీచ్యాన్తు కటకనికట స్థాయినీ రాజ్యలక్ష్మీః
కౌబేర్యాశాతట విలసితా మాల్యవన్తం ప్రపేదే.'

ఇది క్రీ. శ. 1162 నాటి హనుమకొండ శాసనము.

తెలుగుభాష రెండువేల సంవత్సరాల కిందనుంచే వ్యవహారంలో ఉన్నా, తెలుగుపదాలు సంస్కృత ప్రాకృత సాహిత్యంలో చొచ్చుకుపోయినా, తెలుగు సాహిత్యం మాత్రం తర్వాత వేయి సంవత్సరాలకుగాని మొగ్గ తొడగలేదు. మరొక వింత, ఆ తొడిగిన మొగ్గ — బౌద్ధం అంతగా వ్యాపించిన ఆంధ్ర దేశంలో వైదిక మత ప్రతిష్ఠాపకమయిన వ్యాస భారతానువాదం కావడం. ఈ ఆదికావ్యాన్ని చాళుక్యరాజు రాజరాజ నరేంద్రుని కులబ్రాహ్మణుడయిన నన్నయ భట్టారకుడు రచించాడు. ఇతనికాలం క్రీస్తుశకం 1022-63.

*   *   *   *

ఆంధ్రులు మొదట ఎక్కడివారనేది ఇంకా వివాదాస్పదమే ... ఎంత ప్రాచీనమో కూడా చెప్పడం కష్టమే. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రులనే జాతి పేర్కొనబడింది. కాని, ఇది భ్రష్టులయిన ఆర్యజాతి. పురాణాల లోని అంధకులు ఆంధ్రులనే వాదం ఉంది. కాని, వీరూ ఆర్యులే, మహాభార తంలోని ఆంధ్రులు దక్షిణాపథ వాసులయిన చోళ పాండ్యాదులతోపాటు పేర్కొనబడినారు. ఆంధ్రదేశం అనార్యమని, మనువు శాసించాడు. వారి జాతినిగురించి ఇంతవాదం ఉండగా, వారి మాతృభాషను గురించీ వాదం లేకపోలేదు — ప్రాకృతమూ, తెలుగా అని. వీరిభాషా చరిత్ర తెలిసినది మొదలు ద్రావిడభాషా వర్గమయిన తెలుగుగానే కనిపిస్తున్నది. భారతదేశ మధ్య ప్రాంతంలో విస్తారప్రాంతాన్ని ఆవాసం చేసుకున్నవారయిన వీరు ఆర్య, ద్రావిడ సంప్రదాయాలు రెండూ ఆకళించుకొన్న విశిష్టజాతి అనడం సమంజసమేమో!

తెలుగువారెవరు?

కుమారుని కాలమున లేని త్రిలింగపదమును, కాదా రుద్రమదేవి కాలమునగాని అతనికి ముందుగాని, కాకతీయులు చెప్పుకొనినట్లు త్రిలింగపదమును రుద్రుడు కల్పించిన వెంటనే యాదవులు ప్రయోగించుటయు, అందులకు తగినట్లు శ్రీరంగము నందు దొరకిన తామ్రపట్టికలో త్రిలింగ శబ్దము కీర్తనముగా

'పశ్చాత్పురాస్తాదపి యస్యదేశౌ, ఖ్యాతౌ
మహారాష్ట్ర, కలింగ సంజ్ఞౌ
అవాగుదక్ పాండ్యక కాన్యకుబ్జౌ దేశః
స్మత్రత్రాస్తి త్రిలింగనామా'

అని ప్రయుక్తమై యుండుటయు చూడగా కల్యాణి చాళుక్యులు పోయి, కాలచుర్యులు ప్రాభవము తగ్గి, కాకతీయులు తూర్పు దక్షిణాపథమున కెంటకేరిని ప్రభువులని తెలియుచున్నది. పాండ్యులు నెల్లూరు వరకు వచ్చియుండిరి. చోళులు తగ్గిరి. కాన్యకుబ్జ రాజ్యము కాశీదేశమనుపేర కాకతీయుల ఉత్తరపు ఎల్లను తాకు చుండెను. పడమట యాదవుల మహారాష్ట్ర రాజ్య మభివృద్ధికి వచ్చి యుండినది. తూర్పున కళింగము. ఇవి నాటి సామ్రాజ్యములు. ఒక విధముగా నేటి ఆంధ్ర దేశమంతయు ఈ త్రిలింగములో అడగినది. ఇదంతయు రుద్రుని ప్రభావము. తమిళ మహాకవి కంబడు కూడ రుద్రుని దర్శించినట్లు తమిళములో చాటువులు కలవు.

శ్రీ మల్లంపల్లి వారన్నట్లు—త్రిలింగ శబ్దము విద్యానాథుని తర్వాతిదే యగుటకు పై త్రిలింగ త్రిలింగ త్రిలింగోదాహరణములేగాక, తర్వాతివాడైన నృకోట ఎర్రన—

'ధర శ్రీపర్వత కాళేశ్వర దాక్షారామ సంజ్ఞ
వరలు త్రిలింగా
ఖ్యమగుట నంధ్రదేశం బరుదార త్రిలింగ
దేశమన నమస్తుతులన్,
త్రిలింగ పదము తద్భవం బగుటచే

తెలుగు దేశమనగ దేటపడియె
వెనుక: తెనుగు దేశమును నంధ్రు కొంద
రజ్ఞాన పంచగతుల బరగుచుండ.'

అనుటయు, ముందువాడు కేతన తిక్కన, కాకతి గణపతి చక్రవర్తులకును కాలికుడు, తన యాంధ్ర భాషా భూషణములో ఈ త్రిలింగములను చెప్పక, తెనుంగు తెలుగు పదములను మాత్రము వాడి యుండుటయే.

'మున్ను తెనుగునకు లక్షణ
మెన్నడు నెవ్వరును జెప్పరే జెప్పెద విద్వన్నుత.'

చూడగా 'తెనుగు' పదము నన్నయలో నున్నది. కాని నాటి తమిళ శాసనములలో తెలుంగుపదమే కనబడుచున్నది. చోళచక్రవర్తి రాజాధిరాజ వేంగిని సాధించుటకు (పశ్చిమ) కల్యాణి చాళుక్యులతో యుద్ధ మొనరించిన కాలపు (1048 క్రీ. శ.) వర్ణనగల శాసనములో 'పూండూరు కటక మహానగర' మున 'పేరారు' నదీతీరమున నిడువడి తెలుంగు విచ్చయ్య తమ్ములను ఇరువురను 'శిత్తి కైపత్తరాజన్, అక్కప్పయ్యన్, పిడ్డికై (పెడకల్లు?) చోళర్ మొదలైనవారిని చెరబట్టెనని కలదు. (ఎస్. ఐ. ఐ. V 520) వీరందరు కల్యాణి చాళుక్యుల సామంతులైన తెలుగు చోళులు, కర్నూలు ప్రాంతమువారు. ఈ శాసనములోనే ఈ తెలుంగు విచ్చయ్యను 'నిడువాల్ తెలుంగు విచ్చయ్య' అని కూడ చెప్పియున్నారు. నిడువాల్ అనగా పొడుగుపాటి కత్తి లేదా ఇది 'నిడుగల్లు' కు తమిళీకరణమో! కాని ఇతడు తెలుగు చోళ బిజ్జన. ఈ శాసనము విచ్చయ్య రాజరాజ నరేంద్రునకు సమకాలికుడు. నాటికింకను భారతాంధ్రీకరణ ప్రారంభము కాలేదు. తెలుంగే తెలుంగై యుండును. ఈ కాలమందే కల్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్యమల్లుని (క్రీ. శ. 1056) హిరె హడగల్లి శాసనమున (S.I.I. IX-I. 118) తెలుగునకు తిలు అని ప్రయోగింపబడియున్నది—తెలుగు అక్షరములను గురించి. సందర్భము పేరవడంగెరె యగ్రహారమునందలి బ్రాహ్మణులలో జేమరసనువాడు ప్రశంసింపబడినప్పటిది. ఇతడు తన కీర్తిని నాలుగు విధములైన లిపులలో, వ్రాయించి నాడట—'నిజాంకమహాత్రయం మానవ మన్మథం బరెద నాటరదిం విటాచక్రవర్తి ధాత్రి సుంటనాగె తిలు లిపుళ కన్నడ నాగర దక్కరంగళ'. ఇందు కన్నడ నాగరాక్షరములు పోగా మిగిలినవి తిలు, తిపుళ. తిగుళ శబ్దములకు కన్నడములో తమిళమని యర్థము. చోళులను జయించిన కల్యాణి చాళుక్య సోమేశ్వరునికి 'తిగుళరమారి' యని బిరుదు. ఇక మిగిలిన తిలువే మన తెలుగు. చూడగా మన తెలుగునకు సమకాలికముగా మూడు రూపములు తెలుంగు, తెలుంగు, తిలు కనబడుచున్నవి. వీనిలోని తెలుంగునే ప్రయోగము లెక్కువ. తిలుగూపము ఏదో ప్రాచీన రూపముగాను తిలుంగ లిలింగ త్రిలింగ రూపములకు సాక్షిగాను తోచుచున్నది.

మరి ఈ రూపములు జాతి వాచకములా భాషా వాచకములా ఉభయ వాచకములా లేక దేశవాచకములా? ఆంధ్ర శబ్ద మొక్కటి ప్రత్యేకముగా నుండుట చేత సందేహాస్పదము. పాల్కురికి సోమనాథుడు బసవ పురాణమున తెలుంగు బొమ్మయ్య లేక బొమ్మయ్య కథలో జాతివాచకముగా ప్రయోగించి యున్నాడు. ఆంధ్రదేశమున తెలగనాయులుగా ఓరుగంటిలో తెలుగువాండ్రు 6500 ఇండ్ల వాండ్రుండిరని సిద్ధేశ్వర చరిత్ర తెలుపుచున్నది. ఆ గ్రంథము చారిత్రక ప్రమాణముగా పనికి రాదుగాని (అనగా పరిశోధించి సమన్వయ పడిన చోట్ల మాత్రము గ్రాహ్యము) తెలుగువాండ్రని యొకరుండినది కవి యెరుగునటకు చాలిన నిదర్శనము.

ఇతర జాతులు లేక వర్ణములు లేక తెగలవలె తెలుగువారొకరుండిరి. వారికిని తెలుగు చోళులకు ఏదో సంబంధమున్నది. ఈ తెలుగు చోళులు కర్నూలు జిల్లా లేక మహబూబునగరు జిల్లా పూండూరు ప్రాంతమున కనబడియున్నారు. తెలుగు చోళరాజు కుటుంబములవారే తెలుగు వారుగా నుండిరనుట కొక నిదర్శనము దొరికినది. హొయసల త్రిభువనమల్ల బిట్టిగుడు (విష్ణువర్ధనుడు) క్రీ. శ. 1136 లో తెలుగు దేశముపై నెత్తివచ్చెను. వెలనాటి గొంకరాజు శాసనములు ఆంధ్రదేశమును గూర్చి, ఆంధ్రాధిపుని గూర్చి, తమ్ముకొనట్లు, చెప్పుచున్నవి. వీరు పాలించుచుండినది కూడ ఆంధ్రదేశమే యైనను ఆంధ్రము అదేదో వేరైనట్లు చెప్పుటయు, రెండవ గొంకరాజు ఆంధ్రరాజును జయించినట్లును, రెండవ చోడరాజు కాకతిప్రోల నిర్దహనుడని యుండుటయు చూడగా వారు కాకతీయులే ఆంధ్రరాజులుగాను వెలనాటి చోళులను, ఇతర చోళులను తెలుగువారుగాను పరిగణింపబడుచు వచ్చిరనుట తెలియుచున్నది. (చూ. శ్రీ వై. యశోదాదేవిగారివ్యాసం JAHRS Vol XVIII) పైన చెప్పిన హొయసల బిట్టిగుడు కాకతీయులను తాకినట్లు లేదుగాన అతడు తాకిన తెలుగు వారు వెలనాటివారే యను శ్రీ యశోదాదేవిగారి యభిప్రాయము సమంజసముగానే యున్నది.

మన దేశంలో మొట్టమొదటి శాసనం బుద్ధుని కాలంది. బుద్ధుడు మహాపరినిర్వాణం చెందిన వెంటనే ఆయన సన్నిహిత బంధువులు నేపాల్ లోని పిప్రావా అనేచోట కట్టించిన స్తూపంమీద ఈ శాసనం ఉంది. క్రీస్తుకు 494 సంవత్సరాల ముందుది.

తెలుగులో మొట్టమొదటి శాసనం తెలుగు చోళులది. రేనాటిని పాలించిన తెలుగు చోళరాజు ఎరికల్ ముత్తురాజు దీనిని వేయించాడు. ఇది కడపజిల్లా కమలాపురం తాలూకా ఎర్రగుడిపాడు గ్రామంలోని చెన్నకేశవాలయంలో చెక్కించబడింది.

''స్వస్తి శ్రీ ఎరికల్ ముత్తురాజుల్ల కుండికాళ్ల నివబులో
ము ఇచ్చిన పన్నస దొరయ రాజుల ముత్తురాజులు నవ
ప్రియ ముత్తురాజులు వల్లవ దుగరాజులు సాక్షి
గాను ఇచ్చిన పన్నస కొట్టంబున పాలకు కుండికాళ్ల
కు ఇచ్చిన పన్నస ఇరవది యది వాల్కు మఱున్నఅపు వేల'

ఎరికల్ ముత్తురాజు రాజ్యంలో కుండికాళ్ల అనే పెద్దమనిషి ప్రోత్సాహంతో పన్నస మేరభూమి దాన మివ్వబడింది. దీనికి దుజయరాజు ముత్తురాజులు, నవప్రియ ముత్తురాజులు వల్లవ యువరాజు సాక్షులు. ఈ పన్నస కుండికాళ్లకు 24 మరుంతుర్ల మేరవేలమ కొట్టంబులోని వారకు ఇచ్చినారు దీనికాలం క్రీస్తుశకం 575

పైన 'తెలుంగ నా డొళగణ మాధవియకెరె' అని ఒక్క శాసనములోమాత్రము'...తెలుగువాడు అని దేశముధాహృతమైనది' అని శ్రీ మల్లంపల్లి వారి రచన చూచితిమిగదా. దానికి వివరణము ఇప్పుడు దొరికినది. ఈ శాసన ముదాహరించు 'మాధవియకెరె' మన గురిజాల, గుంటూరుజిల్లాలో పలనాడు తాలూకాలోనిది. (ఎపిగ్రాఫియ కర్నాటికా VII SK. 290 ముగుళగెరె) చూడగా ఇది నాడు ఆరువేల వెలనాటి రాజ్యములోనిది. అక్కడి నాడులన్నియు మనకు తెలిసినవే. తెలుంగనాడని దీనిని ప్రత్యేకముగా నిర్దేశింపగలము. దూరపు కన్నడులు తెలుగు రాజ్యమనుటకు తెలుంగనాడని రని గ్రహింపవలెను. కాబట్టి తెలుంగనాడనగా వెలనాడే, సందేహింప నక్కరలేదు. ఈ ప్రాంతము లోనే, నరసరావుపేట తాలూకాలో విప్పర్లలో దొరికిన చాళుక్య జయసింహవల్లభుని క్రీ. శ. 649 నాటి శాసనమే, తొలి తెలుగు శాసనము—ఈ ప్రాంతమునకు. అంతకుముందుని రేనాటి చోళులవి.

కాకతీయులు తెలుగుచోళులకు సంబంధపడిన వారు కానందున వారిని తెలుగువారనక ఆంధ్రు లనిరి. విద్యానాథుడును 'ఆంధ్రక్ష్మాభర్తృ' అని ప్రయోగించినాడు. కాని ప్రోలరాజు కాలము నుండి వారి రాజ్యము విస్తరించిన పిదప ఆంధ్ర తెలుగు పదములు పర్యాయపదములుగా నేర్పడి నట్లు తెలియుచున్నది. తెలుగు చోళులు, రేనాటి వారు, వెలనాటివారు మొదలైనవారే మొదట తెలుగువారు. తెలుగు, తెలుంగు తిలింగు పదములు వ్యవహారమునకు వచ్చి వెలనాటిని కూడ కాక తీయులు జయించిన పిదప అంతయు కలిసి, ఆంధ్రదేశమును, తెలుగు దేశమును ఒక్క భూభా గమై అభేదప్రతిపత్తి నందసాగినవి. ఆంధ్ర వాఙ్మయము తలయెత్తునాటికి ఈ రెంటి కలయిక కుదురుకొన్నది. వీరెక్కువగా నుండిన దేశము కడప, నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాలును యుద్ధముల వలన వేంగిదేశమును. కాబట్టి మూడు నగములను లేదా లింగములను తమకు హద్దులని పండ్రెండవ శతాబ్దమున చెప్పుకొనిరి.

'పూర్వాంభోవిధి కాలహస్తి శిఖర ప్రమన్మ హేంద్రాచల

శ్రీశైలైర్వలయా కృతాంధ్ర విషయం' అని వీరు తెలంగాణాకుగాని పడమటికిగాని సామంతులు గాను సేనాధిపతులుగాను పోయి యుండినను, కొంతకాలము వేంగిచాళుక్యులకును కొంతకాలము కల్యాణిచాళుక్యులకును సామంతులుగా నున్నను, ఈ చెప్పిన భూభాగమే తమ కాణాచిగా భావించి యుండిరనుట స్పష్టము. వీరు బలపడినది మొదలు ఈ భావ మభివృద్ధియై నన్నయ త్రినగముల నడిమిదిగాన తెనుంగని (ఎట్లు సాధించినాడో) ప్రయోగించి యుండును. తెనుగు లేక తెలుగు భాష యొక్క వ్యాప్తి చరిత్రము అన్వేషించిన పై భావము బలపడును. పైగా కాకతీయులు కూడ తెలుగువారేయనియు, తెలుగు చోళులకు దగ్గరి బంధువులనియు తెలియును.

(మిగతా పైవారం)

ప్రశ్నావళి ?

కె. రామలక్ష్మి

ఎ. వి. కె, ఆరోని

నేను లావవ్వాలనే బెంగతో మరీ సన్న బడి పోయినాను.

తగ్గడం లేదన్న బెంగతో నేను కూడా సన్న బడితే ఎంత బాగుండును చెల్లెలా!

యస్. వి. ఎసి; టి. జె ఆర్, జబ్బల్‌పూరు

నేటి వారపత్రికలలో ఎక్కువగా స్త్రీలకు అనుకూలంగాను, పురుషులను దుయ్యపట్టే రచనలనే ప్రచురించడానికి కారణం పత్రికలు చదివే వారెక్కువగా స్త్రీలేననే ఉద్దేశ్యంతో ఆధునిక మహిళా లోకాన్ని హిప్నొటైజ్ చేద్దామనా?

అదంత సులభమైతే — ఇన్నాళ్లెందుకు?. ఎప్పుడో అటువంటి రచనల అవసరం తీరిపోయేది ఈ పత్రికలు ఎక్కువగా మీరే చదివి కొంచెం ఆలోచిస్తారనేమో....

కె. పి. ఆర్, కాకినాడ

పిల్లలకి ఉత్తమాభిరుచులు అలవర చేందుకు మార్గం లేదా సోదరీ?

ఎందుకు లేదండీ? రోజా ఎన్ని అల్లాయి పదాలు విన్నా బాలమురళి కచేరీ బలవంతాన్నైనా వినిపించడం, చిట్టిబాబు వీణవాద్యం ఆనందిం చడం యామిని నాట్యం తిలకించడం లాంటివి చేయిస్తూ ఉండాలి. కొంతకాలానికి కాకపోతే కొంతకాలానికైనా మంచి అభిరుచి అదే వస్తుంది. చదవడం విషయంలో కూడా ఇంతే.

ఆర్. ఎస్. ఎమ్, కల్లూరు

మీరు మీ శ్రీవారిని 'అబ్బాయ్' అని సంబోధించడం చిత్తూరుజిల్లా రచయి తల సభలో విన్నాను. ఈ విచిత్ర సంబో ధన ఏమిటో వివరిస్తారా?

అయ్యో రామా! ఎవరి భర్తని వారి ఇష్టం వచ్చి నట్టు పిలుచుకునే స్వతంత్రం కూడా లేదా మణి గారూ!

బి. ని. ఆర్. ఆర్, తణుకు

డబ్బున్నవాడు ఎన్ని చెడ్డ పనులు చేసినా మంచిగానే చెప్పుకుంటారు. కాని సామా న్యుడు పొరపాటున ఒక తప్పుచేస్తే వాడిని జీవితాంతం ఎత్తి పొడుస్తారు. ఎందుచేత?

పొరబడుతున్నారు. చేసిన చెడ్డకి శిక్ష అనేది అనేక రూపాల్లో అనుభవిస్తూనే ఉంటారు మీరనే డబ్బున్నవాళ్లు కూడా.

ఎన్. ఆర్, కొవ్వూరు

రోజు రోజుకి తెలుగు సినిమాల్లో పెరిగిపోతున్న సెక్సుకి కొంతవరకు 'సినిమా కవులు' కూడా బాధ్యులేనేమో ?

ఎందుకూ కర్రా! కర్ణుడి చావుకి కారణాలు వెతకడం లాంటిదే—యిది కూడా.

పి. ఆర్. ఆర్, రాజమండ్రి ఉండ్రాజవరం

నేనొక యితివృత్తం యిస్తాను. నవల గాని జీవిత కథగాని వ్రాస్తారా?

మీ పొరుగాయినమీదగాని కాదు కదా కొంప తీసి! (లేకుంటే నన్ను రాయమనడం దేనికి మీరే రాసి ఉందురు అవునా?)!

ఎచ్. బి. ఎన్, భువనేశ్వరం

పరిమళా సోమేశ్వర్ 'భర్తలను లొంగ దీసుకోవడం ఎలా' అనే వ్యాసంలో సీత అనసూయ, లక్ష్మి, పార్వతి మొదలగు పతివ్రతలపై విమర్శనా దృష్టితో రాసిన రచనల ప్రభావం హిందూ స్త్రీలపై ఏ విధంగా ఉంటుందంటారు?

పరిమళ రసాయనిక శాస్త్రవేత్త కదా? శల్య పరీక్ష చేయడం అలవాటైపోయి ఉంటుంది! మీరేం భయపడకండి. ఎవరో చెప్పినంతమాత్రాన సీత సావిత్రి అనసూయల ఘనత మన మధ్య తగ్గిపోవడం అసంభవం.

కె. శా, సర్వారాయపేట

కొంతమంది ఇల్లాండ్రకు అసలు వంట పని చేసుకోడానికే తీరిక ఉండదు. అటు వంటిది మీరు పత్రిక పాఠకులకు జవాబు లిచ్చే తీరిక ఉంటుందా? లేక మీ శ్రీవారు వంటగట్రా చేస్తారా ?

మీరన్న ఆ కొంతమంది ఇల్లాండ్ర కోవలో దాన్ని కాదేమో నేను! రాయడానికే కాకుండా కబుర్లు చెప్పడానికి కూడా ఉంటూంది తీరిక. ఇక వంట నే చేస్తాను. అది బాగుండకపోతే 'గట్రా' మాత్రమే మా ఆయన చేస్తారు! మీ అనుమానం తీరినట్టేనా సోదరి?

ఇతరులకు సలహాలిచ్చే మీరు కుటుంబ నియంత్రణ జరిపారా? లేకుంటే వెంటనే జరపండి. కొడుకోసం ఆగటం ఎందుకు? ఈ రోజుల్లో కూతురైనా కొడుకైనా ఒకటే. ఏమంటారు?

చిత్తం. మీరు చెప్పినట్టే అంటాను. అయినా మీ సలహా తొమ్మిదేళ్లు లేటుగా వచ్చింది!

పి. వి. జి, మొలగవల్లి

శ్రీరామచంద్రునిపై లక్ష్మణునికున్న భక్తి గొప్పదా? లేక ఆంజనేయునికున్న భక్తి గొప్పదా ?

అన్నిటికంటె శ్రీరామునికి తన ప్రజపై నున్న మమకారం, గురి గొప్పదిగా తోస్తుంది నాకు. లేకుంటే ప్రాణసమంగా ప్రేమించిన సీతనలా అడవులకు పంపగలడా?

పి ఆర్. ఎమ్, ముఖలింగం

మీ చిన్న వ్యాసాలు ఎంతో బాగుం టాయి. నిత్యము జరుగుతూండే కన బడని లోపాలని ఎంతో చక్కగా మాటేగా రవంత హాస్యం మిళాయించి చెప్తారు...


మీ లాంటి అభిమానుల...యిలాంటి ఒక్క మెప్పు చాలు— థ్యాంక్స్ సోదరీ, మీరు సేషన్ డైరెక్టర్, ఆలిండియా రేడియో, విజయవాడ అని వ్రాసి వివరాలు తెలుసుకోండి.



దగ్గు జలుబులు నీరసమును కలిగిస్తాయి — యితర వ్యాధులకు దారితీస్తాయి

బలము మరియు ఆరోగ్యమునకు వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి

దగ్గు జలుబులతో రోగ నిరోధక శక్తిని కోల్పోతారు. మీరు నిర్బలులై వుంటారు. అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశ ముంటుంది. గనుక వాటర్‌బరీస్ కాంపౌండ్ క్రమంగా త్రాగండి. దీనిలోగల ఓషధులు ఆకలిని వృద్ధి పరుస్తాయి. కోల్పోయిన శక్తి తిరిగి చేకూరుస్తాయి. యితర వ్యాధులు కలగకుండా రోగ నిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర్చబడిన 'క్రియోసోట్' మరియు 'గయొకోల్' దగ్గు, జలుబులనుండి ఉపశమనము కలిగిస్తాయి.



వాటర్‌బరీస్ కాంపౌండ్ — అత్యంత నమ్మకమైన టానిక్

వార్నర్ - హిందుస్థాన్ లిమిటెడ్

వెలుగు నీడలు



యలమంచిలి ఝాన్సీలక్ష్మి

సీరియల్

జరిగిన కథ

రాజశేఖరంగారి ఒక్కే ఒక కూతురు అనుపమ. ఆయన మిత్రుని కుమారుడైన మధుని ఆదరించి ఆ యింట్లోనే ఆశ్రయమిస్తారు. మధుమూర్తి అనుపమ అభిమానాన్ని పొందుతాడు. రాధామాధవీయం నృత్యనాటికతో వారి అనుబంధం మరింత దృఢం అవుతుంది. విదేశాలనించి వచ్చిన అనుపమ బావ విజయకుమార్ వీరి అభిమానాన్ని సహించలేడు. మద్రాసు వెళ్ళిన మధుమూర్తి గురించి విజయకుమార్ చెప్పిన సంగతి విన్న అనుపమ ఊహలు తలక్రిందులవుతాయి. మధుమూర్తికి శశికళకి గల సంబంధం ఆమె ఊహించలేకపోతుంది. అపార్థం చేసుకుంటుంది. విజయకుమార్ ప్రవర్తన రాజశేఖరంగారికికూడా అనుమానం కలిగిస్తుంది. మధుమూర్తి రాజశేఖరం నిజస్వరూపం బయటపెట్టినప్పుడు అందరూ ఆశ్చర్యపోతారు. రాజశేఖరం తలవంచుకుంటాడు.

16

ఓ అయిదారు నిమిషాలవరకూ నిశ్శబ్దాన్ని చీల్చలేకపోయారెవ్వరూ. శశికళ వదనంలో అప్పటికీ ఆవేదనరేఖలు విచ్చుకోనే లేదు. ఆ సంగతి గమనించిన మధుమూర్తి ఆలోచనలో మునిగిపోయాడు.

స్నేహితురాలు శశికళ ఆమెవంక రెండుమూడుసార్లు ఆశ్చర్యంగాచూసింది.

'తాను మనస్సున నిల్పుకున్నవాడు తన వాడైనా సంతోషంతో వూగిపోవడం లేదేమిటి ?!' అనుకుంది లోలోన.

ఆ రోజుకి అందరూ భోజనాలు అక్కడే ముగించారు ఆ తండ్రీకూతుళ్ళ ప్రోద్బలం వలన.

వెళ్ళేముందు శశికళకు చీర, రవికె పెట్టి కుంకుమ పుంచింది అనుపమ, ఆప్యాయత తొణికిసలాడుతూన్న మనస్సుతో.

'నీకీనాడు లభించిన సంపద సిరంగా వుండిపోవాలని ప్రార్థిస్తున్నాను అక్కయ్యగా, ఆత్మీయురాలిగా' అన్నది శశికళ కనులలోకి చూస్తూ.

వంగి అనుపమ పాదాలకంటి నమస్కరించుతూ అన్నది—

'అనురాగమయం నీ హృదయం! అందుకే నీ ఆశీస్సు ఫలించుతుందనే నా విశ్వాసం అక్కయ్యా!! కనులు వత్తుకుంటూ ఆ అనురాగమయిపై వాలిపోయింది.

ప్రేమగా ఆమెతల నిమురుతూ వుండిపోయింది అనుపమ—

'రేపటిలోపల దేవతలు అనుగ్రహించకుండావుంటే నీచెల్లెలిగా పసుపు కుంకుమలతో నీ చేయి పట్టుకునే ఆయింట్లో అడుగు పెడతాను' అన్నదామె సెలవు తీసికొంటూ. మధుమూర్తిని పిలిచారు రాజశేఖరంగారు. అనుపమకూడా కొంచెందగ్గరగా వెళ్ళింది.

'ఏమోయ్! రేపేసారి కన్పించవు. మరి పోకు! మద్రాసు ప్రయాణం తిరుగు? అక్కడికే కాలేజి 'ట్రాన్స్ఫర్' అయింది.'

'అవునండీ! ఈ కారణంతోనే వెళ్తాను' అన్నాడతడు.

అంతలో లోపలినుంచి పాకెట్ చిన్న కవర్లతో అంతలా కిళ్ళీలు తెచ్చి అందించి, మధుమూర్తికిమాత్రం పళ్ళెం ఆకులూ, సున్నమూ, వక్కా వేరుగా అందించాడు. అతనికి కిళ్ళీ వేసుకునే అలవాటు లేదన్న సంగతి అందరికీ తెలుసు. అంత హడావిడిలోనూ ఆ చిన్న సంగతిని గుర్తుంచుకున్నదెవరో గ్రహించారు రాజశేఖరంగారూ, మధుమూర్తీ.

'నా శిష్యురాలికి నా అలవాట్లన్నీ గుర్తే సుమీ!' అన్నారాయన చిన్నగా నవ్వుతూ.

'ఆ ఘనతమాత్రం పోదులెండి నా శిష్యులకి' అన్నాడతడు.

'నా మాట మన్నించినందుకు మీ కెంతైనా ఋణపడివున్నాం మేము' అట్టుల కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు

శశికళ మాత్రం కళ్ళవెంట అనుపమ ఒక్క సారి కనులెత్తి అతనివంక చూసింది. వెంటనే లోనికి వెళ్ళిపోయింది.

'నీకే మేము ఋణపడివున్నామోయ్ న్యాయంగా ఆలోచిస్తే! మా అనుపమనూ, నన్నూ నిజంగా రక్షించి పుణ్యం కట్టుకున్నావు. సరే! పదండి! ఎండగా వుంది! రేపు మాట్లాడుకుందాం.' అన్నారాయన. అందరూ సెలవు తీసుకొన్నారు.

* * *

ఉదయాన్నే శశికళను వెంటతీసికొని, రాజశేఖరంగారూ, మధుమూర్తి, మోహన్ బాబూ, నళినీ బయల్దేరారు.

విజయ్‌కుమార్ గృహాన్ని సమీపించగానే కారుదిగి రాజశేఖరంగారే ముందు నడిచారు.

అందరూ నిర్విణ్ణులైపోయారు, నోట మాటే రాకుండా పోయింది చాలా సేపటి వరకూ.

ఎవరికోసమై అంతమందీ ఆనందంతో ఆశాపూరిత హృదయాలతో ఆ గృహాన అడుగు మోపారో అతడు చడీచప్పుడు లేకుండా అదృశ్యమైపోయాడు. ఆ విచిత్ర అంతర్ధానంలో వున్న అంతరార్థం ఎవ్వరికీ బోధపడకుండా పోయింది.

శశికళముఖాన నెత్తురు చుక్కలేకుండా పాలిపోయింది. మనస్సులో ఎన్నివేల అనుమానాలు రగులుతున్నాయోగానీ ఒక్కటి స్పష్టమైన రూపం దాల్చడం లేదు.

ప్రక్కయింటి వారినడిగితే అన్నారు—

'రాత్రే వెళ్ళిపోయారండి! ఎక్కడో గవర్నమెంటు వుద్యోగం వచ్చిందని'

ఆవార్తలో ఎంత యదార్థం వున్నదోగానీ అది అందరిముఖాల్నీ వెల్లగా మాడ్చివేసింది క్షణంలో. ఆ నిమిషంలో ఏం చెయ్యాలో, నిల్చోవాలో, వెళ్ళిపోవాలో అర్థంగాకుండా పోయింది. ఆ విచిత్రవ్యక్తిపైన హృదయాల్లో అసహ్యతా, ఆగ్రహమూ పువ్వెత్తున లేచి పడసాగాయి. శాపాలు వర్షించాయి. కోపం పట్టలేక గిజగిజ లాడిపోయాయి. అది అవమానమో లేక ప్రతీకారమో తెలియనంతగా ఆలోచనలు సాగిపోయాయి.


'ఛా! మూర్ఖత యింత బాధాకరమైనదని ఆ ధూర్తుడికి తెలియదు. కానీ అందుకు శిక్షమాత్రం కఠినాతికఠినమై వుండాలి.' అన్నారు రాజశేఖరంగారు భారంగా నిట్టూర్చారు.

క్షణమాత్రం ఆగి అన్నాడు మధుమూర్తి—

'శిక్ష కఠినమైనా కాకపోయినా బాధ మాత్రం దుస్సహనీయంగా వుంది!'

శశికళ పెదవి విప్పబోలేదు. కాళ్ళున్న చోటునుంచి లేవాలని ప్రయత్నించనూ లేదు.

అందరూ బయల్దేరారు. విశృంఖలంగా లేచి వాళ్ళ ననుసరించింది. అడుగులు



పడుతున్నాయేగాని మనస్సులు మాత్రం యుద్ధంచేస్తూనే వున్నాయి అవిరామంగా. భారమైన హృదయాలతో నిష్క్రమించా రందరూ నిశ్శబ్దాన్ని చీల్చలేక. ఆ విచక్షణా జ్ఞానంలేని వంచకుణ్ని ఏంచేయాలీ అన్న భావంతో కొట్టుకుపోయాయి మనస్సులు.

అనుపమ కన్పించగానే ఆమెపై వాలి పోయింది శశికళ. జరిగింది లీలగా గ్రహించింది. ఏమని వూరడింపజేయాలో తోచకుండా పోయింది ఎంతో సేపటివరకు. వీపు నిమురుతూ నిశ్శబ్దంగా రోదించుతూన్న ఆ అదృష్టహీనురాలి ఆవేదనను వింటూండి పోయింది.

ఆ రోజంతా ఎవ్వరూ మనస్ఫూర్తిగా మంచినీళ్లయినా ముట్టలేక పోయారు. శశికళ మూగదానిలా దుఃఖంతో దహించుకుపోతోంది

ఓ మధురమూర్తి సహృదయతతో తన జీవితాన వెన్నెల కురుస్తుందని భ్రమపడింది. కానీ చేతికందిన అమృతమే కాలకూటమై పోయింది. ఇంతకూ అతడు ఎక్కడకు వెళ్లిపోయినదీ అంతు చిక్కనే లేదు.

వెళ్ళిన మధుమూర్తి రాత్రి పదకొండు గంటలకి ... తర్వాత వచ్చాడు. 'పట్నంలోనూ లేడట' అని చెప్పాడు. 'మరేమైనట్లు? యింతలోనే!' అని ఆశ్చర్యపోయారందరూ.

అనుపమ మాత్రం ఆతురతనీ, ఆవేదననూ ఆపుకోలేక పోయింది.

'ఏమైనట్లు? ఏ దూరతీరానికి పరుగెత్తగలడు యింతలోనే?' అని అడిగింది.

'శశి జీవితాన అగ్నిపర్వతం బద్దలైంది అనుపమా! విజయ్‌కుమార్ మళ్లీ విదేశానికివెళ్లే సన్నాహంలో మునిగి పోయాడు. అతనికి అక్కడెన్ని బంధాలున్నాయో?!'

'కోర్టుకు పిలిపించండి. కళ్లకు కమ్మిన పొరలు కరిగిపోతాయి!' కోపంతో వూగిపోయింది.

'అదేమంత ఘనకార్యంగాదు— పిల్పించవచ్చు. కానీ దానివల్ల మరింత చెడు ఎదురౌతుంది. మనస్సుని కోర్టు జయించలేదు. వాళ్లిద్దరిమధ్యా అగాధాలు ఏర్పడతాయి. అనురాగాన్ని శవాస్యం చేస్తుంది.

చట్టంతో మనిషిని శాశ్వతంగా న్యాయపథాన నడిపించలేరు. తర్వాతైనా యీ రగడ జరిగి తీరుతుంది.' అన్నాడు మధుమూర్తి బాధా తప్తస్వరంతో—అనుపమ ఆగ్రహంతో వివశురాలై పోతోంది క్షణక్షణానికి. పదిరోజులు గడిచిపోయాయి. కానీ ఆ డాక్టరు వచ్చేసూచనలే కన్పించలేదు. మధుమూర్తి బలవంతంమీద ఏదో ప్రాణం నిల్పుకోడానికే రెండుమెతుకులు తింటోంది శశికళ.

కానీ ఆరోజా విన్నవార్త అనుపమనే కాక రాజశేఖరంగారిని కూడా కదిలించి వేసింది.

ఆ చదువూ, సంస్కారం వుందనుకున్న మూర్ఖుడు పూర్తిగా దగ్ధంజేసి పోయాడు ఓ నిండు జీవితంలోని ఆశల్ని.

విదేశం వెళ్లనూ వెళ్లాడు. వెళ్లి శశికళకూ తనకూ ఏమీ సంబంధం లేదని మధుమూర్తికి మరోసారి వంచనతోకూడిన జాబు వ్రాశాడు.

ఎవరికంట బడగూడదనుకున్నాడో ఆ అభాగినే అందుకుందా జాబును. చదివి నిర్ఘాంతపోయింది. నిర్జీవ ప్రతిమలా నిలబడిపోయింది. రాత్రి భోజనాల సమయానికి మధుమూర్తి 'శశీ!' అని పిల్చిన అతని పిలుపుకు సమాధానంగా ప్రక్కయింటి కుర్రాడు ఓ వుత్తరం తెచ్చి చేతిలోవుంచి వెళ్లాడు 'శశి అక్కయ్య మీ కిమ్మన్నదంటూ'

ఆశ్చర్యంతో విప్పాడు జాబుని—

'బావా!

అందరకూ అన్నీ అందవు కానీ నాకు అందినదేదీ లేదు. ఇది నా దురదృష్టం అనుకోనా? మరింకేం చేయగలను బావా!

మనస్సును ఓ హృదయంలేని వ్యక్తికి బలిజేసుకున్నాను. ఆశల్ని మసిజేసుకున్నాను చేజేతులా. మమతలు పండించాలనుకున్నాను. కానీ అంతటి అదృష్టం నాకులేదు. ఇంకా నీ నీడనే నిలిచిపోయి నీ ఆశా సౌధాన్ని కూడా నేలపాలు జేయలేను.

'శశి' నీకు చెల్లెలికన్నా మిన్న. కానీ లోకానికి మన ఆ అనురాగ బంధం విపరీతంగా కన్పించుతుంది. నీ బంగారు భావికి నేనో అడ్డుకట్టనౌతాను. అప్పటికే సుఖానికి సుదూరంగా, ఒంటరిగా, ఏబంధమూ అందక అన్నిటినీ వదులుకుని నిర్వికారమూర్తిలా నీలో నీవే కుమిలి కృశించి పోతున్నావు. ఇంకా సమ్మెటపోటులా అనుక్షణమూ నిన్ను నరిపి వేయలేను మోయలేని బాధ్యతల బరువుతో. నాకోసం విచారించకు. వెదికి వేసారబోకు ఎవరికీ అందని ఏ లోకాలకో తరలిపోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. నా నిర్ణయం నీకు నచ్చదు. అది పిరికితనమని పరిహాసించుతావు. కానీ అదితప్ప మరో మార్గం నన్ను మనిషిగా నిలబడనీయదు. కాకిలా వ్రణాన్ని క్షణక్షణానికి పెద్దది జేయగల లోకం ముందు నాలాంటివాళ్ళు బ్రతికివుండి హాయి ననుభవించేంత సాహసాన్ని సంపాదించుకోలేరు.

అందుకే నీ నుంచీ, చల్లని నీ అనురాగ బంధాన్ని బలవంతాన విదిలించుకుని మనస్సును రాయిగా జేసికొని మరోలోకానికి— అదెంత దూరాన వున్నా—ప్రశాంతికోసం — పరుగులెత్తుతున్నాను.

అనుపమ అక్కయ్యకు వందనాలు. నీకు — నీకు — వుహూ! నేనేమీ యివ్వలేను బావా! అంతటి మధురమూర్తిని నీవు. మరోజన్మ అన్నది వుంటే— నీ సోదరిగా జన్మించాలని కోరుకుంటూ — అమ్మకూ, అన్నయ్యకూ నమస్కారాలని చెప్పమని అడుగుతూ —

మదూర తీరాలలో—అనంతంలో—
... విలీనమై పోయిన—అభాగిని—
శశికళ'

నిట్టూర్చడానికైనా ఓపిక లేకుండా పోయిందతనికి. విచారంతో, ఆవేదనతో కదిలిపోయాడు. అదురదృష్టం కాటు వేసిన అభాగినిని తలచుకుంటూంటే అతని మృదు హృదయం వ్రయ్యలై పోతోంది. అంత అమాయకంగా, నిర్మలంగా పువ్వులా విరిసిన ఓ నిండు జీవితం మూర్ఖుడి దుర్మార్గానికి ఆహుతి అయినందుకెంతో బాధగా వుందతనికి.

ఈ విధంగా ఆమె జీవితం ముగిసి పోతుందనీ, అంత నిర్దాక్షిణ్యంగా విధి ఆమెను నిలిపివేస్తుందనీ అతడేనాడూ వూహించనైనా వూహించలేదు.

ఆ వార్త తెలిసిన రాజశేఖరంగారు, మధుమూర్తికి వెంటనే కబురంపించారు,

తండ్రి కూతుళ్ళిద్దరూ విచారాన్ని వెలి బుచ్చారు. అనుపమ ఎంతో బాధపడింది.

తర్వాత రాజశేఖరంగారడిగారు—

'రేపే మద్రాసు ప్రయాణమన్నావుట' అని. అనుపమ కుతూహలం మెరుస్తున్న కనులతో అతనివంకే చూస్తూండి పోయింది. అతను మౌనంగా తలవూపాడు.

'మరి అనుపమను చదివించమంటావా?' అన్నారాయన.

ఆశ్చర్యంతో చూస్తూండిపోయాడతడా ప్రశ్న వినగానే. అందుకు తన సమ్మతి ఎందుకో అర్థంగాలేదతనికి.

'మీ యిష్టం! అనుపమ అభిరుచి విలావుంటే అలా జరిపించండి!' అన్నాడు ముభావంగా.

'నాదేముందోయ్! యింకా! యీ ముసలి వాడిని ఆటలు పట్టించకండి! ఓపిక లేదిక. మీ మనస్సులు రెండూ అనురాగ బంధంతో ముడివడిపోయాయని నా మందబుద్ధికిప్పటి గ్గానీ తెలియలేదోయ్! ఆ! ఎలా తెలు స్తుంది చెప్పు! నువ్వేమో అభిమాన ధనుడివి. అనుపమ మనస్సు విప్పిచెప్పడానికి అమ్మనుగానుగదా!

మధ్యలో ఓ దుష్టగ్రహం పట్టుకున్నా ర్నునే నన్ను. భగవంతుడి కరుణవల్ల అనుపమ జీవితం సుఖప్రదమే అవుతుందని విశ్వసించుతున్నాను మధూ! నా మాట కాదనకు. నాన్నగారున్నట్లయితే నిన్నిం తగా అడగవలసిన పనే వుండేది కాదోయ్! ఎప్పుడో జరిగిపోవలసింది శుభకార్యం. కానీ నన్నేదో భూతం ఆవహించినట్లు 'విజయ్' వచ్చాడు మధ్యలో.

'మీ మనస్సుల్ని నొప్పించినందుకు ఈ వృద్ధుడికి శిక్ష విధించాల్సిందే' అన్నారాయన.

అనుపమ సిగ్గులో తల ఎత్తలేక పోయింది.

'అమ్మాయి తరఫునకూడా నేనే క్షమా భిక్ష అడుగుతున్నానోయ్!'

మధుమూర్తి అనుపమవంక చూశాడు. అంగీకారంగా తలవాల్చుకుని వున్నదామె యింకా.

'మీ మాటకాదని మనస్సు నొప్పించ లేను' అన్నాడు మధుమూర్తి.

'నాకు తెలుసునోయ్! మా అనుపమకింత మృదుహృదయుడు లభించి తీరుతాడని' అంటూ నవ్వుతున్నారాయన విందుగా.

మధుమూర్తికి, అనుపమనిచ్చి వివాహం జరిపించుతున్నారు అన్న వార్త విని రాజశేఖరంగారి ఆప్తులూ, స్నేహితులూ ఆశ్చర్యపోయారు మొదట. కానీ విజయ్ కుమార్ విషయం తెలిసిన తర్వాత, మధుమూర్తి సాహితీ ప్రతిభ విన్నపిదప తగిన జంటేనని అంగీకరించారు.

వివాహం వైభవంగా జరిపించారాయన. 'సీతారాముల కల్యాణమే చూతమురారే!' అన్నట్లు అతిథులు, స్నేహితులు ఎందరో విచ్చేశారు. అభినందించారు. ఆశీస్సులతో అక్షతలు చల్లారు, ఆనందంతో బహుమతు లను పంచారు.

అల్లుడినీ కూతుర్నీ దీవించుతూ ఆనం దంతో కనులు తుడుచుకున్నారాయన. దివం గత పత్నీ స్మృతులతో మనస్సు భారమైనా, కుమార్తె మనస్సుకు నచ్చినవాడు లభ్యమై నందుకాయన సంతృప్తిగా విశ్వసించారు. దీవించుతూ అన్నారాయన—

'పూవూ తావిలా కలిసిపోవాలనే యీ వృద్ధుండి ఆశీస్సు!'

మధుమూర్తి నవ్వుతూ అనుపమ కన్నుల లోకిచూసి ఆయనకు నమస్కరించాడు.


జీవితాన పండించుకున్న బంగారుకలలు ఫలించిన ఆరేయి అనుపమకు హాయినీ, ఆనందాన్నీ అందించింది.

మధురోహలు పరుగెత్తుతూండగా, మధుమూర్తి, ఆమె కన్నులలోకే చూస్తూ అన్నాడు

'అనుపమా! ఈ నాటికి నా జీవితం ఓ తీరానికి చేరింది. ఈ ఏ మధుమూర్తి జీవితాన వెలుగువి నువ్వు. నీడ మాధవి. ఈ వెలుగునీడల కలయికే నేనూ, నా ఆనం దమూ, నా సర్వస్వమున్నూ. ఈ వెలుగు కరిగి పోకూడదనీ, ఆ కాంతిలో మన జీవితాలు పండిపోవాలనీ, కరుణామయుడైన మాధవునికి నా ప్రార్థనా పూరితమైన విన్నపం.'

మందహాస కాంతులతో జగన్మోహనంగా వెలిగిపోతూన్న కృష్ణ విగ్రహానికి నమోనంగా మనస్సులనే నివాళిగా జేశారా దంపతులు నమస్కరించుతూ.

(అయిపోయింది)



వారఫలం

8-8-1969 శుక్రవారం మొదలు 14-8-1969 గురువారం వరకు

మేషం : వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. బంధువులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—సంతోషకరమైన వార్తలను వింటారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం : భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిథునం : వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభించగలవు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : అధికవ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. పోటీ వారిలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

సింహం : వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. అధికవ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. కుటుంబవ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

కన్య : వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వ్యాపారంలో నూతన మార్గాలద్వారా ఆదాయం పెరుగుతుంది.

స్త్రీలకు—బంధువులకు సహాయం చేస్తారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

తుల : వ్యాపారంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. నూతన వ్యవహారాలు ఫలించగలవు. సాంఘిక కార్యక్రమాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించ గలదు.

వృశ్చికం : కొన్ని వ్యవహారాల్లో మీరు ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు. ప్రయాణాలు వాయిదా పడతాయి. అధికవ్యయం జరుగుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది.

స్త్రీలకు—సంతానానికి అనారోగ్యం చేస్తుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు : వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం రాగలదు. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరగుతోంది.

మకరం : ఇతరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. వ్యాపారంలో ప్రయోజనం గల మార్పులు వస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు—పోటీవారితో మాటపట్టింపులు తగవు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.


కుంభం : వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. వ్యాపారంలో ప్రయాణ మీద అనుకూలత లభిస్తుంది

స్త్రీలకు—నూతన విషయాలను తెల్సుకొంటారు ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

మీనం : మీరు యెంతగానో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. పోటీ వారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఆరోగ్యం బాగా ఉంటుంది.

స్త్రీలకు—పుణ్యకార్యాల చేస్తారు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

—మహేష్



ఖంగు ఖంగుమని దగ్గింది పార్వతమ్మ. ఆ దగ్గుకి నరనరాలు తెగిపోయినట్లు బాధపడింది. పాతబడిపోయిన గదిగోడలు ఆ దగ్గుకి ధ్వనించాయి. ఆ గోడలకు ప్రతిగామున్న శరీరం వూగిపోయింది. ప్రాణాలు కళ్ళలోకి వచ్చినట్లనిపించింది. ఆ ఎముకలగూడు ఆ వూపుకి తట్టుకోలేక గిలగిల లాడిపోయింది. ఊపిరి ఎగతోసుకు వస్తోంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆమె అధీనంలో లేవు. కాసేపు అలాగే అవి ఎలా వూపితే అలా వూగింది. కాసేపటికి సర్దుకొన్నట్లనిపించి, శరీరానికి ప్రతిగా ఉన్న నులకమంచంపై వాలింది. 'ష్! భగవాన్!' అలసటగా నిట్టూర్చింది. ముఖమంతా చెమటపట్టుతోంది. కొంచెం పక్కకు ఒత్తిగిలింది. మంచానికి ప్రతిగా మున్న పెళ్లినాటి పట్టుచీరె ఆమెంచంపై పక్కగా వేసుకొంది. ఆచీరె ఒక పక్కగా కొంచెం పైకెత్తి, ముఖంపై తుడుచుకొన్నది. ఆచీరె ఆమెకు పెళ్లినాటి ముచ్చటలన్నీ వినిపిస్తూంటుంది. ఆనాటి జీవితాన్ని కళ్లముందర చూపుతూంటుంది. అందులో ఎన్ని మధుర క్షణాలు దొర్లిపోయాయో అనుక్షణం గుర్తుచేస్తూంటుంది. ఆ మధుర స్మృతులలో జరిగే ప్రతినిముషమ్మూ మధురంగా మారుస్తూ వుంటుంది.

ఆ చీరెలోనే ఎన్నో పెళ్లిళ్లు, పేరంటాలు వెళ్లొచ్చింది. క్రమంగా ఆమె ఆరోగ్యంతో బాటు అదీ శిథిలమైపోయింది. ఒకసారి చీరెవంకచూసి నవ్వుకొన్నది. నేడో రేపో అన్నట్టున్న తన ప్రాణం, 'ఇక నేను నీ బరువు మోయలేను' అన్నట్లు తనకింద నలిగిపోతున్న పట్టుచీరె, చిరిగి ముక్కలైపోతున్నా దాని అందం మాయలేదు. మామిడిపండు రంగు చెదిరిపోలేదు. ఆరంగు ఆయన కెంతో యిష్టం. స్వయంగా ఎన్నికచేసి కొన్నారట ఆచీరె. ఎన్నిసార్లు చెప్పారో ఆమాట. తనకూ విన్నమాటపంగానే అనిపించేది. ఎన్నిరంగులు చూసినా ఏది నచ్చేదికాదట. ఆచీరెకోసం ఎన్నో కొట్లకి తిరిగారట. రోజూ ఆచీరె కట్టుకోమనేవారు 'ప్రతి రోజూ ఒకచీరె కట్టుకుంటారా ఎవరైనా?' చెప్పేది తను.

'ఎవరిష్టం వారిది' అనేవారు నా యిష్టం నీయిష్టం ఒకటేగా అన్నట్లు.

'అయితేమటుకు— ఈ అమ్మాయి కేదో పిచ్చివుందని అనుకొంటారు' అనేది.

'అనుకో! లేనివాళ్ళకు పిచ్చివుందని అనుకొనేవాళ్లు పిచ్చివాళ్లు' అనే యి

తపన

విశ్లేష్యంగా. 'ఇది మరీ బాగుంది' అని అప్పటికి దాటేసేది. నిజానికి ఏ పేరంటానికో వెడుతున్నప్పుడు — అదయినా కాస్త ఆడంబరంగా జరుగుతున్న చోటికి వెడుతున్నప్పుడు తప్ప ఆ నా చీరె కట్టుకొనేది కాదు. ఉన్నదే ఒక్కటి. దాన్ని కాస్త అప్పుడే పాతబడనివ్వటం ఇష్టముండేదికాదు. ఆయన బాధపడలేరని ఆక్కాట పైకనేది కాదు. తనమీద వున్న పిచ్చిప్రేమతో ఎక్కడున్నా అప్పుచేసి కొత్తది పట్టుకొస్తారేమోనని భయం. ఏదో వున్నంతలో తిని ప్రశాంతంగా సాగుతున్న జీవితంలో అప్పులకల్లోలం రేగుతుందేమోనని భయం. ఆ కల్లోలం రేగకుండానే, ప్రశాంతంగా వున్న సంసార సాగరంలో ఆ రాయి పడకుండానే నిశ్చింతగా, వున్నంతలో యిన్నాళ్లూ సంతృప్తిగా గడిచిపోయింది. 'కాలమెలాగో గడుస్తే చాలు' అనుకొనేట్లు గడువలేదు. ప్రతినిముషం ఆనందంగానే గడిచిపోయింది.

ఆ ఆనందాతిశయాలు కొనసాగకుండా ఈ రోగం పట్టుకొంది. రెండేళ్లనుంచి శరీరాన్ని, ఇంటిని పీల్చి పిప్పిచేస్తోంది. అయినా తగ్గేసూచనలేమి లేవు. చల్లగా సాగుతున్న సంసారాన్ని కాళ్ల బోడవానికి వచ్చిన రోగం అలా ఎలా తగ్గుతుంది? రోగం తగ్గదు. ప్రాణం పోదు. అదొక నరకం. నరకం అని ఎక్కడో వర్ణిస్తారు — ఇంతకంటె వేరే నరకం ఏముంటుంది? అనుభవించేవన్నీ యిక్కడ అనుభవించాల్సిందే! తెలిసి అనుభవిస్తారు కొందరు, తెలియక అనుభవిస్తారు కొందరు. అనుభవించటం మటుకు తప్పదు. నవ్వుకొంది సన్నగా తనలోతానే.

ఎక్కడ తిరుగుతున్నారో ఏమో? భోంచేశారో లేదో? వారానికి వచ్చేది ఒక్కరోజు శలవు. ఆ రోజు ఇంటిపట్టున వుండి విశ్రాంతి తీసుకోటానికి వుండదు. బ్రతుకుకోసం వారంరోజులు కుర్చీకి అంటుకుపోయి, రక్తాన్ని చెమట బిందువులుగా మార్చి అరిసుక్తి, ఫైళ్లకు అంకితం చేస్తే వచ్చేది, ఒకరోజు శలవు వారానికి. ఆ ఒక్కరోజు మటుకు విశ్రాంతి తీసుకోటానికి ఎక్కడుంటుంది మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మానవుడికి? వారం రోజులు పేర్చి అట్టే పెట్టిన పనులన్నీ ఆ రోజే నెత్తిన వేసికోక తప్పదు. ఆరోజుని అయినా కాకపోయినా, అవతారం మార్చేసినట్లు మరునాటికవన్ని కట్టిపెట్టేసి ఒక గుమాస్తా అయి ఆఫీసుకి వెళ్లాల్సిందే. మళ్లీ ఆదివారంనాడు తన నిజరూపంతో బయల్దేరాలి. ప్చ! ఏమిటో ఈ బ్రతుకులు. గృహపోషణం, కడుపుకి పుట్టిన సంతానంకోసం ఎన్ని బాధలైనా సహిస్తాడు. తనసుఖం చూసుకోకుండా ఎందరినైనా సుఖపెట్టగలడు. ఆ రెండూ చల్లగా వుంటే చాలు. శరీరమలసిపోయినా లక్ష్యపెట్టకుండా తనవిధి తను నిర్వహిస్తాడు. మెదడూ మొద్దుబారిపోయినా విశ్రాంతియివ్వ యిచ్చగించడు. ఏమిటో! ఈ బ్రతుకు బొంగరాన్ని ఈరెండూ ఒక త్రాడులా పెనవేసుకుపోయి గిరగిరా తిప్పుతున్నాయి. ఈ త్రాడు లేనిదే ఆ బొంగరం తిరుగదు. తాడయినా బొంగరం కోసరమేగా! దాన్ని తిప్పటానికేగా! ఏమిటో ఆలోచనలు! పక్కకు ఒత్తిగిలి బలవంతాన కళ్లు మూసుకు పడుకొంది పార్వతమ్మ.

* * *

కుంపటి ముందర కూర్చుని బరబరా విసురుతోంది రాధ. కుంపటిలో బొగ్గులు ఎర్రగామారి కణకణ లాడుతున్నాయి. వాటిసెగకు రాధ ముఖంనిండా చెమట పట్టింది. చెమటకు ఆమె ముఖంమీది ఎర్రటి తిలకం కరిగిపోయింది. పమిట కొంగుతో ముఖం తుడుచుకొని నిప్పుల వంక నిదానంగా చూసింది రాధ. అవి ఎర్రగా మిడిసిపడుతూ భగభగ మండుతున్నాయి గర్వంతో విర్ర వీగుతున్నట్లు. వాటి బ్రతుకెంతసేపు? అయిదునిముషాలు పదినిముషాలు—మహా అయితే పదిహేను నిముషాలు. తరువాత మిగిలేది బూడిద. 'తన బ్రతుకో' ఛీ! ఏమిటి తనకేమయింది యిప్పుడు? అర్థంలేని ఆలోచనలు. మళ్లీ బరబరా కుంపటి విసరసాగింది.

ఆ కుంపటి వెలుగులో రాధ మిలమిల మెరసిపోతోంది. కట్టుకొన్నది చిరిగిపోయినా ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. ఎర్రపరికిణీ, జాకెట్టు, తెల్ల ఓణీ మూడిట్లో చిరగనిదేదీ లేదు. ఆ పేదరికంతోటి అందం పోటీపడింది. ఎక్కడయినా పేదే గెలుస్తుందని ధీమాగా వెన్ను విరుచుకు నుంచుంది. తండ్రి అందం, తల్లి సుకుమారం రెండూ వచ్చాయి రాధకు. డబ్బులేనివాళ్లకు వుండే తెలివి తేటలూ వున్నాయి. డబ్బులేని తెలివి వుండి ఏం ప్రయోజనం? సద్వినియోగ పరచుకొనేందుకు అవకాశాలేవీ — అవకాశం లేకపోతే ఏం — ఆలోచనలు పడగెత్తుతున్నాయి పంచ కల్యాణిలాగా — ఒక్కొక్కసారి తెగిన గాలిపటంలాగా. గుర్రానికి కళ్లెం చేతిలోనే వుంచాలి. గాలిపటానికి దారం తెగకుండా వుండాలి. అందుకే చాలా జాగ్రత్త పడుతుంది రాధ. వెర్రి వెర్రి ఆలోచనలను రానివ్వదు. వచ్చినా వాటిని బలవంతగా పీకి అవతల పారేస్తుంది, అక్కరలేని కలుపు మొక్కలు తోటలోంచి పీకి అవతల పారేసినట్లు. అయినా ఆమెకూ ఆలోచనలు వస్తూంటాయి. ఆలోచిస్తూంటుంది. ఆహారం తీసుకోపోతే పొట్ట వూరుకొంటుందా? ఏపని చేయకుండా కూర్చుంటే కాళ్లూ చేతులూ వూరుకొంటాయా? అలాగే మెదడుమాత్రం వూరికే ఎలా వుండగలుగుతుంది? ఇతర వ్యాపకాలు లేనప్పుడు ముఖ్యంగా వచ్చేవి ఆలోచనలే! హైస్కూలు చదువుతోటి అన్ని చదువులు ముగిశాయి. ఎప్పుడో నెలకొకసారి పొరుగింటి వాళ్లదగ్గర తీసుకు చదివితే ఒక వారపత్రిక — లేకపోతే అదీలేదు.

అన్నం వుడుకుతోంది కుతా కుతా. ఆవేదనాపరుడి మనసులాగా. మూత కొంచెం పక్కకు జరిగింది. ఆవేదన మనసులో నిలువలేక కార్యరూపంలోనో, వాక్రూపంలోనో బయటకు వచ్చేసినట్లు అన్నం పొంగి కుంపటిలో పడింది. రాధ విసురుతూనే వుంది. మండలేక ఆగలేక వున్నాయి నిప్పులు. చావలేక బ్రతుకలేక వున్న రోగిలాగా. రాధ తొట్రుపడింది. చేతిలో విసనికర్ర అవతల పారేసి, గిన్నెదించి వార్చింది. మళ్లీ కుంపటి మీదపెట్టి విసరటం మొదలుపెట్టింది. ఈలోపల కాస్త రాజుకొని మండసాగాయి నిప్పులు. మండుతున్న వాటివంకే చూస్తూ కూర్చుంది విసనికర్ర పక్కనపెట్టి. 'ప్చ్' తనుకూడా చదువుకొన్నా బాగుండు'

అనిపించింది.

కాని ఏం లాభం? బ్రతుకు వంటింట్లో ఈ కుంపటికే అంకితమయి పోయింది. సుధ, ప్రమద అంతా కాలేజీలో చదువుకొంటున్నారు. తనే యిలా మిగిలి పోయింది. నిజానికి వాళ్ళందరికంటె తనకు ఎక్కువమార్కులు వచ్చాయి. అయితేయేం? సుధ నాన్నగారు తాసీల్దారు. ప్రమద నాన్నగారు ఆఫీసరు. వాళ్ళ నడక నోట్లకట్టలమీదే సాగిపోతూంటోంది. సుధది మొద్దుబుర్ర. ఒకపట్టాన తల కెక్కదు ఏది. అసలు చెప్పింది అర్థం చేసుకోలేదు. అయితేనేం! డబ్బుంది. ట్యూషన్లు పుష్కలంగా పెట్టారు. ఏ సబ్జక్టు లెక్చరరు దగ్గర ఆ సబ్జక్టుకి కాలేజీలో జరిగే పరీక్షలన్నిటికీ, నిరాఘాటంగా పాసయిపోయింది. క్లాసు రాకపోయినా పి. యు. సి. పెద్దపరీక్షల్లో కూడా పాసయింది. అక్కడకూడా వాళ్ళ నాన్న ఏదో చేశాడంటారు. ఏంచేస్తేనేం? అదృష్టవంతురాలు. బి. ఎ లో కూడా చేరింది. తనేమో కాలక్షేపంకోసం చదువుతోందిట. వాళ్ళమ్మేమో పెళ్ళికోసం చదివిస్తోందిట. వాళ్ళనాన్నేమో తనమాట కాదనలేక తనిష్టప్రకారం చదివిస్తున్నాట్ట. పైకిమటుకు వాళ్ళమ్మతో పెళ్ళికోసం చదివిస్తున్నట్లుగానే చెబుతాడట. ఎంత సరదాగా చెబుతుందది ఈ కబుర్లన్నీ? విన్నకొద్దీ వినాలనిపిస్తుంది.

ప్రమదకు చదువుమీద శ్రద్ధేలేదు. వాళ్ళనాన్న, అన్నయ్య బలవంతంమీద చదివిస్తున్నారట. 'నా ప్రాణానికి యిదెక్కడ తనో? ఇంకా ఎన్నాళ్ళో? ఆ బి.ఎ. డిగ్రీ వచ్చేవరకూ తప్పదు' అంటుంది. హాయిగా సంవత్సరం పొడుగునా సినిమాలు, షికార్లతో గడిపేస్తుంది పరీక్షలముందర ఆ గైడ్సు ముందర వేసుకొని, ముక్కున పట్టించుకొని దులిపేస్తుంది. 'హాయిగా తిని తిరిగేందుకు లేకుండా నా ప్రాణానికి యిదెక్కడి పీడో?' అంటూంటుంది. చక్కగాచదివిస్తూంటే చదువుకోటానికేం? అంటే, 'నీకేం అలాగే అంటావు స్వేచ్ఛా జీవివి కాబట్టి. నన్ను చూడు సంవత్సరం పొడుగునా దిక్కుమాలిన కాలేజి, పుస్తకాలు గొడవ, బ్రతుక్కి స్వేచ్ఛే తక్కువయి పోయింది. పొద్దున్న లేచి సాయంత్రం దాకా, రాత్రికి చదివినా, చదవకపోయినా వాళ్లకోసరమైనా పుస్తకాలు ముందేసుకు కూర్చోవాలి. నాయిష్టప్రకారం చేయడానికి స్వేచ్ఛ ఎక్కడిది?' అంటుంది.

ఏమిటో విచిత్రం? ఉన్నవాళ్లకు చదువుకోవాలని వుండదు. అదుంటె తెలివితేటలు వుండవు. చదువుమీద ఆసక్తి తెలివితేటలూ రెండూ వున్న వాళ్లకు డబ్బుండదు. డబ్బుండి, చదువుకోవాలన్న ఆసక్తి కలిగి, తెలివితేటలున్నవాళ్లను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు! నవ్వుకొంది. తనకుమటుకు యిప్పుడు ఏం తక్కువైనది? బ్రతుక్కి కావాల్సింది ఒక్క చదువేనా? తనని ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే అమ్మా—నాన్నా, తనలోనే ప్రాణాలు నిలుపుకొన్న అమ్మా—నాన్నా తన అరికాల్లో ముల్లు విరిగితే గిలగిల లాడిపోయే అమ్మా—నాన్నా, తనభావి జీవితం సౌఖ్యప్రదం చేయాలని చెప్పులు అరిగిపోయేలా తిరుగుతున్నాడు నాన్న. తనను మనసున్న మనిషికి యివ్వాలని ఆయన వుబలాటం. తనని ప్రైవేటుగా పి. యు. సి కి కట్టమని ఒకటి రెండుసార్లు అన్నాడు. ఎంత ప్రైవేటుగా చదివినా కొంత ఖర్చుకాక తప్పదు. అది పెడితే అమ్మకు నిక్షేపంలా మందు వస్తుంది. అమ్మకంటె తన చదువెక్కువా?

అన్నం మాడువాసన కొడుతోంది. ఉలిక్కిపడ్డది రాధ ఎంతసేపటి నుంచి మాడుతోందో ఏమో! దిక్కుమాలిన ఆలోచనలు వద్దన్నకొద్దీ వస్తాయి వరద నీటి లాగా. గిన్నె కుంపటి వెలుగుతో దించి, కిందపెట్టింది. గదంతా చీకటిగా వుంది. లైటు వేద్దామనిలేచి తలుపు పక్కనవున్న స్విచ్ దగ్గరకు వెళ్లింది. తండ్రిగొంతు వినిపించి ఆగిపోయింది.

'లేదు సారూ! ఐదువేలు కట్నమిస్తామంటె వచ్చి పిల్లను చూసుకొంటామన్నారు. ఇంకెందుకు వృథాప్రయత్నం, తిరిగి వచ్చేశాను'

'కాస్తకూడా తగ్గనన్నారా?' నీరసంగా తల్లి గొంతుక.

'పిచ్చిసారూ! ఎందుకు తగ్గుతారు? మనం కాదంటె అవతల యింకొకళ్లు రెడీగావున్నారు పిల్లనివ్వడానికి. అందరూ మనలాంటివాళ్లే వుంటారా? వాళ్లు అడిగినంత యివ్వటానికి సిద్ధంగా వున్న వాళ్లు ఎంతమందో? వాళ్లముందర పోటీకి మన మెక్కడ నిలుస్తాం నీ పిచ్చి గాని!

'అయినా ఒక్కసారి వచ్చి పిల్లను చూసుకు వెళ్లమనక పోయారా? దాన్ని చూశాకయినా వాళ్లమనసు మారేదేమో!'

తండ్రి నవ్వు వినిపించింది. 'కేవలం పిల్ల అందచందాలకు ఆశపడి చేసుకొనే రోజులు గతించిపోయాయి. అదంతా మన భ్రమ. ఇప్పుడన్నీ కట్నం తరువాతే. వాళ్లు కోరినంత కట్నమిస్తానన్నాక



వికూతురి [illegible] చూస్తారు. అవి లేకుండా డబ్బున్న పిల్లను చేసుకుంటారు కాని అవివుండి డబ్బు లేకపోతే చేసుకోరు. అవి నచ్చకపోతే యింకోవాటికి వెడతారు. అన్నీ వున్నవాళ్ళు వుండకపోరుగా. అన్నీ వున్నవాళ్ళు పైలావచ్చినుగా కట్నాలు వుచ్చుకు ముందుకు వస్తూంటె అది మన బోటివాళ్ళ గొంతుకు బిగుసుకొంటోంది. ఉన్నవాళ్ళు యివ్వడం మానరు. ఇచ్చేవాళ్ళు వున్నప్పుడు యివ్వనివాళ్ళ దగ్గరకు వాళ్ళు రారు. ఇవ్వకపోతే వాళ్ళురారు కాబట్టి, యివ్వలేనివాడుకూడా ఆ బరువుకి తన నడుం విరిగిపోతున్నా అనూ ఎత్తుకున్నాడు. అందుకనే రోజులిలా వున్నాయి. బరువు మొయ్యలేనివాడు మొయ్యలేనని ఖచ్చితంగా చెప్పేసెయ్యాలి. చెప్పటంలేదు. నడుం విరగొట్టుకునయినా మోస్తున్నాడు. 'తరువాత మా నడుంలో వడితే వద్దాం లే' అనుకొని మోస్తున్నాడు. అంతంత బరువులు మేము మొయ్యలేమని నలుగురూ అని వదిలేసినప్పుడు వాళ్ళు తమ బరువంతా వాళ్ళ నెత్తిన వడితే మొయ్యలేరని తెలుసుకుంటారు. వీళ్ళు వాళ్ళ గాడిదలేం కారు కొట్టి మోయిస్తారేమోనని భయపడటానికి!'

'ఏమిటో అంతా మీలాగే వుంటారా? దాని అదృష్టం ఎలావుందో యింతకీ' ఇంతలో పళ్ళే దగ్గర ప్రాపెరి సలవనివ్వలేదు!' రాధ తేలిగ్గా శ్వాస విడిచింది. పరంధామయ్య వ్యక్తిత్వం మీద అపరిమితమైన గౌరవం పొందింది రాధకు. లైటువేసి కంచు గ్లాసుతో మంచినీళ్ళు తీసుకు యివతలకి వచ్చింది.

'నాన్నా! ఈ పటికబెల్లం ముక్క నోట్లో వేసుకో తల్లి నోట్లో పటిక బెల్లం ముక్క వేస్తున్నాడు తండ్రి. అక్కడే కొంచెం దూరంగా మంచముంది.

తలెత్తి రాధను చూసిన పరంధామయ్య, 'మంచినీళ్ళు తెచ్చావా తల్లీ! అక్కడే మంచమ్మావేం [illegible] అన్నాడు మాటలతోనే మంచితనాన్ని, మమతను ఆ మాటతో కలబడుస్తూ.

'[illegible] నాన్నా వస్తున్నావు' అంటి గిన్నె మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ, గ్లాసందుకొంటూ కూతుర్ని వేయిపట్టి తన్మయ పారవశ్యంలోకి వెళ్ళిపోతూ 'నువ్వు చేసు [illegible]

లేకుండా ఎప్పటికప్పుడు అన్నీ అందిచ్చేస్తుంటావు' అన్నాడు.

ఏకపకా నవ్వింది రాధ 'అలసి యింటికొచ్చిన వారికి మంచినీళ్ళు యివ్వాలని, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టాలని, రోగికి మందివ్వాలని, ఏడుస్తున్న పసిపిల్లల్ని వూరడించాలని కూడా ఒకరు చెప్పాలా నాన్నా'

'నా తల్లి బంగారు తల్లికదూ! అందుకే చెప్పనక్కరలేదు' సంచిలోంచి జిలేబి పొట్లం తీసి అందిస్తూ అన్నాడు.

'చిన్నప్పుడు తెచ్చినట్లు నాకు ఇప్పుడు కూడా రోజా యివెందుకు నాన్నా'

'అయితే నువ్వు మాకిప్పుడు పెద్దదానివయ్యేవా?' నవ్వు దాచుకోలేక పోయింది రాధ. తండ్రితో ప్రీతి కలిపింది. వాళ్ళిద్దర్ని చూస్తున్న పార్వతమ్మ దిగులు, ఆయాసం అన్నీ మరచిపోయి చిరునవ్వుతో విచ్చుకొన్న పెదవులతో కళ్ళు మూసుకొన్నది.

రాధను చూస్తున్న పరంధామయ్య, 'ఈ నెలలోనైనా అమ్మాయికి మంచి బట్టలు కొనాలి,' వాక్య చివర వరకూ వచ్చిన మాటను ఆపేశాడు. ముందు పార్వతికి మందు ముఖ్యం. అవి–యివి అన్నీ తలకు మించిన బరువవుతాయి. పై నెలలో చూసుకోవచ్చు!' సర్ది చెప్పుకొన్నాడు.

'లే నాన్నా. స్నానం చేసిరా. ఈంచేద్దాం అన్నం చల్లారి పోతుంది' రాధ మాటలకు 'అలాగే నమ్మా' అంటూ లేచాడు పరంధామయ్య.

* * *

'కాఫీ తీసుకో నాన్న' ఆఫీసు నుంచి వచ్చి అప్పుడే తల్లి మంచం మీద కూర్చున్న తండ్రికి కాఫీ తెచ్చిచ్చింది రాధ.

'అన్నట్లు మంచినీళ్ళు మరచిపోయావివాళ' గ్లాసక్కడ పెట్టి వంటింట్లోకి పరుగెత్తింది. ఆ నవ్వుముఖం చూడగానే అలసట మరచిపోతాడు పరంధామయ్య.

మంచినీళ్ళ గ్లాసందుకొంటూ, 'అమ్మకు యివాళ ఎలా వుంది?' అడిగాడు.

'రోజుకంటె నయమే. దగ్గు ఆయాసం [illegible]

[illegible] వుంటోంది' అన్నాడు డాక్టరు ఇంతకుముందే నిద్రపోయింది' అన్నది.

'దానికి నీ పెళ్ళిగురించి బెంగపెట్టుకొందమ్మా. ఏం చేస్తాం?' బాధగా అన్న తండ్రి మాటలకు, 'బెంగెందుకు నాన్నా దాన్ని గురించి. నువ్వెళ్ళి స్నానం చేసిరా. తువ్వాలూ, సబ్బు తెచ్చిస్తాను' అన్నది మాటమారుస్తూ.

తండ్రికి తువ్వాలు, సబ్బు అందిచ్చి, వంటింట్లోకి నడచింది.

శనివారం. రాత్రికి చపాతీలపిండి కలిపి పెట్టింది. అప్పడాలకర్ర, రాయి తెచ్చి కుంపటిదగ్గర పెట్టుకుంది. వేతిగిన్నెలో యింత నూనె వేసుకొని అదీ కుంపటిదగ్గర పెట్టుకొంది. పిండి వుండలు చేసిపెట్టుకొని, పెనంతెచ్చి కుంపటిమీద వాలేసింది. ఒక్కొక్కటి ఒత్తి కాలుస్తోంది. అవి చక్కగా పొంగుతున్నాయి. సంతోష సమయంలో పొంగే మనసులాగా. వాటిని చూసి సంతోషపడ్డది రాధ.

'ఏమ్మా అన్నం వండుకొన్నావా రాధా' వంటింట్లోకివస్తూ అడిగాడు పరంధామయ్య.

తలెత్తి తండ్రిని చూసి, 'స్నానం అయిపోయిందా నాన్నా?' అని. 'నాకు పొద్దుటి అన్నం వుంది' అన్నది.

నుదుట విభూతి పెట్టుకొచ్చిన పరంధామయ్య, 'ఆ చిన్న గిన్నెనా? అదెలా చాలుతుందమ్మా? కాసిని ఏరిస్తాను, రెండు పిడికిళ్ళు అవి కాగానే వడేయ్యి వుడుకుతుంది' అన్నాడు.

'చాలు నాన్నా గిన్నెలో నాక్కెపెట్టాను. రెండు రొట్టెలు తింటాను' పెనంమీది చపాతీ తీసి పళ్ళెంలోవేస్తూ అన్నది.

'రెండు రొట్టెలు తింటే ఎక్కువవుతాయా? బియ్యం కడిగి పడెనుకో.'

'రొట్టెల్లో పప్పు వేంచుకొంటావా' అడిగింది.

'వద్దమ్మా. వుట్టివి తినేసి కాసిని మజ్జిగ తాగుతాను'

'వంచుకోమాడడూ! పొద్దున్న బాగున్నదన్నావుగ'

'లేదమ్మా! వారానికొకపూట ఎలా తింటేయేం? ఒక్కపూట కూడా సరిపెట్టుకోలేక పోవటం చాలా బలహీనం కదమ్మా! వారానికి కొకపూట ఎలాగోలా

తినటం నేర్చుకోవాలి. అది తరువాత ఎప్పుడయినా అవసరమయినా బాధని పించదు. ఏమంటావు?'

'నన్నే సమర్థించావు నాన్నా. నేను వాటన్ని వారాని కొకసారి సరిపెట్టుకో లేనా? ఇప్పుడా రెండు పిడికెళ్ల బియ్యం వండకపోతే ఏం?'

రాధ ప్రతిసారి ఆలోచనలో, మాటలో తనని పడగొడుతూంటె అపరిమిత ఆనంద పడ్డాడు పరంధామయ్య.

'అది అందరికి వర్తిస్తుంది నిజమే కాని, నువ్వింకా చిన్నపిల్లవేగా...' మధ్యలోనే అందుకొంటూ, 'ఇప్పట్నుంచే అలవాటు చేసుకొంటె సులభం నాన్నా' అన్నది.

'నీ ఇష్టం. నాకంటె చిన్నదానివయినా మా అమ్మలాగా కబుర్లు చెబుతూంటె నేనేం మాట్లాడను?' ముసిముసిగా నవ్వింది రాధ.

'అమ్మకేం పెడతావు మరి.'

'అమ్మకు నేతితో కాలుస్తా.'

'నువ్వొకత్తె. నేను కాలుస్తా.' కుంపటి పక్కన పీటవేసుకు కూర్చున్నాడు పరంధామయ్య.

'అయితే మీ అమ్మ నీచేత రొట్టెలు కాల్పించేదా నాన్నా' ఫక్కుమన్నది. తనూ ఫక్కుమన్నాడు.

పరంధామయ్యంటే రాధకు తండ్రన్న గౌరవం వున్నది. కాని తండ్రితో మాట్లాడుతున్నట్లు వుండదు. ఒక స్నేహితునితో మాట్లాడుతున్నట్లు వుంటుంది. పరంధామయ్య ఆశించినది అదే. మాట్లాడింది ఎలాంటిదయినా అర్థం చేసుకొని సమానస్థాయిలో సమాధాన మివ్వ గలదు.

రాత్రి పడుకోబోయేముందర రాధవంక చూశాడు పరంధామయ్య. అప్పటికే గాఢ నిద్రలో వుంది. ఆటలతో అలసిపోయి విశ్రమించే పసిపిల్లలాగా వుంది. ఒక్క నాడు విసుక్కోకుండా తమిద్దరికి పసిపిల్లలకు చేసినట్లు చేస్తుంది. ఈ భారాన్ని అవలీలగా మోస్తుంది. 'ఈ రాధా తనకు బరువు?' పరంధామయ్య మనసు గిజగిజ లాడిపోయింది నాకు నా రాధ బరువెప్పటికీ కాదు. నాయింట్లో నా సేవకు, నా స్వార్థానికి వినియోగించుకోకుండా అది దాని బ్రతుకులో సాధువుని చవి చూడాలే

[illegible] ఈ ప్రయత్నం. పిల్లాపాపతో కళకళలాడు తూంటె చూడాలనే అభిలాష.

'ఇంకా పడుకోరేం? నిద్ర రావటం లేదా? పగలంతా ఒళ్ళు హూనం చేసుకు వస్తే నిద్రరాక పోవటమేం?' రాధ పక్కనే మంచున్న పరంధామయ్యను చూసి అన్నది పార్వతమ్మ.

'నిద్రవస్తోంది. ఒకమాట చెబుదామని ఆ వెంట్రప్రగడలో ఏదో సంబంధం వున్నదట. వెంకయ్య చెప్పాడు. పిల్లాడు బాగానే వుంటాడట. వ్యవసాయం చేసు కొంటున్నాడు. చదువెంతోసరిగా తెలియదు. ఉండటానికి యిల్లువుంది. పొలంవుంది. సంవత్సరం పొడవునా ఏ బాదర బందీ లేకుండా సాగిపోతూంది. మిగిలేత్తే కొద్దో గొప్పో మిగులుతుంది. తల్లి మొన్నే మధ్యే పోయింది. ఒంటరిగాడు' అన్నాడు.

'కట్నమేపాటిట'

'కట్నం మక్కరలేదు అంటున్నాడట. నేటి యువతరంలోను కొద్దిగా చలనం బయల్దేరుతోంది'

'అబ్బాయికి ఏ అవకరం లేదేమో ననుకొంటున్నారా?' సందేహంగా అడిగింది.

'ఏదో వంకరవున్నవాళ్ళే కట్నం వద్దంటారా? మిగతావాళ్ళంతా మనసులేనివాళ్ళంటావా?'

'ఏమోనండి ఇంతకీ తోబుట్టువు లెవరూ లేరా?'

'అక్క, చెల్లెలు వున్నారు ఇద్దరూ పెళ్ళయి కాపురానికి వెళ్ళారట.'

'చెల్లెలుకి కూడా పెళ్ళయిందా? ఎన్నాళ్ళయిందిట పెళ్ళయి?'

'అడుగలేదు. అప్రస్తుతమని వూరు కొన్నాను. నా చెల్లెలిపెళ్ళిచేసి తరువాత నా పెళ్ళి చేసుకోలేదూ?'

'అడగాల్సింది. వయసెంతన్నాడు?'

'కనుక్కోలేదయ్యా, మీ అమ్మాయికి సరిపోతాడు అన్నాడు'

'వయసుకూడా తెలీదా?' అని 'అయినా రేపోకసారి వెళ్ళొస్తారా?' అన్నది భర్త ముఖంలోకి చూసి.

'అదే అనుకొంటున్నాను. కుర్రాడు చూస్తే మంచిమనసు కలవాడులా వున్నాడు. పిల్ల ప్రధానం కాని కట్నం ప్రధానంకాదు' అన్నాడుట.

తపన

'మరే ఏ పుట్టలో ఏ పాముందో ఏం చెప్పగలం?' సన్నగా దగ్గు వచ్చింది. ఎక్కడో గడియారం పదకొండు కొట్టింది. 'పడుకోండి పొద్దున్నే లేవాలి' అన్నది.

లేచి పక్కమీద వాలాడు పరంధామయ్య.

* * *

నాన్న మళ్ళీ ఏదో సంబంధం చూడటానికి వెళ్ళాడట. శలవు రోజు వస్తే ఈ సంబంధాల కోసరమని కాళ్ళ కండెలు కట్టేలా తిరుగుతాడు విశ్రాంతి లేకుండా. అయినా తన కప్పుడే వయసేం ముంచుకుపోయిందని అంత తొందర? వద్దని, క్షణం తీరిక లేకుండా అలా తిరగవద్దని, యిలా వుండటమే తనకెంతో ఆనందంగా వుందని ఎలా చెప్పటం ఈ నాన్నకు? 'అలా విశ్రాంతి లేకుండా తిరుగొద్దు నాన్నా, నా పెళ్ళి కిప్పుడేం తొందర?' అంటే, 'అది నా కర్తవ్యమమ్మా' అంటాడు.

కర్తవ్యం. ఏమిటీ కర్తవ్యం? తనూ ఒక ప్రాణి నన్నమాట మరిచిపోయి, తన శరీరం విశ్రాంతి వాంఛిస్తుందన్నమాట మరచిపోయి తిరగటం కర్తవ్యమా?

'రేపు పెళ్ళయాక తమ పని యింతేనా?' నవ్వొచ్చిందా ఆలోచనకు రాధకు. అదెప్పటి సంగతి. ఇంకొక పాతికేళ్ళనాటి మాట. అప్పటికీ ఈ కాలం యిలాగే మారకుండా వుంటుందా? నిముష నిముషానికి మారుతున్న కాలం — ఇంకొక పాతికేళ్ళనాటికి కూడా యిలాగే వుంటుందని ఎలా అనుకోవటం? ఈ లోపల యువతరంలో ఎంతో మార్పు రావచ్చు! ఇప్పుడు లోలోపల రాజుకుంటున్న ఈ బడబాగ్ని బద్దలయి ఈ కట్న పిశాచం మాడి మసయి పోవచ్చు! వధూవరులు తలిదండ్రుల చాటున కేవలం తోలుబొమ్మలులాగా ఆడకుండా, తమ వ్యక్తిత్వం చాటుకొనే రోజు వస్తుంది. తమ స్వేచ్ఛను గుర్తిస్తారు. సాంప్రదాయాలనే మూర్ఖపు శృంఖలాలను త్రెంచుకొని బయటపడగలరు. ఆడపిల్లను తమ గుండెల మీద కుంపటిగా భావించే తలిదండ్రులు అది తమ భ్రమ అని తెలుసుకో గలుగుతారు.

ఆడదంటె మగవాడి చేతులో కీలుబొమ్మ అనుకొనే రోజులు పోయి, కణకణలాడే నిప్పులాంటిదని తెలుసుకొనే రోజులు రావాలి. ఆడది తన వ్యక్తిత్వం తను చాటుకోవాలి. ఆడదాని వ్యక్తిత్వం గుర్తించాలి. ఈ సంసారపు జోడెద్దుల బండికి కట్టబడే రెండు ఎద్దులు సమానమే అని గుర్తించాలి. రెండు సమానంగా నడచినప్పుడే బండి సరిగా నడవగలదు. వాటితో హెచ్చు తగ్గులు వున్నప్పుడు బండి సరిగా నడవదని తెలుసుకోవాలి. బండిని లాగటానికి రెంటి బాధ్యత సమానమేనని తెలుసుకోవాలి. వివాహానికి మనసు — మమత ముఖ్యంగాని, వర్ణాలు, శాఖలు, డబ్బు కాదని గుర్తించాలి. భర్త భార్యకంటె అన్నివిధాల అధికంగా వుండాలన్న సంకుచితాభిప్రాయం మాసిపోవాలి. మనసుని మనసు అర్థం చేసుకొని రెండూ ఒకటిగా జీవించడమే వైవాహిక జీవితం అని గుర్తించాలి.

'అమ్మాయ్ రాధా!' తల్లి పిలుపుకి వులిక్కిపడ్డది రాధ. మళ్ళీ ఆలోచనలు. ఒంటరిగా కూర్చుంటే వదిలిపెట్టవు. కిటికీ దగ్గరనుంచున్న రాధ యివతలకు వచ్చింది. 'ఎందుకమ్మా పిలిచావు? ఇంకా మందుకి వేళ కాలేదుగ! నువ్వు భోజనం చేస్తావా?'

'నా భోజనానికేం తొందర. నాన్నను రానివ్వు చేస్తాను. మధ్యాహ్నానికి వస్తానని చెప్పారుగా! నువ్వెళ్ళి భోంచేయి. చిన్నపిల్లవి నువ్వెందుకు కనిపెట్టుకు కూర్చోటం' అన్నది పార్వతమ్మ.

'అదిసరేగాని ఎందుకు పిలిచావు?'

'ఆమాట చెప్పటానికే. పద నామాట విని నువ్వెళ్ళి భోంచేయి' తల్లి గొంతులో తొణికిసలాడుతున్న వాత్సల్యానికి చలించింది రాధ. కాసేపు 'భోజనం ఒక్కరోజుకి ఆలస్యమయితే ఏం?' అనుకొంది.

'చేస్తానమ్మా ఒక్క పదినిమిషాలాగి' అని తండ్రి వస్తున్నాడేమో చూద్దామని వీధివాకిలి తలుపులు తీసింది. ఎదురుగుండా గొడుగు పుచ్చుకుని పరంధామయ్య నిలబడి వున్నాడు.

'నాన్న వచ్చాడు' చేతిలోని గొడుగు అందుకొని సంతోషంగా కేకేసింది. రాధ కేకకు కళ్ళు విప్పిన పార్వతమ్మ ఏమయిం

తన్నట్టు ఆత్రంగా చూసింది భర్త ముఖంలోకి. వచ్చి భార్య మంచంపై కూర్చున్నాడు. రాధ మంచినీళ్లు తేవటానికి లోపలకు వెళ్ళింది.

'రెండవ పెళ్లిట' అన్నాడు.

'రెండవ పెళ్లా?' పార్వతమ్మ నిర్ఘాంత పోయింది.

'అవును. వెంకయ్య ఆ విషయం చెప్ప లేదు. అక్కడికి వెళ్ళాక తెలిసింది' అన్నాడు.

రాధ మంచినీళ్ల గ్లాసుతెచ్చి తండ్రి చేతి కందిచ్చింది. ఆమె ముఖంలోకి ఒక సారి చూసి గ్లాసందుకొన్నాడు పరంధామయ్య.

'అయితే పిల్లని చూడటానికి రమ్మ న్నారా?' ఆతుర్దాగా అడిగింది.

'ఎంత లేనివాడ్నిఅయితే మటుకు నా కడుపున పుట్టినదాన్ని నా వయసున్న వాడి చేతిలో ఎలా పెడతాననుకొన్నావు?' నవ్వాడు ఏదో అతీత లోకాలకు వెళ్ళినట్టు.

'ఏదో తొందరకొద్దీ అన్నాను' నొచ్చు కుంటున్నట్టుగా అన్నది పార్వతమ్మ.

'తొందరేముందిలే పారూ. నీ విధి విన్ను అడగమన్నది.'

'లే నాన్నా స్నానంచేసి భోంచేద్దు గాని, నీ కోసం అమ్మా నేనూ కని పెట్టుకు కూర్చున్నాం. దిక్కుమాలిన సంబంధం పోతే పోయింది పీడ' తండ్రికి తువ్వాలదిస్తూ అన్నది రాధ.

'నాకోసం కనిపెట్టుకు కూర్చున్నారా? ఎందుకు? వేళ్టకి భోజనం చేయకపోతే నీ ఆరోగ్యం ఎలా కుదుటపడుతుంది పారూ!' అంటూనే లేచి చకచకా స్నానానికి వెళ్ళాడు.

ఆమాటలు పార్వతమ్మ వినలేదు. ఇదీ తప్పిపోయింది. దీని పెళ్లెలా అవుతుంది? తనకది కళ్లారాచూసే యోగ్యం వున్నదా? ఏమిటో ఎలా రాసిపెట్టివుందో? పెద్దగా నిట్టూర్చింది పార్వతమ్మ, నీరసం ఎక్కు వయింది.

* * *

'పార్వతీ రేపు అమ్మాయిని చూసు కొనేందుకు వస్తున్నారు నేను రేపు మధ్యాహ్నంనుండి ఆఫీసుకి శలవుకూడా పెట్టాను'

'నిజంగా! ఇంతకీ అబ్బాయి ఏవూరు వాడు? మీకీ సంబంధం విషయం ఎవరు చెప్పారు? పక్కమీద లేచి కూర్చుంది పార్వ తమ్మ.

చొక్కావిప్పి మేకుకి తగిలించి భార్య పక్కన మంచంపై కూర్చున్నాడు. నా ఫ్రెండొకాయన చెప్పాడు. అబ్బాయి అతనికి తెలిసినవాడేనట. రేపు వాళ్లిద్దరూ కలసి వస్తామన్నారు.

'మీరుచూశారా అబ్బాయిని?'

'నిక్షేపంలా వుంటాడు. మనరాధ పక్కన నుంచుంటె చూడటానికి చక్కగా వుంటుంది'

'ఏపాటి అడిగాడేం?'

'పిల్ల నచ్చితే చాలన్నాడు. అసలా సభ్యతా సంస్కారాలు పిల్లాడి ముఖంలో తాండవిస్తున్నాయి పార్వతీ;'

'పిల్లనచ్చితే చాలన్నాడా? అయితే మన రాధ అదృష్టవంతురాలు' అప్రయత్నంగా అన్నది.

'నేనూ అదే అనుకొంటున్నాను ఇంతకీ రాధేది? నే వచ్చి యింతసేపయినా కనిపించ లేదేం?'

'మంచినీళ్లకు వెళ్లినట్లుంది. ఇంతకీ పిల్లాడికి వాళ్ల తల్లిదండ్రు లెవరూ లేరా? ఈయనతోకలిసి రావటమేం చూడ టానికి?'

'తండ్రిలేడట తల్లి, అన్నలు వదినలు ఆడపడచులు అందరూ వున్నారు వాళ్లంతా దూరంగా ఎక్కడో విశాఖలో వున్నారట. చేసుకొనేది అబ్బాయేకదా! అతనికి నచ్చితే చాలు. తరువాత వాళ్లవాళ్లకు తెలుప వచ్చునన్నాడు ఇంతవరకూ ఎన్నిసంబంధాలు వచ్చినా అతనసలు పిల్లని చూడటానికే వెళ్లలేదుట. ఇదే మొదటిసారి అతను పిల్లను చూడటం. పిల్లను చూచుకోమని చెప్పటానికి వచ్చినవాళ్లు చెప్పిన వివరాలే అతనికి నచ్చలేదట! 'అనవసరంగా దేనికి పిల్లను చూడటం, చేసుకోనివాడిని-ఇదేం జూ కాదు కదా! మనం చేసుకోము అని తెలిశాక వెళ్లటం అనవసరం' అన్నాడుట.

'ఏమిటినాన్నా యివాళ అప్పుడే వచ్చే శావు?' ముఖాన వంటిన అక్కడక్కడ చిందిన నీళ్లతో బిందె చంకన పెట్టుకు వచ్చిన రాధ అడిగింది లోపల అడుగు పెడుతూనే—


'మా రాధమ్మతల్లి ఒకయింటి దవ బోతోంది. ఆ మాట చెబుదామని'

'అయితే నే యింట్లో వుంటే మీకు బాగుండ లేదన్నమాట.' వంటింట్లోకి వెళ్లిపోతూ అన్నది.

నవ్వుకొన్నాడు పరంధామయ్య. పార్వ తమ్మ నవ్వింది.

* * *

'అమ్మా నువ్వెళ్లి పడుకోమ్మా. లే! పోతే అలా పీటవాలుకు కూర్చో. ఉట్టినే బరువెత్తితేనే ఆయాసమంటావు. గుండె



నొప్పి వస్తుంది: మంచిది కాదది. అలా కూర్చో నా మాట విని' కుంపటిముందర కూర్చుని ఫలహారం తయారు చేస్తున్న తల్లిని వుద్దేశించి అన్నది రాధ

'ఈ ఒక్కరోజు పని చేయనివ్వు— ఏ నొప్పిరాదు. బ్రతికినన్నాళ్ళూ వుండే రోగానికి.'

'అలా మాట్లాడకు—ఇప్పుడేమయింది నీకు? ఇంకా కొద్ది రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి తగ్గిపోతుందని డాక్టరు చెప్పలేదూ? నువ్వేమో విశ్రాంతి తీసుకోవు. ఎలా తగ్గుతుందేం?' కసురుకుంది రాధ.

'కోప మెందుకమ్మా' అప్రయత్నంగా పార్వతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'పొగరుగా మాట్లాడి నీ మనస్సు నొప్పించానుకదూ? క్షమించమ్మా. ఇంకెప్పుడూ అలా మాట్లాడను' రాధ గొంతు బొంగురుపోయింది.

రాధ తల నిమురుతూ 'క్షమించటమా? ఈ అమ్మ దృష్టిలో రాధెప్పుడు క్షమాపణ అడగవలసిన తప్పు చేయదు' అన్నది.

'నువ్వెళ్ళి ముందరగది వూడ్చి నీ పని కానిచ్చుకో. పెందరాళే— ఈ లోపల నాన్న వాళ్ళను తీసుకు వస్తారు.'

ముందరగది వూడ్చి, పొరుగింటినుంచి తెచ్చిన రెండు కుర్చీలు వేసింది. పక్కనే యింట్లో వున్న మ్నాలు వేసింది. ఎదురుగుండా చాప పరచి యివతల గుమ్మం దగ్గరకు వచ్చి చూసింది. బాగానే వున్నట్లనిపించింది తల్లి మంచం అంతకు ముందరకే దొడ్లో పెట్టేసింది.

గుమ్మం దగ్గర అలికిడి అయి అటు తల తిప్పి చూసింది. తండ్రివెనుక అపరిచిత వ్యక్తులిద్దరూ వచ్చేసారు. చక చకా లోపలకు వెడుతున్న రాధ చెవిన పడ్డాయి పెద్దాయన అడుగుతున్న మాటలు—

'ఈ అమ్మాయేనా మీ అమ్మాయి?'

'అవునవును' అంటున్నాడు తండ్రి.

వెళ్ళి ముఖం కడుక్కువచ్చి, పండక్కి కొనుక్కొన్న గులాబి రంగు చీర, నల్ల జాకెట్టు వేసుకొని బొట్టు పెట్టుకొన్నది.

'వాళ్ళొచ్చేశారు—తొందరగా కానివ్వు' తొందరపెట్టింది పార్వతమ్మ

తపన

పార్వతమ్మ గుండె వేగంగా కొట్టుకొంటోంది. ఈ సంబంధం ఖాయమైపోతే బాగుండు, దానికి మూడు ముళ్ళూ పడితే నిశ్చింతగా గడుపవచ్చు.'

'ఫలహారం పళ్ళెంలో పెట్టావా పార్వతీ' వరంధామయ్య లోపలకు వచ్చాడు.

'ఆ! ఆ! పెట్టా' పళ్ళెలు ముందుకు తోసింది,

ఫలహార పళ్ళెలు పట్టుకు వెళ్ళాడు వరంధామయ్య. తన కూర్చున్న మ్నాలు ముందుకు జరిపి దానిమీద పెట్టాడు. లోపలకు వెళ్ళేసరికి రాధ రెండు గ్లాసులతో మంచినీళ్ళు యిచ్చింది. కూతురి ముఖంలోకి చూసి నిండుగా నవ్వుతూ గ్లాసులు తీసుకువెళ్ళాడు వరంధామయ్య. తండ్రి నవ్వు చూసేసరికి నవ్వొచ్చింది రాధకు. తరువాత సిగ్గనిపించి తలవంచుకుంది. పార్వతమ్మ ఈ లోకంలో లేదు. యాంత్రికంగా పనిచేస్తోంది.

'రాధా నువ్వు కాఫీ పట్టుకురామ్మా' అన్నాడు వరంధామయ్య లోపలకువచ్చి. గిన్నెలో కాఫీ గ్లాసుల్లోపోసి, మూడు గ్లాసులు స్టీలు పళ్ళెంలో పెట్టుకుని, తండ్రివెనుకే అడుగులు వేయసాగింది. 'పార్వతీ నువ్వుకూడా రా'

'చేతులు కడుక్కు వస్తున్నా. అమ్మాయిని నన్ను తీసుకు రమ్మంటావా?'

'ఒకళ్ళు తీసుకు వెళ్ళేది ఏమిటమ్మా'

ఉత్తరాలు రాసేవారికి మనవి

ఉత్తరాలు రాసేవారు ఈ క్రిందివి గమనించగోరుతాము.

—తపనతో ఇంగ్లీషు లిపి వాడరాదు.

—రాసేవారి పూర్తిపేరు చిరునామా ఉత్తరంలో ఉండాలి. అంతా తెలుగు లిపిలోనే ఉండాలి.

—అన్ని ఉత్తరాలూ వ్యక్తుల పేర కాక సంపాదకుడు, ఆంధ్ర పత్రిక వారపత్రికకి రాయాలి.

—సంపాదకుడు

కొరికింది రాధ.

'పదండి నీ వెనకాలే నేనూ వస్తున్నాను' అన్నది. అప్పటికే గుమ్మం దాటాడు వరంధామయ్య. రాధ చేతిలోని కాఫీగ్లాసు అందుకొని, వాళ్ళిద్దరికీ చెరొకటి యిచ్చి తనొకటి తీసుకున్నాడు.

రాధ చాపమీద కూర్చుంది. పార్వతమ్మ వచ్చి వంటింటి గుమ్మందగ్గర నుంచుంది. అబ్బాయిని చూశాక గుండె అదురు తగ్గింది. అతను తలెత్తి ఒకసారి పార్వతమ్మవంక చూశాడు. ఆ చూపులోనే నమస్కారింపు వున్నది.

అతని చూపులు రాధమీదకు మరలాయి.

'ఏమన్నా అడగాల్సివస్తే అడుగు బాబూ' కూడా వచ్చినాయన అన్నాడు. ఏమి అడగనక్కరలేదన్నట్లుగా తలవంకించాడు.

'యస్సెస్సెల్సీ పాసయింది. చదివిస్తే యింకా చదివేదిగాని నేనే చదివించలేక పోయాను' వరంధామయ్య అన్నాడు. అతను చిన్నగా నవ్వేడు.

'మీ పేరేమిటి బాబూ' పార్వతమ్మ అడిగింది.

తలెత్తి పార్వతమ్మవంక చూసి, 'రామకృష్ణ' అని 'నేనూ యస్సెస్సెల్సే పాసయ్యానండీ' అన్నాడు. ఏమనాలో తోచలేదు పార్వతమ్మకు.

'చదువు దేముంది? అవసరమయితే ప్రైవేటుగా కట్టి పాసవవచ్చు?' అని 'ఏమంటావు?' అన్నట్టుగా చూశాడు వరంధామయ్య.

'అవకాశం దొరికితే చదవాలని వుంది. ఈ సంపాదనతో దానికి' నిస్పృహగా అనేసి నవ్వాడు.

కట్నమెలాగూ అడగలేదు కాబట్టి అతని చదువుకి సాయపడాలి అనుకొంది పార్వతమ్మ. ఒప్పుకొంటేకదా! మనస్సు నిరాశ ఊహించింది.

అతనంత నిర్మొహమాటంగా మాట్లాడుతూంటే రాధ హాయిగా నూపిరి పీల్చింది.

అతను లేచి నుంచుని, 'వెడదామా?' అన్నాడు పక్కన వచ్చిన పెద్దమనిషితో.

'అలాగే. వెళ్ళొస్తాం వరంధామయ్యగారూ' ఆయనా లేచాడు. రాధ లేచి లోపలకు వెళ్ళబోయింది.

'ఒక్కమాట' అతనన్నాడు 'ఉద్యోగం

లేయటానికి పెళ్ళిస్తైనా అభ్యంతరమూ?

'లేదు' స్పష్టంగా సమాధానమిచ్చింది. హాయిగా నవ్వుకొన్నాడతను. రాధ పార్వతమ్మతో కలిసి లోపలకు వెళ్ళిపోయింది. పరంధామయ్య వాళ్ళను సాగనంపటానికి వాకిట్లోకి వెళ్ళాడు. చేసుకొనేట్లే వున్నాడు కాని, ఏమంటారో ఏం వినాల్సి వస్తుందో! పార్వతమ్మ చతికిల పడ్డది ఆయాసంగా.

'ఆయాస మొస్తోందామ్మా చెబితే విన్నావుకాదు' ఆదుర్దాగా అన్నది రాధ.

'లేదు'

ముందరగది సర్దటానికి వెళ్ళింది రాధ.

ఇది నిశ్చయమైతే లక్షణంగా జరిపించాలి అమ్మాయిపెళ్ళి. ఈ కాస్త కొంప అమ్మితే మూడువేలన్నా రాకపోవు. పడమరకు తిరుగుతున్న కామ్రఖత్తుకులు ఎక్కడ వాలిపోయినా ఫరవాలేదు. అమ్మాయిపెళ్ళి ఏ లోపంలేకుండా సాగిపోవాలి. అతను కట్నం ఎలాగో తీసుకోవటంలేదు. వెండికంచం, గ్లాసు, వుంగరం, వీలయితే రిస్టువాచి కూడా కొనివ్వాలి. కట్నం పుచ్చుకొన్న వాళ్ళు మటుకు మన్నిస్తున్నారా? నేటి కవే 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అని చెవులు మెలేసి గుంజుతున్నారు. అమ్మాయికి ఒక పట్టుచీరె కొనాలి. తనొక పట్టుచీరె, ఆయనొక పట్టుబట్ట కొనుక్కోవాలి. తన పెళ్ళి పట్టుచీరెతో యిన్నాళ్ళూ గడిచిపోయింది. అమ్మాయి పెళ్ళికి ఒకటి కొనుక్కుంటె, శేష జీవితం పంతృప్తిగా వెళ్ళిపోతుంది దానిపేరు మీదుగా. ఏమిటో తొందరగా పెళ్ళిచేసెయ్యాలన్న వుబలాటమేకాని, అది వెళ్ళిపోతే యింట్లో తమిద్దరికి ఎలా తోస్తుంది? పార్వతమ్మ కళ్ళలో నీళ్ళు తిప్పిరిల్లాయి. నీరసంగా వెనక్కు గోడకు వాలి కళ్ళు మూసుకొంది. 'పార్వతీ, పార్వతీ' రెండంగల్లో వచ్చి వంటింట్లో పడ్డాడు పరంధామయ్య.

'అమ్మాయిని చేసుకొంటానన్నాడు. తనకు నచ్చిందన్నాడు. ఇంకెవరితోను సంప్రతించవలసిన అవసరంలేదుట. వాళ్ళవాళ్ళకు వుత్తరం వ్రాస్తానన్నాడు. వాళ్ళన్నయ్య రాగానే ముహూర్తాలు పెట్టుకోవచ్చు! 'పిల్లనచ్చిందిచాలు కట్నంవద్దు' అన్నాడు—పెళ్ళికి ఆడపిల్ల తండ్రివని బయపడి తలకుమించిన బరువెత్తి వద్దన్నాడు లోకం గొడ్డుపోలేదు సుమా! గుంటకరాళ్ళలో రత్నంలా గాజు పెంకుల్లో వజ్రంలాగా, బురదనీటిలో వికసించిన పద్మంలాగా వున్నారక్కడక్కడ. మానవత యింకా పొంతం చచ్చిపోలేదు, కాదు కాదు—ఆ సమాధి లొంచే మళ్ళీ మానవత వుద్భవిస్తోంది. దానికి మన రామకృష్ణలాంటివాళ్ళే తార్కాణం. అదే అన్నాడు—మనిషికి మనసు ముఖ్యం. మనుగడకు కావాల్సింది మనసుని అర్థం చేసుకోగల మనసు.

'రాధను చేసుకొంటానన్నాడు అదృష్టవంతురాలు నా తల్లి రాధ' మాట పొంతం కాకముందే పార్వతమ్మ ముఖంలో బాధ కనుపించింది. 'ఏమయింది? నొప్పి వచ్చిందా?' భార్యను పట్టుకొని ఆదుర్దాగా అడిగాడు.

'రాధా అమ్మకు మంచం వెయ్యమ్మా' కేకేశాడు.

తండ్రిమాటలు వింటూ భావి జీవితానికి పునాది కడుతున్న రాధ చేతిలో చీపురు అక్కడే వదిలేసి మంచంకోసం దొడ్లోకి పరుగెత్తింది.

'అమ్మాయికి పట్టుచీరె కొందాము. ఒక వుంగరంకూడా చేయిద్దామా...'


'ష్! మాట్లాడకు పార్వతీ అవన్నీ తరువాత మాట్లాడుకోవచ్చు!'


'కట్నం వినండి. ఈ అవసరం ఎలా దాచుకోను? సొంపొంగులా వస్తోంది. కన్నీళ్ళు తెంచుకొని వెల్లువెత్తి ప్రవహిస్తోంది. పుట్టబోయే పిల్లలకోసమని తినీతినక అన్నట్లు ఈయిల్లు కట్టాము. ఇంకెందుకు మనకీయిల్లు? అమ్మేద్దాము. లక్షణంగా నిండుగా అమ్మాయి పెళ్ళి చేద్దాం.'

'అమ్మకు నక్క వేశావా,

'నీ పెళ్ళికోసం పట్టుకొన్న రగిం నీ పెళ్ళికి పూర్తిగా నయమయి పోతుందమ్మా. నిన్ను పెళ్ళికూతుర్ని నేనే చేస్తా.' గుండె పట్టుకుంట పార్వతమ్మ ఒక్క మాటుగా.

'పార్వతీ! మాట్లాడవద్దంటె విన్నావు కాదు. నొప్పి బాగావచ్చిందా?' రెండు చేతులోను పార్వతమ్మను పైకెత్తబోయిన పరంధామయ్య చేతుల్లోనే పార్వతమ్మ మెడ పక్కకు వాలిపోయింది. 'పార్వతీ' పిచ్చిగా అరిచాడు పరంధామయ్య. పాలులోకి వెళ్ళబోతున్న రాధ ఆ కేకకు అదిరిపడి వెనక్కుతిరిగి చూసింది. తన పెళ్ళికోసం తపించిపోయి అది చూడకుండానే శాశ్వతంగా కన్నుమూసిన అమ్మవంక పోట మాటరాక చూస్తూ నుంచుండి పోయింది ■






పరివేష్టం

సీరియల్

శిష్టా వెంకటరమణ




అది మండు వేసవి. ఎండ తాలూకు వడగాడ్పు ఈ చెవిలోంచి ఆ చెవిలోకి దూసుకుపోతోంది. మిట్ట మధ్యాహ్నం సూర్యుడు నడి నెత్తిమీదికి వచ్చేసి బాహాటంగా తన ప్రతాపాన్ని లోకానికి వెల్లడి చేస్తున్నాడు.

పన్నెండు గంటల ప్రాంతంలో స్కూలు బెల్లు గణగణమంటూ కర్ణపేయంగా మ్రోగింది. పిల్లలందరూ పలకా బలపం చేతిలోకి తీసుకుని నాలుగుగోడల మధ్యా బిగించుకుపోయి యింతసేపూ అలసిపోయి ఈ క్షణం కోసం నిరీక్షిస్తూ వచ్చిన తమ శరీరాలకి స్వేచ్ఛా వాయువుని పంచిపెట్టేందుకు పరుగు లంకించుకున్నారు.

ఆ సమయంలోనే గేటువరకూ పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయిన సాంబశివానికి స్నేహితురాలు జయలక్ష్మి గుర్తుకువచ్చింది. గుర్తుకు రావడం యేమిటి అతని పాదాలు మరి ముందుకు సాగిపోకుండా తక్షణం ఆగిపోయేయి.

దూరంగా జయలక్ష్మి కళ్ళు నులుముకుంటూ మధ్య మధ్య ముక్కునుంచి కారే నీళ్ళని యెడం చేత్తో పరికిణీ కొద్దిగా పైకెత్తి తను వొంగి తుడుచుకుంటూ, దిక్కులు చూసుకుంటూ, కాస్సేపు ఆగి అక్కడేవున్న పెద్ద మర్రిచెట్టు వైపు దృష్టి సారించి కొమ్మకొమ్మల్లోకీ తొంగిచూస్తూ అక్కడ తను కోరుకున్నది లభ్యం కాకపోగా బావురుమని పెద్ద పెట్టున శోకాలు తీస్తూ 'ఒరేయ్ సాంబా!' అని పిలుస్తూ అడుగు ముందుకు వేసింది.

సాంబశివానికి పిలుపు అందింది, అతని



చిన్నారి హృదయంలో వేయిదీపాల కాంతులు ఒక్కసారి తళుక్కుమన్నాయి. అతను గేట్లోంచి లోపలికి జయవైపు దొడు తీశాడు. రెండు నిమిషాలకి ఆ పిల్లని చేరుకుని చేతిలోవున్న సంచీని భుజాన వేసుకుని ఆ చేతినే జయ తలమీదవేసి 'మరిచి పోయేను జయా! గేట్లోకి వెళ్ళేక జ్ఞాపకం వచ్చేవు. అప్పుడే నీ పిలుపు వినిపించింది'. అన్నాడు సంజాయిషీ చెప్పుకుంటున్న ధోరణిలో.

జయ తలెత్తింది. ఎర్రగా దొరల పిల్లడిలావుండే అతని మొహం మెరుపు రంగు కలుముకున్న పసుపురంగు యాపిల్ పండు మాదిరిగా వుంది. చెక్కిళ్ళు చిట్లి రక్తం రాదుకదా అనిపిస్తోంది. మొహంమీద వేసవి ప్రతాపానికి ఫలితంగా చెమటలు బొట్లు బొట్లుగా విరిచేయి. మాటిమాటికీ తుడుచుకోవడంవల్ల తెల్లని యిస్త్రీ బట్ట మీద హఠాత్తుగా చేయివేస్తే కనిపించే మరకల్లా చేతి అచ్చులు అతని మొహం మీద ప్రత్యక్షంగా ప్రస్ఫుటిస్తున్నయ్.

జయ చేతిలో తండ్రి యిచ్చిన ఖరీదైన జేబురుమాలు వుంది. తన విషయంలో దాని గురించిన ఆలోచనే రాలేదు. యెదురుగా యెండ తాపానికి వాడిపోయిన పువ్వులా సాంబశివం కనిపించేసరికి ఆ పిల్ల

కొత్త సీరియల్ ప్రారంభం!

పరిలిప్తం

ఆతని చేతికి రుమాలు అందిస్తూ 'తుడుచుకో సాంబూ,' అన్నది ప్రేమగా. జయం అక్కడే మూడో క్లాసు చదువుతోంది. సాంబశివం ఐదో తరగతి పరీక్ష యిచ్చేందుకు సిద్ధంగా వున్నాడు. యిద్దరి తండ్రులూ మంచి హోదా, పలుకుబడీ కీర్తి ప్రతిష్ఠలు వున్నవాళ్లే. తల్లులిద్దరూ కాలేజీ చదువులు చదివి గృహ నిర్వహణ బాధ్యలు తీసుకున్న నిరాడంబర స్త్రీలు. యెదురెదురుగా వున్న రెండు మేడల్లో పసుపు పచ్చని రంగు వేయించిన మేడ డాక్టర్ గిరిధర్‌రావ్ పి. హెచ్‌.డి ది. ఆకుపచ్చని రంగుగల ఆ మేడ జయ తండ్రి డాక్టర్ రాజశేఖరానిది. అటు జయ తల్లితండ్రులూ, యిటు సాంబశివం తలితండ్రులూ బాల్య స్నేహితులే కనుక పిల్లల మైత్రికి యెటువంటి ఆక్షేపణా, ఆటంకమూ కలగలేదు.

జయ చేతిలో రుమాలు అందుకుని మొహం తుడుచుకుని ఆ పిల్లభుజం మీద చేయివేసి బయటికి తీసుకు వచ్చేడు పన్నెండేళ్ల సాంబశివం. మిట్టమధ్యాహ్నపు లూ యెండకి యింట్లో పడుకోమనే పోరు యిద్దరినీ వేధిస్తూనే వుంది. 'చూడు జయా మనం చెరువు గట్టు వరకూ వెళ్లి ఆడుకుందాం రాకూడదా నువ్వు,' అని అడిగేడు.

జయ తలెత్తి అతని మొహంలోకి చూసింది భయంగా. ఆకాశంలో సూర్యుడి కిరణాలు ఆ కళ్లల్లో చొరబడుతున్నాయి. 'యిప్పుడా? అమ్మ తిట్టదూ. నాన్న కేకలు వేస్తారు,' అంది గుండె దిటవు పరుచుకుంటూ.

సాంబశివం నవ్వి పూరుకున్నాడు. 'వూరికినే అడిగేను. యిప్పుడు యెక్కడికీ వద్దులే. తిన్నగా యింటికే వెళ్లిపోదాం,' అన్నాడు త్వరత్వరగా నడుస్తూ.

జయ మొహం అప్పటికే చిన్నబోయింది. సాంబశివం ఒక్కసారి కన్నా యెక్కువ యేదీ అడగడు, బతిమాలించుకుని బుజ్జగిస్తే తప్పకుండా వెళ్లి ఆడుకోవాలనీ, యింట్లో యే జేజమ్మ దిగి వచ్చినా లెక్క చేయకూడదనీ ప్రతిసారీ అనుకుంటూనే వుంది. ఆ విధంగానే యీసారి కూడా ఆతని మాటల్ని పెంచనీయ లేక పోయింది. సాయంత్రం అయిదు గంటల వరకూ యిద్దరూ చెరో మేడలోనూ క్షణం ఒక యుగంలా ఖైదు శిక్షని అనుభవించక తప్పదు. యిలా ఆలోచిస్తూండగానే యిల్లు వచ్చేంది. సాంబశివం మెట్లెక్కే ముందు చేయి వూపి ఐదువ్రేళ్లనీ చూపించేడు సాయంత్రం ఆట సాంకేతికస్థలానికి సైగ చేసి రమ్మని చెబుతూ. జయ మెట్లు పూర్తిగా యెక్కక ముందే పని మనిషి శాంతారాం భుజం వొంచి గుర్రం యెక్కించుకుందుకి సిద్ధంగా నిలబడ్డాడు. జయ చూపులు యెదురు మేడ మీద వున్నాయి. శాంతారావ్ అదిలించేసరికి వులిక్కిపడింది. పైనున్న రెండో అంతస్థులోంచి జయ తల్లి రమ, సాంబశివం తల్లి జానకి చూస్తూనే వున్నారు పిల్లల్ని.

ఎండాకాలం అంత కంతకు మీద పడుతోందంటే యిద్దరికీ గుండెలు రెపరెపలాడుతూనే వున్నాయి. సెలవు లివ్వగానే తమ కాళ్లకి సంకెళ్లువేసి నాలుగు గోడల్లో బంధిస్తారని తెలుసును. సాంబశివం ముందుగా చిన్న ప్లాను వేశాడు. రాత్రంతా ఆలోచించిన పథకాన్ని జయ ముందు పెట్టకపోతే అతనికి తోచదు. మర్నాడు తూర్పు రేఖలు తెల్లబడగానే వరండాలోంచి మెట్లెక్కి పైనున్న బాల్కనీలోకి చేరుకుని జయ గదికి తిన్నగా వున్న కిటికీలోంచి రెండు చిన్న సైజు గులకరాళ్లు వుండేల్ దెబ్బతో గురిచూసి వేశాడు. అలికిడి విని చటుక్కున లేచి కూర్చుంది. మామూలుగా ఆ వయసులో పిల్లలు బారెడు పొద్దెక్కినా సూర్యకిరణాలు చురకలు వేస్తున్నా లెక్క చేయకుండా మంచం మీద పొర్లుతూనే వుంటారు. కానీ జయ పూర్తిగా ఆ కోవకి విరుద్ధం. ఒకే హాస్పిటల్లో కొన్నేళ్ల వారగా పుట్టిన బాల్య నేస్తాలిద్దరూ యించుమించు ప్రాణాలు సైతం అర్పించుకుంటారు. అయితే ప్రాణం అంటే యేమిటో, అర్పణ అంటే యేమిటో ఇద్దరికీ అర్థం కాదు. ఇద్దరిలో యే ఒక్కరికి యింట్లో దేహశుద్ధి జరిగినా మిగిలినవాళ్లు ఆరోజు కింక అభోజనం మిగిలిపోతారు.

డైనింగ్ టేబిల్ మీద కూర్చుని ప్రొద్దుటే టీ వైపు చూస్తూ మెట్ల వైపు వినిపించబోయే శబ్దానికోసం చెవులు రిక్కించుకు కూర్చున్నాడు సాంబశివం. తల్లి తండ్రి 'టీ' తాగుతూ ఒకటికి రెండుసార్లు హెచ్చరించేరు. గిరిధర్ కొడుకు వాలకం వెంటనే గ్రహించి కంటితో సైగ చేశాడు భార్యకి. జానకి సాసర్ పెదాల దగ్గర వుంచుకొని నవ్వు మొహాన్ని దాచుకుంది.

'నేను వచ్చేశాను సాంబూ,' అన్నది జయ గదిలోకి అడుగు పెడుతూ.

గిరిధర్ ఆ పిల్లవైపు చూసి 'పొద్దుటే యిలా సిద్ధం అయావేం తల్లీ. రోజూ టీ దండగ. మీ నాన్న లేచాడా?' అంటూ ప్రశ్నవేసి చేతులు చాపి తొడమీద కూర్చో బెట్టుకున్నాడు.

జానకి ముద్దుగా మొట్టికాయ తగిలించి 'యివాళ యేం తల్లీ యిలా బయలుదేరావు,' అంది.

జయని పెదవి కదపనివ్వలేదు సాంబశివం. 'రేపు తెలుగు పరీక్ష జయా. మాష్టారు యివాళ రానని చెప్పేరు. మనల్నే వాళ్లింటికి యెనిమిది గంటలకి రమ్మన్నారు,' అన్నాడు.

జయ అతని వైపే విభ్రాంతురాలై చూస్తూండి పోయింది. ఆ క్రితం రోజు మేష్టారింటికి వెళ్లడం పాఠాలు చెప్పించుకోవడం వరకే గుర్తుంది. కానీ తమని ఆయన పిలిచినట్లు యెంత ప్రయత్నించినా ఆ చిన్నారి బుర్రకి అంతు చిక్కలేదు.

యెనిమిది గంటలు గోడ గడియారం టంగ్ మంటూ కొట్టింది. సాంబశివం స్నానం కూడా మానుకుని పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుని తలితండ్రులతో చెప్పి జయని వెంటబెట్టుకుని యెదురింటి వైపు బయలుదేరాడు. రమ కూతురి పక్కగా వస్తున్న సాంబశివం చేతుల్లో పుస్తకాల సంచీ చూసి నోటివరకూ జయ కోసం దాచి వుంచిన శాపనార్థాలు దిగమింగేసి నవ్వు మొహంతో సాంబశివాన్ని పలకరించింది. 'యేమిటోయ్ యింత ప్రొద్దుటే బయలుదేరావు? పుస్తకాలన్నీ మేష్టారింట్లో పారాయణ చేస్తారా యేం'

సాంబశివం తొట్రుపడలేదు! 'కాదత్తా. మేష్టారు పరీక్షలని యింటి దగ్గరే చెబుతాం అన్నారు. అందుకే...'

పరిలిప్తం

'ఆదివారం కూడా చెబుతామని చెప్పారా మీతో?' రమకి కొంచెం సందేహం కలిగింది.

జయని పిలుచుకుని పోటు పొడిచేడు సాంబశివం మోచేత్తో. జయ కలిపించుకుంది: 'అవునమ్మా ఆయన, యీ ఆదివారం రమ్మన్నారు. యింపార్టెంట్‌వి చెబుతారట' అన్నది.

రాజశేఖరం నోట్లో బ్రష్ వుంచుకుని భార్య వేసే ప్రశ్నలకి పసివాళ్ళిచ్చే సమాధానాల్ని వినోదంగా వింటున్నాడు. అతను జయ మీద పంచప్రాణాలూ పెంచుకున్నాడు. జయ పుట్టేక అతనికి ప్రాక్టీసు బాగుపడింది కింగ్స్‌వే రోడ్డుమీద స్వంత ప్రాక్టీసు పెట్టుకున్న డాక్టర్లందరికన్నా యితనికే పేరు ప్రతిష్ఠలూ రాబడీ యెక్కువ. రెండుమూడేళ్లు కాక మునుపే ఆకుపచ్చని విమానంలా రెక్కలు చాచుకున్న అందమైన కారు కొన్నాడు. మరో రెండేళ్లకి కింగ్స్‌వేలో పెద్దమేడ సికింద్రాబాద్ స్టేషన్ పక్కగా మరో మేడా కొని స్టేషన్ దగ్గర మేడ హోటల్‌కోసం కిరాయికిచ్చేడు. అతనిప్పుడు రెండుచేతులా పుష్కలంగా ఆర్జిస్తున్నాడు. చిన్నప్పుడు అతను పడిన కష్టాలకీ జయ పుట్టేక తను సంపాదిస్తున్న ఆస్తిపాస్తులకీ బేరీజు వేసుకుని అది జయ పుట్టడంవల్ల జరిగిందే అనే తీర్మానానికి వచ్చేడు. అబ్బురాల ముద్దుబిడ్డ అంత ప్రొద్దుటే చదువుకి బయలుదేరగానే గబగబ నోట్లో నీళ్లు పోసుకుని రెండుచేతులూ చాపి చెంపలమీద ముద్దులవర్షం కురిపిస్తూ 'నా బంగారు తల్లి' అన్నాడు క్రిందికి దింపేస్తూ. సాంబశివం హడావుడి చేస్తూంటే గేటు తలుపు తెరుచుకుని బయటపడింది.

'మీరిలా దాన్నినెత్తిన పెట్టుకోవడం నాకేమీ బాగులేదు రాజా. ఆడపిల్లనిలా పెంచుతే చివరికి యెన్ని అనర్థాలు వస్తాయో ఆలోచించడంలేదు మీరు. యెంత మనం బొడ్డున మాణిక్యం పెట్టుకుని తిరుగుతున్నా ఆడపిల్ల అయేక వనిపాటలు నేర్పడం విధిగా గుర్తుపెట్టుకోవాలి. దాన్ని వరుసన పెంచుతే అది... అది రేపెలా తయారవుతుందోనని నాకిప్పుడే బెంగగా వుంది' అన్నది రమ భర్త చేతికి తువ్వాలు అందిస్తూ.

అతను గలగలా నవ్వి రమ బుగ్గమీద చిటికె వేశాడు. 'పిచ్చిదానివి రమా నువ్వు. ఆడపిల్ల అంటే మన పూర్వీకులు పెంచే తీరునే పెంచాలనే రూల్ లేదు కద. కాలం మారింది. నువ్వు చదువుకున్నంత మీ అమ్మ చదువుకోలేదు. మీ నానమ్మ కాలంలో గడప దిగడం యెరగవు. అయినా చూడు మీవాళ్లు నీ హయాం రాగానే చదువువల్ల ఆడపిల్లకి యెంతవరకూ న్యాయం చేకూర్చగలమో తెలుసుకున్నారు. ప్రొద్దుటే యిలా పోట్లాడుతున్నావేం' అన్నాడు డైనింగ్ టేబిల్ దగ్గరికి దారి తీస్తూ. అప్పటికే శాంతారావ్ 'టీ' సిద్ధంచేసి డాక్టర్‌గారికోసం యాపిల్ ముక్కలు సాసర్‌లో వుంచేడు.

రమ దిగులుగా అతనికి యెదురుగా వున్న కుర్చీలో కూలబడిపోయింది.

రాజశేఖరం తలవొంచుకుని టీ తాగుతూ బిస్కట్ ముక్కలన్నీ తినేశాడు. అతని మనసు చాలా తేలికగా వుంది. ప్రొద్దుటే జయ అంత శ్రద్ధగా చదువుకి వెళ్లడం అతని పితృహృదయంలో అంతులేని గర్వాన్ని నింపిపెట్టింది. వున్నట్టుండి తలయెత్తేసరికి రమ చెంపకు చెయి చేర్చి కిటికీగుండా శూన్యాకాశంలోకి చూస్తూ కనిపించింది. రమకోసం ప్రత్యేకం తయారు చేసిన కాఫీ చల్లారిపోయింది. అతను ఘొల్లున నవ్వేడు రమ వులిక్కిపడేట్లు. 'నీకేం పిచ్చా రమా! పదేళ్లు నిండా లేవు దానికి. దాని గురించి యిప్పటినుంచీ యిదేం బెంగ నీకు?' అన్నాడు అదే విషయాన్ని కదుపుతూ.

'లేదు రాజా! యిదంత చిన్న విషయంగా తీసుకోతగింది కాదు. మొక్కై వంగనిది మానై వంగదని మనవాళ్లు వూరికే అనలేదు. రోజంతా సాంబుడితో సమానంగా అది గోటీబిళ్లలు ఆడడం, వుండేల్‌తో పక్షుల్ని వేటాడడం, పతంగులు యెగరేయడం చూస్తూంటే నాకు భయం వేస్తోంది. రేప్రొద్దుట అది చీరలు మానేసి పాంట్లు తొడుక్కుని సైకిలుమీద వెడతానన్నా నోరు మూతవేసుకోవాల్సిన పరిస్థితులు వస్తాయనే బెంగ నన్ను పీడిస్తోంది. ఒక్కగా నొక్క కూతురని మీరు నెత్తిన యెక్కించుకుం

టున్నారు. ఇది యెక్కు మెక్కైతే ఆ పైన అనుకుని లాభం లేదు'

రాజశేఖరం లేచి నిలుచుని భార్య తల మీద ఆప్యాయంగా చేయి వేశాడు. 'నువ్వేమీ బెంగ పెట్టుకోకు రమా! కాను న్నది కాకుండా పోదు. పంజరంలో చిలుకలా బంధించినా యెగిరిపోయే పక్షులు కొన్నిలు. మన పిల్లకి స్వాతంత్ర్యాన్ని యిచ్చాం. మన అమ్మా నాన్నా మంచి వాళ్ళు అనుకోకపోయినా, నన్ను బాగా పెంచేరు అనే ఆలోచన ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడు కలిగినా సంతోషిద్దాం. నీకు తెలీదా రమా ఈ దౌర్భాగ్యుడు ఎలా పెరిగాడో!'

రమ అప్రతిభురాలై పోయింది క్షణం. కళ్ళముందు గతం కదులుతూంటే చెంపలమీద ముత్యాల్లాంటి రెండు కన్నీటి బిందువులు రాలిపడ్డాయ్.

* * *

'ఏమోయ్ యిస్తున్నాను కదా అని వస్తున్నావా'— రాఘవేంద్రరావుగారి కంఠం పోలు మార్మోగుతూ ఖంగుమంది. వీధి గుమ్మానికి లోపల వో కాలూ, బయట మరో కాలు వేసి వస్తున్న రాజశేఖరం అడుగులు గతుక్కుమన్నట్లు ఆగిపోయేయి.

'మాట్లాడవేమోయ్— చూడు రాజశేఖరం! చెరుకు తియ్యగా వుందని వేళ్ళల్లోంచి తినేయడం భావ్యం కాదు. కూర్చుని తింటూంటే కొండ లెంతదాకా ఆగుతయ్. ఈసారి తీసుకు వెళ్ళు— మళ్లీ యిప్పట్లో వస్తే...అదంత బాగుండదు!' అన్నారాయన పచార్లు చేయడం ఆపుజేసి.

రాజశేఖరం తలెత్తి ఆయనవైపు చూశాడు. అతనికళ్ళు అమాయకత్వాన్ని పుణికి పుచ్చుకున్నాయి. ఆయన కళ్ళు అప్పుడే ఆ కళ్ళలో ఢీకొన్నాయి. ఆయన గబగబా మెట్లెక్కేసి మేడవైపు వెళ్లేరు. ద్వారం పక్కనే నిలుచుని సంభాషణ పూర్తిగావిన్న రమ చేతిలో పుస్తకాన్ని చదువుతున్నదల్లా మూసేసి ఆ పుస్తకం రాజశేఖరం చేతిలో వుంచింది. అతను తలెత్తకుండానే అందుకున్నాడు. మేడ మెట్లమీద వెండిపొన్నుకర్ర టకటక మని పిస్తూ వచ్చేరాయన హాల్లోకి: 'చూడు —శేఖరం దేనికైనా మితం వుండాలనే తత్వం నాది. నీ చదువు సంగతి గ్రహించే కన్నకొడుకుని చదివిస్తున్నట్లు భారాన్ని భుజాలమీద వేసుకున్నాను. ఈసారి పరీక్షలెలా రాశేవు'

అప్పటికి గొంతు విప్పేడు అతను: 'బాగానే రాశానండి' అంటూ.

'వూఁ నౌ యు కెన్ గో' అన్నారు చేతిలో రొఖ్ఖాన్ని రాజశేఖరం చేతిలో వుంచుతూ. రాజశేఖరం అడుగులు ముందుకురావాలనే ప్రయత్నం చేశాయి. అయినా కాళ్ళకి గొళ్ళేలు తగిలించినట్లు, ముందుకు సాగకుండానే వెనక్కు తుళ్ళేయి.

'సుభద్రమ్మా' ఆయనగొంతు దద్దరిల్లింది మరొక్కసారి.

వంటయింట్లో రేగిన జుట్టు మొహం మీద పడుతూంటే వంటయింటి మసినీ, ధూళినీ తన వరం చేసుకున్న కట్టుబట్టతో ముందు పన్నెంటి వూడిపోగా తల పండిన అనుభవాలతో పండు ముత్తైదువ హాల్లోకి వచ్చింది చేతులు కొంగులో తుడుచుకుంటూ.

'మీ వాడొచ్చేడు మళ్లీ' ఆయన అన్నారు.

'అలాగా బాబూ యిదంతా మీ దయ మీ చలవ. మీరే మమ్మల్ని ఆదరంగా చూడకపోతే మాకు...' ఆపైన నోరు పెగల్లేదు ఆ యిల్లాలికి.

'చూశావా అతగాడిని'

'చూళ్లేదు బాబూ. వాడిరాక నాకు తెలేనే లేదు'

'దట్స్ గుడ్' ఆయన ఆపైన మాటలు పెంచనీయలేదు. సాయంత్రం నీరెండ తగ్గే వేళకి షికారుకి బయలుదేరారు బీచ్‌వైపు.

రమ హాల్లోంచి తిన్నగా వంటయింట్లోకి వెళ్లింది సుభద్రమ్మ. వెనకే ఫిల్టర్‌లో డికాషన్ వొంపేసి పాలుచేర్చి పొగలూ, సెగలూ వస్తుండగా గ్లాసులోపోసి అలికిడి విని రమ చేతికి అందించింది. కాఫీ అందుకుని రమ అన్నది: 'నేను కాఫీకి రాలేదు సుభద్రమ్మగారూ. మిమ్మల్ని యెన్నాళ్ళనించో అడగాలను కుంటున్నాను. సమయం కలిసి రాలేదు. నిజం చెప్పండి రాజాని మీరు చూశేరుకదూ.'

సుభద్రమ్మ ఖంగారుని అణుచుకుంది. ఆవిడకళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేయి. బలవంతంగా పెదాలలో దుఃఖాన్ని లోలోపలికి నెట్టివేస్తూండి పోయింది కొంచెం సేపు.

'చెప్పండి మీరు రాజాని మేడపక్కగా వున్న కిటికీలోంచి చూశేరు. నాన్నగారితో యెందుకో అలా చెప్పేరు. కారణం యేదో బలమైనదే 'అని గ్రహించేను. అయితే రాజాకి...

సుభద్రమ్మ రెండుచేతులతో రమని చుట్టేసి బావురుమన్నది: 'వాడు తండ్రిని పోలి పుట్టేడు. చురుకైన వాడనీ, అందగాడనీ ఆయన తెగ మురిసిపోయే వారు. వ్యసనాలకి బానిస అయిపోయి ఆస్తంతా సర్వనాశనంచేసి అర్ధరాత్రి వెళ్లిపోయేరు.'



ఆవిడ కళ్లు చెరువులయ్యేయి. రమ నిశ్చలంగా వింటున్నది.

'రాజా యీ యింటికి వచ్చేనాటికి పన్నెండేళ్లవాడు. బాబుగారు వాడిని చదువులో ప్రవేశపెట్టేరు. అప్పుడే అన్నారు. అభివృద్ధిలోకి వచ్చే పిల్లడిని మాత్రు ప్రేమతో బంధించి వారధి కట్టించవద్దని. నేను నొప్పుకుని మీ అమ్మ వున్నప్పటి మంచి వంటకి కుదురుకున్నాను. రాజా వస్తున్నాడు వెడుతున్నాడు. ఈ దౌర్భాగ్యురాలు డాక్టరీ చదివే వాడికి తల్లి అని చెప్పుకుంటే యెంత అవమానంగా అనిపిస్తుందో ఆలోచించేక మనసుని చంపుకున్నాను.'

రమ కళ్లు తడిశేయి: 'మీరందుకు నొప్పుకోక పోవల్సింది. కన్న కొడుకుని చూడలేనప్పుడు ఆ చదువులెందుకు చెప్పండి. మీరు తెగించి ఈ విషయం నాన్నగారితో యెందుకు అనకూడదూ. రాజా చూపులన్నీ యీ వంటయింట్లోనే వుంటాయి. అతని పాదాలు కదిలి రెండడుగులు వేస్తేయో లేదో నాన్నగారు దుంపతెగ్గాలు పెడుతూంటారు. పాపం అతను బుర్ర వొంచుకుని కదిలి వెళ్లిపోతాడు. ఈసారి రాజా వస్తే మొండికెత్తి మీరు హాల్లోకి రండి సుభద్రమ్మగారూ! మీకు నేను తోడుగా నిలుచుని వుంటాను'

రమ ఓదార్పు వచనాలు సుభద్రమ్మ తలతో యిరుక్కుపోయి సాగరమథనం చేశాయి. ఆవిడ వెక్కిళ్లమధ్య అన్నది: 'యేరుదాటాక తెప్ప తగలేయడం భావ్యం కాదు రమా. చదువుకున్నదానివి కనుక, ఆడపిల్లవి కనుక నా బాధని అర్థంచేసుకున్నావు. అంతే చాలు. బాబుగారి దయే లేకపోతే మా మనుగతి యేమైపోయేదో? తలచుకుంటే గుండెలు తరుక్కుపోతాయి' ఆవిడ కళ్లల్లో కృతజ్ఞత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

రాఘవేంద్రరావుగారు బుద్ధిమంతుడైన వరుణ్ణి వెతికి తీసుకువచ్చి సుభద్రమ్మ తొలిచూలు బిడ్డ మనోరమకి యిచ్చి పెళ్లి చేయడం లీలగా గుర్తుకు వచ్చింది రమకి. ఆ పైన మరి మాట్లాడలేకపోయింది. ఆ తల్లి వేదన అర్థం చేసుకోగల్గే శక్తి కన్న యెక్కువ అనుభవాన్నే పుస్తకాల ద్వారా జీర్ణించుకున్నది రమ. సంగతి విని

పరిలిప్తం

జానకీ, గిరిధర్ నవ్వేరు: 'నీ బాధ అర్థం అయింది రమా. నువ్వతన్ని పెళ్లాడాలనుకుంటున్నావు. అతనేమన్నాడో తెలుసుకున్నావా', అన్నారు యేక కంఠంతో.

రమ జారి పడబోయే కన్నీళ్లను రెప్పల మాటున దాచుకున్నది: 'కనుక్కున్నాను రావుగారూ. మీరిద్దరూ అదృష్టవంతులు. మేనత్త మేనమామల పిల్లలే కనుక యింకేభయం అక్కర్లేదు. కానీ యిప్పుడు యీ విషయంలో నాన్న సుతరామూ యిష్టపడరు. యేం చేయను?'

గిరిధర్ లాన్‌మీద మోకాళ్ల మీద చేతులుంచుకుని తాపీగా చతికిల పడ్డాడు. 'చూడు రమా నీకు ధైర్యం వుంటే యింట్లో కానివనేమీ చేయడం లేదు. కనుక అతనితో చెప్పి పెళ్లికి యేర్పాట్లు చేయి.'

'నేనా'

'అవును నువ్వే'

'యెలాగ?'

'భలేదానివే. అతనికీ యిష్టం అవుతే యిన్ని ప్రశ్నలు అనవసరం. బుద్ధిమంతురాలివై బుర్ర వంచుకుని మెళ్లో మంగళసూత్రం కట్టించుకో'

'నాన్న యేమంటారో అనే భయం లేదు జానకీ. అతన్ని కోపంతో రివాల్వర్‌తో...'

గిరిధర్ నవ్వి 'నువ్వు అనవసరం అయిన విషయాన్ని ఆలోచిస్తున్నావు రమా. పెళ్లి చేసుకునేవరకే గానీ ఆ తరువాత యెవరూ యేమీ చేయలేరు,' అన్నాడు ప్రోత్సాహం యిస్తూ.

రాజశేఖరం చేతకానివాడు కాదు. అతనికి విశ్వాస ఘాతకుడినౌతున్నానేమోననీ బాధ వో పక్క మెదిలినా, రమ అద్దం లాంటి హృదయాన్నీ, అందులో తనకున్న స్థానాన్ని గ్రహించి సర్వం అర్పించేందుకు సిద్ధం అయేడు. గిరిధర్ జానకిని పెళ్లి చేసుకున్న వారంరోజులకి వేరే కాపురం పెట్టేందుకు హైదరాబాదు ప్రయాణం కట్టేరు. అప్పుడే ప్రయత్నాలన్నీ ఫలించగా పదిమంది పెద్దల సమక్షంలో నిరాడంబరంగా రమ మనసిచ్చిన రాజాని పెళ్లిచేసుకుంది. గుళ్లో పూజారి దీవెనలూ, పైనున్న దేవతల ఆశీర్వాదాలు మాత్రమే మిగిలేయి.

రాఘవేంద్రరావుగారి కళ్లల్లో నిప్పులు కురుస్తున్నాయి. వాటి తాలూకు రవ్వలు విజృంభించి సుభద్రమ్మమీద పడగా ఆవిడ హతాశురాలై వీధి ద్వారంవైపు గుడ్లప్పగించి చూస్తుండిపోయింది. పచ్చబట్టలతో గుమ్మంలో అడుగుపెట్టిన కూతురివైపు దృష్టిసారించి క్షణంచూసి, సుభద్రమ్మ వైపు తిరిగి కుడిచేతి చూపుడు వేలు బయటివైపు చూపిస్తూ: 'నడు తల్లీ నువ్వుకూడా ఆ దౌర్భాగ్యులతో దయచేయి. పూటకూళ్లదానివై డుకుని చేసుకుని నా వంశాన్నీ కీర్తి ప్రతిష్ఠల్నీ నాశనం చేసింది మహా యిల్లాలు. నన్ను రెచ్చగొట్టద్దు. మీరంతా యేకం అయి కట్టకట్టుకుని యే గంగలోనైనా దూకండి. తక్షణం యింట్లోంచి బయటికి వెళ్లండి!' అన్నారు. ఆయన కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. వార్ధక్యంతో సామాన్యంగా కొందరికి సంప్రాప్తమయ్యే బ్లడ్ ప్రెషర్ ఆయనకీ వుంది. ఆయన నిలుచున్న స్థలాన్నే స్తంభానికి చేరగిలబడి రొప్పుతూ కూర్చుండిపోయేడు. తండ్రి శాసనం అంటే యేమిటో తెలిసిన రమ అత్తగారితో హైదరాబాదు కట్టుబట్టలతో ప్రయాణం అయింది. ఆనాటి రాజశేఖరం జంటనగరాల్లో కేవలం సర్టిఫికేట్ తప్ప మరో ఆధారం లేకుండా పడిన ఆగచాట్లు ప్రత్యక్షంగా చూసిన తవి జన్మకి మరచిపోగలదా!

* *

'ఇంకా యిక్కడే కూర్చుండిపోయేవా. లేచి టిఫిన్ తయారుచేసి సిద్ధంగావుండు మనం అలా బయటికి వెళ్లివద్దాం' అన్నాడు రాజశేఖరం భార్యని కుదిపి లేపుతూ.

రమ గత స్మృతులు కరిగిపోయేయి. రెండుగంటలపైగా తను గతంలో లీనం అయిపోయి కుర్చీకి అతుక్కుపోయిందనే సంగతి తెలిసి రాగానే క్షణం సిగ్గుపడ్డది. అత్తగారు కాశీలో విశ్వేశ్వరుడి సన్నిధిలో వుంటోంది. ఆవిడకి ఈ భవబంధాలపట్ల ఆసక్తి లేనందున కోడల్ని ప్రార్థించి మరీ వెళ్లింది. పదిగంటలు దాటాక జయా సాంబశివం ముదురుతున్న మండుటెండలో గృహోన్ముఖులయేరు. (ఇంకా ఉంది)

—ధర్మపథం—



లక్ష్మి ఉండే స్థానం

బులుసు వేంకటరమణయ్య

లక్ష్మి చంచలమైనది. ఆమె స్వభావం వల్ల లక్షాధికారి భిక్షాధికారి కావచ్చును; భిక్షాధికారి లక్షాధికారి కావచ్చు. ఆమె అస్థిరురాలు కావడంవల్ల ఆమెనుచూస్తే అందరూ భయపడతారు. 'అమ్మా! నువ్వు మా దగ్గరకు రాకు; నీవు దూరంగా వుంటేనే మాకు క్షేమం' అని ఎవ్వరూ లక్ష్మీదేవిని దగ్గరకు చేరనివ్వలేదు.

తర్వాత లక్ష్మీదేవి గోవులదగ్గరకు వెళ్ళింది, అవి ఆమెను వాటిదగ్గర ఉండనిస్తాయేమో అని. అవి తప్పకుండా తన్ను ఆదరిస్తాయనే ధైర్యం ఆమెకు ఉన్నది. ఏమంటే— ధేనువులు చాలా పవిత్రమైనవి! ప్రాణు లన్నింటిలోనూ మిక్కిలి సాధువులైనవి. అలాటి వాటితో కలిసివుండడం ఆమెకు ఎంతో ఆనందం!

లక్ష్మీదేవి గోవులవద్దకు పోయి 'ఓ గోవులారా! నేను మీతో కలిసి మెలిసి వుండాలని వచ్చాను. దయయుంచి నన్ను మీలో చేర్చుకోండి' అని ప్రార్థించినది. గోవులు అన్నాయిగదా — 'అమ్మా' నీవు చంచలమైన దానవు. ఒకచోట స్థిరంగా నిలిచి వుండలేవు. నీవంటిదానిని మాలో చేర్చుకోవడం భావ్యంకాదు. నీవు మరొక చోటికి పోవడం మేలు' అని.


లక్ష్మి యిలా అన్నది — 'మీరు చాలా ఉత్తములు! మీ ఆశ్రయం దొరుకుతుందనే ఆశతో వచ్చాను. ఎక్కడికి వెళ్ళినా, నన్నెవ్వరూ దగ్గర చేరనియ్యరు. మీరే సమ్మతించకపోతే ఇక నన్ను ఎవ్వరు ఆదరిస్తారు? కోరివచ్చిన లక్ష్మీదేవిని చంచలవని తూలనాడి ఆశ్రయం ఇవ్వక పోవడం మీకు తగునా? ఇది నన్ను అవమానించడం కాదా?' అని.

'అమ్మా! లక్ష్మి చంచలస్వభావం కలదని మాకేకాదు, అన్ని లోకాలకూ తెలుసును. నీవు చంచలవని అనడం ఎంత మాత్రమూ నిన్ను నిరసించడం కాదు; మా దగ్గర వుండవద్దని చెప్పడం అవమానించడమూ కాదు. దయచేసి మరొక చోటికి వెళ్ళిపో' అని అవి అన్నాయి.

ఇలా చెప్పినా, లక్ష్మి వాటిని విడిచిపెట్టలేదు. ఎంతగానో బతిమాలుకుంది. గోవులకూ జాలికలిగింది. అవి— "ఇంతగా ప్రాధేయపడుతున్నావు గనుక— ఒకటి చెప్తాము. దానికి సమ్మతమయితే ఆవిధంగా చెయ్యి. నీవు మమ్మల్ని ఆశ్రయించవద్దు. మా మలాన్ని ఆశ్రయించి వుండు' అని అన్నవి.

ఏదో విధంగా గోవులతోడి సంబంధం వుంటే చాలుననుకొని లక్ష్మీదేవి గోమయాన్ని ఆశ్రయించి వుండడానికి సమ్మతించింది. గోమయాన్ని ఆశ్రయించి వున్నది.

ఇందువల్లనే గోమయం పవిత్రమైనదని అంటారు. మన గృహాలను— అప్పటి మట్టియిళ్ళను గోమయంతో బాగా అలికి శుభ్రంచేసి, ముగ్గులు పెడితే అవి కలకలలాడుతూ శోభాయమానంగా వుండేవి. ఆవుపేడ నీళ్ళలోకలిపి యింటిముందు కళాపి చల్లితే దుమ్ము రేగకుండా సిమెంటు గచ్చుచేసినట్లు వుంటుంది. గోమయం లక్ష్మికి నిలయం కావడంవల్లనే ఎన్నో విధాల ఉపయోగకరంగా వుంటున్నది. ఆర్థికదృష్టితో చూచినా అది ఎంతో ప్రయోజనకారియే!



సీరియల్



బ్రతుకు బాట

పి. సత్యవతి

జరిగిన కథ

మాధవరావు, విమల, రఘుపతి, సుమిత్ర అన్న పూర్ణమ్మగారి సంతానం. తండ్రి చనిపోవడంతో కుటుంబభారమంతా మాధవరావుమీద పడు తుంది. మాధవరావు భార్య ఇందుమతి. కొడుకు విశ్వనాథం. సంసారాన్ని ఈదుకుంటూనే తమ్ముడు రఘుపతి, చెల్లెలు సుమిత్ర పెళ్ళిళ్ళు చెయ్యా అని సంబంధాలు చూస్తాడు. మాధవరావు అంగీ కారంతో సుమిత్ర కాలేజీలో చేరుతుంది. అక్కడే ఆమెకు కుముదినితో పరిచయమవుతుంది. కుముదిని సహాయంతో ఉద్యోగం సంపాదించు కుంటుంది. ఆమె బసవరాజాసలహామీద బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకుంటుంది. సావిత్రి పెళ్లి కాకుండానే గర్భవతి అయిన విషయం విని దిగ్భ్రాంతి చెందుతుంది. ఆమె భారాన్ని మోయక తప్పకలేదు సుమిత్రకి.

10

'చాలా చిన్నపిల్ల — పాపం — ఈ వయస్సులో ఈబాధ! హాయిగా చదు వుతూ ఆడుతూ పాడుతూ తిరిగే ఈడు—' ప్రిస్క్రిప్షన్ వ్రాస్తూ జాలిగా అన్నది డాక్టర్.

'కాన్పు చాలాకష్టం అవుతుందంటారా డాక్టర్!' ఆత్రుతగా అడిగింది ఇందు మతి.

సుమిత్ర పెత్రగాం అందుకుని ఆమె తంతకుముందే వచ్చింది.

'అవునమ్మా—నాచురల్‌గా కాకపోవచ్చు. అల్లా జరిగితే ఆపరేషన్‌చేసి తీస్తాం—అమ్మాయి చాలా నీరసంగా వుంది. ఎన్ని మందులు వాడినా ఆమె కోలుకోనేలేదు—ఈ బాధకు తట్టుకోలేక పోతోంది. ఏం చేస్తాం ఉయ్‌కాన్ట్ హెల్ప్' విరక్తిగా నవ్వింది ఆవిడ.

'మీరిచ్చిన మందులన్నీ పెట్టెల్లోనూ అలమరల్లోనూ పడేసిందేకానీ వేసుకోనే లేదు—బ్రతుకుమీదరోతతో విధిలేక బ్రతి కిందది—చావుకి సిద్ధపడి హాస్పిటల్‌కి వచ్చింది—' కళ్ళుతుడుచుకుంటూ అన్నది సుమిత్ర. అవతలగదిలో సావిత్రి గట్టిగా అరుస్తున్నది. అంతులేని వేదనతో మూలుగుతున్నది. సుమిత్రకి చెమటలు పోసుకొచ్చాయి.

'ఎల్లా అయినా సావిత్రిని బ్రతికిం చండి డాక్టర్—' అన్నది చివరికి—

ఆ రోజంతా అరచి అరచి డాక్టర్ల కత్తెరలూ, ఆయుధాల సాయంతో ప్రస వించింది సావిత్రి. తెలివితప్పి పడివున్న సావిత్రికోసం ఆందోళన పడేవారే కానీ, పాప ఎలా వున్నది? అని ఎవరూ చూడ లేదు. ఆపిల్ల భూమిమీదపడ్డ సూచనగా ఏడవనైనా లేదు—మూడోనాటి ఉదయమే తనను విపరీతంగా అసహ్యించుకుంటూన్న సంఘాన్ని వదిలి వెళ్లిపోయింది. పచ్చని రంగు, ఎవరిదో ముక్కుమొహం ఎరగని పోలికతో నొక్కులజుత్తుతోవున్న ఆ పాపని చూస్తే జాలేసింది ఇందుమతికి. ఆపిల్ల తన మనమరాలు. ఇదే సక్రమ సంతానం [illegible] పుట్టిందో పెద్ద వాళ్ళ పాపాలూ పుణ్యాలూ ఏమీ ఎరగని ఆ పసికందుని తను ద్వేషిస్తున్నది! ఆ బిడ్డను గుడ్డల్లో చుట్టి తీసుకెడుతూ వుంటే హృదయం చీలి రక్తం స్రవించి నట్లు కన్నీళ్ళు ధారాపాతంగా కారాయి.

'ఇదేనా మానవత్వం!' అని ఘోషిం చింది హృదయం.

'ఏదీ నా పాప! చూడనివ్వండి ఎవరి పోలికో! ఆకళ్ళు నావేనా? ఆ సునుపైన బుగ్గలో సొట్టలున్నాయా?' అని అడగ లేదు కన్నతల్లి. అడిగే స్పృహ వచ్చేవేళకి భయంకరమైన విజం సల్లవేషంతో ప్రత్యక్షమై జడిపించింది. జడుసుకుని కేకవేయబోతూ వుండగా 'నీకేం భయం లేదు—నేను వెళ్లిపోతున్నాను. ఇక నీకు స్వేచ్ఛ—హాయిగా బ్రతుకు' అని వెక్కిరిం చేసి వెళ్ళిపోయింది పాప!

'అందరూ పిల్లలు పుట్టినందుకు సంతోషిస్తారు. మనకు పోయినందుకు సంతోషించాల్సిన గతి పట్టింది—' అను కుని లోలోపలే ఏడ్చింది సావిత్రి. పదిహేను రోజుల తరువాత హాస్పిటల్‌నుంచి డిస్చార్జి అయి వచ్చింది.

'వెడదాం—రా సావిత్రీ' అని పిలిచింది ఇందుమతి—

'వద్దమ్మా—నేనింక అక్కడికిరాలేను—కష్టమో, సుఖమో ఇక్కడే వుండిపోతాను—వాళ్ళు కుదుటపడ్డాక ఎక్కడైనా ఉద్యో గం చూసుకుంటాను—'

నువ్వప్పుడే ఉద్యోగం చెయ్యాలేవ సావిత్రీ! వచ్చేఏడు మళ్ళీ కాలేజీలో చేరి చదువుకుందువుగాని! నామాటవిని వచ్చెయ్! ఇంతకాలం అత్తకి బరువుగావున్నది చాలక ఇంకా ఎందుకు?' సావిత్రిని కౌగలించుకుని కన్నీరు పెట్టుకుంది ఇందుమతి.

'అత్తకి మనమంతా అంటే ఎంతో ప్రేమ—నేను బరువని ఆమె ఎప్పుడూ అనుకోదు—త్వరలో వాళ్ళు బాగుపడితే ఏదైనా ధ్యాసలో పడిపోతాను—నాకావూరు రావాలని లేదమ్మా—నన్ను బ్రతిమిలాడకు ప్లీజ్—నువ్వెళ్ళు—' అని గట్టిగా చెప్పే సింది సావిత్రి.

'తెలియక ఒకసారి తప్పుచేస్తాం—తప్పని తెలిశాక ఇక చెయ్యం—ఆపిల్ల దేవుడిలాంటిది—నాకు మళ్ళీ సంఘంలో

బ్రతికే అవకాశం కలుగజేసింది—ఇకనాకు చదువూ వొద్దు—పెళ్ళీవద్దు—ఇక్కడే ఉద్యోగం చూసుకుని వుండిపోతాను—నువ్వు కాదనకు చిన్నత్తా—నిన్ను విడిచిపెట్టి నాకు వెళ్ళాలని లేదు—' అని సుమిత్రని చుట్టుకుని తనివితీరా ఏడ్చింది సావిత్రి.

'నువ్వు మళ్ళీ ఇల్లాంటి తప్పులు చేస్తావనే అనుమానం నా కెప్పుడూ లేదు సావిత్రీ—నేను మనుష్యుల్లో విశ్వాసంవున్న దాన్ని—మానవత్వాన్ని నమ్మేదాన్ని—నువ్వు ఇక్కడ వుండడానికి నాకే అభ్యంతరమూ లేదు—తప్పకుండా వుండమ్మా!' అన్నది సుమిత్ర.

'కుముదక్క నాన్నగారితో చెప్పి నాకేదైనా ఉద్యోగం చూసిపెట్టు అత్తా!' అన్నది సావిత్రి కళ్ళుతుడుచుకుని.

'అల్లాగే చూద్దాంలే—కొంచెం ఓపిక రానీ! ఈలోగా నేనూ పరీక్షలకి వెళ్తాను. నేనొచ్చేవరకూ వాళ్ళయింట్లో వుంటే నీకు భయం వుండదు—' అని సావిత్రి చెంపలు నిమిరింది సుమిత్ర.

ఆస్పర్శతో ఉత్సాహం కలిగినట్లు,

'నాకు చచ్చిపోవాలనిపించేది. కానీ ధైర్యం చాలేది కాదు — ఎన్నోప్రయత్నాలు చేశాను—భయం వేసింది. నేనొట్టిపిరికిదాన్ని చిన్నత్తా! కానీ ఇప్పుడెందుకో చావడం దేనికీ, బ్రతికేవుండేమాత్రం ఏమనిపిస్తోంది. భవిష్యత్తును గురించిన ఆశలు లేవు—కానీ నీలాగే నేనూ ఉద్యోగం చేసుకుంటూ చదువుకుంటాను—ఇంకా కొంచెం మంచి ఉద్యోగం సంపాదించుకొంటాను—అప్పుడు—అప్పుడు—'

'ఊరుకో సావిత్రీ—ఎక్సైట్ అవడం మంచిదికాదు—ఎవరి భవిష్యత్తు ఎలా వుంటుందో! ముందే ఏం చెబుతాం—నీకేం ఫరవాలేదు — విశ్రాంతి తీసుకో!' అని ప్రక్క మీద పడుకోబెట్టింది సుమిత్ర. సావిత్రి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ పదే పదే చెప్పి కన్నీళ్లతో వెళ్ళింది ఇందుమతి.

'సుమిత్రా! విశ్వానికిక నువ్వు డబ్బు పంపకు—ఈ ఖర్చు చాలు నీకు — వాడికి నేను ఉత్తరం వ్రాశాను. సెలవులకి ఇంటికి వస్తాడుగా—అప్పుడు చెబుతాను—ఇక నుంచి నేను పంపుతాను—' అన్నది [illegible].

'దానిదేముందిలే వదినా!' అన్నది సుమిత్ర.

'నువ్వు ఎంత కష్టపడ్డావో — నాకు తెలుసు — ఇంకా ఇంకా నిన్ను కష్టపెట్టడం భావ్యం కాదమ్మా! ఒక్కమాట చెబుతాను—బసవరాజు యోగ్యుడైనవాడు—అన్ని విధాలా నీకు తగినవాడు— అతన్ని పెళ్ళాడే అవకాశాన్ని జారవిడుచుకోకు—' ఆర్ద్రమైన కంఠంతో అన్నది ఇందుమతి.

'అతని కుటుంబం సనాతనమైన ఆచారాలకు నిలయం వదినా — చిన్న వదినె కులం సంగతి, మన సావిత్రి సంగతి ఇవన్నీ తెలిస్తే వాళ్ళు నన్ను ఇష్టపడరు—అందుకే అతను ఎన్నిసార్లు ఆహ్వానించినా నేను వాళ్ళింటికి వెళ్ళలేదు. ఈ పెళ్ళి ఆ కుటుంబానికంతకూ సంబంధించిన విషయం కదా!' అన్నది సుమిత్ర.

'అవునమ్మా—మనం చేసే పొరపాట్లకి అనుభవించే శిక్షలు కొన్ని—ఇతరుల చేసే పొరపాట్లకి అనుభవించే శిక్షలు కొన్ని. మొదటినుంచీ నీ జీవితాన్ని నువ్వే చక్కదిద్దుకుంటున్నావు—ఈ ముఖ్య విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటావనే నేను అనుకుంటున్నాను—' అన్నది ఇందుమతి.



'పోతానమ్మా—' అన్నది సావిత్రి.

'మంచిది తల్లీ— అత్తకి ఈ వూళ్ళో వున్న పేరు ప్రతిష్ఠలకి నీ వునికి గొడ్డలి పెట్టు కాకుండా చూసుకో సావిత్రీ!' అని కళ్ళు తుడుచుకుంది ఇందుమతి.

రైలు కదిలింది.

'అమ్మకి వేసంటే ప్రాణం — వాన్నకి నా మీద కోపం వచ్చింది ఆ రోజున. నా మీద తారా జువ్వలా లేచాడు—కానీ అమ్మ నన్ను ఒక్కమాట అనలేదు. నెమ్మదిగా బతిమిలాడి, బుజ్జగించి అడిగింది. చివరికి ఇక్కడికి తీసుకుని వచ్చింది—' అన్నది సావిత్రి, దూరమైపోతున్న రైలు వైపు చూస్తూ—

'మీ అమ్మ చాలా తెలివి గలది సావిత్రీ! సమస్యలకి పరిష్కారాలు వెత కాలి గానీ, గోల చేసుకుని తలలు బాదు కోడం మంచిది కాదని గ్రహించింది—' అన్నది సుమిత్ర.

* * *

ఎండ ప్రతాపం తగ్గిపోయి, చల్లని గాలి ప్రజల పేద తీరుస్తున్న సమయంలో, షాపుల నిండా లైట్లు వెలిగాయి. బజారులో జనం రద్దీ ఎక్కువైంది. ప్లాస్టిక్ బుట్టనిండా ప్యాకెట్లతో ఫ్యాన్సీ షాపులో

బ్రతుకు బాట

నుంచి బయటపడింది సుమిత్ర.

బనారస్‌లో తను వాడుకోడానికీ, ఇక్కడ సావిత్రికివ్వడానికీ, రోజూ అవసరం అయ్యే వస్తువులు చాలా కొన్నది. రిక్షా కోసం పేవ్‌మెంటు మీద నిలబడి వాచీ చూసుకుంది. ఆరున్నర అయింది. ఇంత బరువైన బుట్టతో ఆ సమయంలో సిటీబస్ ఎక్కడం అసాధ్యం. నలుదిక్కులా చూస్తూ నిలబడిన సుమిత్రకి రోడ్డు క్రాసుచేసివస్తున్న బసవరాజూ, అతని చిన్న చెల్లెలూ కనపడ్డారు.

బసవరాజు చెల్లెలు అతనంత పొడుగ్గానూ వుంది. చెవులకి ముత్యాల లోలక్కులు పెట్టింది. ఖరీదైన సిల్కుచీరె కట్టింది. దానికి సరిపడ్డ జాకెట్టు ధరించింది. చిన్న చిన్న కళ్ళకి వెడల్పుగా కాటుక దిద్దింది. చక్కగా కత్తిరించిన పొడుగాటిగోళ్ళకి రంగువేసింది. జుత్తు పైకి దువ్వి ముడివేసింది.

'ఈవిడే వసంతా, సుమిత్రగారంటే!' అన్నాడు బసవరాజు, దగ్గరగావచ్చి నిలబడి—

సుమిత్ర నవ్వింది. 'ఈమె నా చెల్లెలు వసంత— బొంబాయిలో వుంటుంది— పెళ్ళాయన అక్కడ పెద్ద బట్టలమిల్లులో అసిస్టెంట్ మేనేజర్' అన్నాడు బసవరాజు.

వసంత విలాసంగా నవ్వి, 'మా అన్నయ్య చెప్పేదాన్నిబట్టి మీరు యెలా వుంటారోనని ఊహించలేక చచ్చేదాన్ని— వాడికి గోరంతని కొండంత చేసి చెప్పడం మొదటినుంచీ అలవాటే!' అన్నది.

ఆమె అలా అన్నప్పుడు చిన్నబోయిన ముఖంతో తనని తాను చూసుకుంది సుమిత్ర.

ముప్ఫైరూపాయలకి మించని వాయిల్ చీరె, చేతులకి మట్టిగాజులు, చెవులకు పదేళ్ళక్రితం చేయించుకున్న మెరుపులేని దుద్దులూ!

'అవును— మీలాగా నాకు ఖరీదైన దుస్తులూ, విలువైన నగలూ లేవు— అష్టరాల్ నేనొక బ్యాంక్ గుమస్తాను—' అనేసింది సుమిత్ర వెంటనే.

బసవరాజు నవ్వుకున్నాడు. వసంతకి ఆమె మాటలు వినిపించుకునే వోపిక లేదు కాబోలు, 'అయ్యబాబోయ్, ఇంత బరువుతో బస్‌కోసం నిలబడ్డారా!' అన్నది మళ్ళీ—

'మనని చూసి ఆగినట్టున్నారు—' అన్నాడు బసవరాజు ఇబ్బందిగా.

'ఓ! అలాగా! రండి సుమిత్రా! కాఫీ తీసుకుని పోదాం—' అని ఆహ్వానించింది వసంత.

ఆవిడ కంఠం కృత్రిమ మర్యాదని కప్పి పుచ్చే ప్రయత్నమేమీ చెయ్యలేదు. బసవరాజుతో వసంతని పోల్చుకుని నవ్వుకుంది సుమిత్ర.


'చాలా అలసటగా కనపడుతున్నారు— టిఫినేదైనా తినండి సుమిత్రా!' అన్నాడు బసవరాజు ఆప్యాయంగా—

'వద్దులెండి థాంక్స్.' అంది సుమిత్ర.

'మనిషికి మంచి పెర్సనాలిటీ వుండాలి— ఇలా పిట్టంత వుండకూడదు—పర్సనాలిటీ డెవలప్ కావాలంటే ఆహారం బాగా తినాలి. ఊ — కానివ్వండి. స్వీట్ తెమ్మను అన్నయ్యా!' అన్నది వసంత గబగబ.

'మనిషికి కావలసింది పర్సనాలిటీ కాదు— మెదడు. హృదయం!' అనాలనుకుంది సుమిత్ర.

'మీ ప్రయాణం ఎప్పుడు?' అన్నాడు



బ్రతుకు బాట

బసవరాజు. ఆ ఇద్దరి సంభాషణ అతనికి చాలా వెగటుగా కనిపించింది.

'ఎల్లుండి సాయంత్రం వస్తారా స్టేషన్‌కి!' అన్నది సుమిత్ర.

'రాకుండా వుంటానా! మళ్ళీ చాలా రోజులదాకా కనిపించరు!'

'అన్నయ్య ఇవ్వాళ నాకు మంచి కాశ్మీర్ సిల్కు చీరె కొంటానని ప్రామిస్ చేశాడు. ఇప్పుడిలా హోటల్‌కి లాక్కు వచ్చి చాలా టైం అయిందని ఇంటికి దారి తీస్తాడు—వాట్ట మోసం—' అంది వసంత బుంగమూతి పెట్టి. వాళ్ళిద్దరి సంభాషణా ఆవిడకి నచ్చలేదు.

'పాపం! నా మూలంగా మీ అవకాశం పోయింది కాబోలు!' అన్నది సుమిత్ర, వసంత కళ్ళల్లోకి కవ్వింపుగా చూసి.

'అదేం కుదరదండోయ్! ఎవరి మూలంగానూ నా అవకాశాలు నేను పోగొట్టుకోను—ఇప్పుడు మిమ్మల్ని కూడా తీసుకుపోయి మీచేత చీరె సెలెక్టు చేయిస్తాను' అన్నది వసంత బెదరకుండా.

'నీ సంగతి ఆవిడకింకా తెలీదులే!' అన్నాడు బసవరాజు.

'అవును ఆవిడ సంగతిమాత్రం నాకేం తెలుసూ!' అంటూ కాఫీ కప్పులో మరింత పంచదార వేసుకుంది వసంత.

ఆమె గడుసుదనాన్ని చూసి నవ్వుకుంది సుమిత్ర.

వెయిటర్ తెచ్చిన బిల్లు కాగితంమీద, తన పర్సులోనుంచీ డబ్బుతీసి పెట్టింది. సుమిత్ర.

'ఇందాకేమో ఆఫ్టరాల్ గుమాస్తా నన్నారు—ఇప్పుడు మాకు బిల్లు చెల్లిస్తున్నారా?' అన్నది వసంత.

పుస్తకమంత వెడల్పున్న తన హ్యాండ్ బ్యాగ్‌ని వదిలంగా భుజానికి తగిలించుకుంటూ.

'అసలు కాఫీకి రమ్మని పిలిచింది నువ్వు. న్యాయంగా ఆ బిల్లు నువ్వు యివ్వాలి—' అన్నాడు బసవరాజు.

'బావుంది— ఇది మీ వూరు— ఇక్కడ బిల్లులు నేనివ్వడం మీకే అవమానం— బొంబాయికిరండి — అక్కడ నేనిస్తాను—' అంది వసంత బయటికి దారి తీస్తూ.

'ఇవ్వాళ ఆవిడ నా గెస్టు—' అన్నది సుమిత్ర.

'మరే! మీరు టిఫిను పెట్టించండి. అన్నయ్య చీరె కొనిస్తాడు. రేపొద్దున రైలెక్కుతాను—' అన్నది వసంత.

బయటికి వచ్చాక, 'ఇంక నేను వెడతాను బసవరాజుగారూ!' అన్నది సుమిత్ర.

'నాకు చీరె సెలెక్టుచేసి పెట్టరూ?' వసంత.

'సారీ! వసంతా! నేను ప్రొఫెసర్ యింటికి వెళ్ళాలి—తరువాత ఇంటిదగ్గర బోలెడు పనుంది. చీరెలు నాకన్న మీరే బాగా సెలెక్టు చేసుకోగలరు-- అదీకాక నేనెప్పుడూ కాశ్మీర్ సిల్కుచీరెలు కొని ఎరుగను—' అని, రిక్షా పిలిచింది సుమిత్ర.

'సరే వెళ్ళండి — పాపం—' అన్నది వసంత.

తన పర్సనాలిటీ, ఏమాత్రం ఆమె దృష్టికి ఆనలేదని తెలుసుకున్న సుమిత్ర నవ్వుకుంది! ఎంత చిత్రమైన మనుష్యులుంటారు లోకంలో! ఆలోచనల్లో, ప్రవర్తనల్లో మనిషికీ మనిషికీ మధ్య వుండే వైరుధ్యానికి కారణం ఏమిటో అర్థం కాదు—తమ వివాహ ప్రస్తావనంటూ ఒకటి ఆ యింట్లో తల ఎత్తితే అందుకు వ్యతిరేకంగా ఓటు చేసేది! ముందు వసంతే ననుకుంది సుమిత్ర.

వివాహం అనేది తనకొక తియ్యని కల. ఏకాంతంగా, ప్రశాంతంగా, తీరికగా కూర్చునే అవకాశం అంటూ దొరికితే ఆ కలను కళ్ళముందు చూసుకుని మత్తుగా పదినిముషాలు దొర్లించి, గుప్తంగా ఎదలో దాచుకోడం తనకి అలవాటు. అక్కడ నుంచీ లేచాక మళ్ళీ ఆ కల గుర్తురాదు.

వైవిధ్యం లేని తన యాంత్రిక జీవన మార్గంలో, ఏదైనా ఒక శుభదినాన అతనితో ఒక అరగంట మాట్లాడే అవకాశం దొరికితే, ఎంతో ఉత్సాహం వచ్చినట్లు వుంటుంది.

అతని మైత్రి తనకొక మధురభావన. పూల పరిమళాన్ని మోసుకొచ్చే మలయ మారుత వీచిక.

ఈ మాధుర్యం తన జీవితంనుంచి అదృశ్యమవుతుందనే వూహను తను భరించ

లేక పోతోంది.

దూరంగా వుండాలనుకుంటూనే అత నికి మరింత చేరువై పోయింది తను! గుండెలో అలజడి రేగింది.

'అలా వున్నావేం సుమిత్రా!' అని ఆప్యాయంగా పలకరించి, ఫ్రిజ్‌లో నుంచి ఆరెంజ్ జ్యూస్ తీసిచ్చారు ప్రొఫెసర్ కరుణాకరం.

'ఇంతకు ముందే కాఫీ తీసుకున్నాను — అయినా అలసటగా వుంది. ఎగ్జామ్స్ ఎలా చేస్తానోనని చాలా బెంగగా వుంది సార్!' అన్నది సుమిత్ర తెచ్చి పెట్టుకున్న నవ్వుతో.

'మరేం ఫరవాలేదమ్మా — ఇంకా పది రోజులు టైం వుందిగా — అక్కడ నా ఫ్రెండ్ సుందరరాజన్ నీకు సహాయం చేస్తాడు. బాగా ప్రిపేర్ కావచ్చు' అంటూ ఆయనకి ఉత్తరం వ్రాసిచ్చారు కరుణాకరం. అక్కడినుంచి బయటికి వస్తూ వుంటే పుట్టెడు దుఃఖం వచ్చింది సుమిత్రకి. మనస్సులో నైరాశ్యం నిండింది.

బాస్కెట్‌లోని వస్తువులూ, ప్రొఫెసర్ గారి సిఫార్సులూ అన్నీ దూరంగా విసిరి పారేసి ఎక్కడికైనా పారిపోవాలనిపించింది. మరుక్షణం తన వూహకి తనకే నవ్వొచ్చింది సుమిత్రకి.

తన జీవితం అంతా గాలివాటుగానే సాగింది. ఇప్పుడూ అంతే! లేనిపోని ఆశల హర్మ్యాలు నిర్మించుకుని, అవి కూలి పోయినప్పుడు శిధిలాలను చూసి విలపించడం వెర్రితనం కాకేమిటి!

'ఇప్పుడు ఎం.ఏ. ప్యాసయి, ఉద్యోగంలో మార్పు తెచ్చుకోడం ఒక్కటే తనకి ధ్యేయం!' అనుకుంటే బరువెక్కిన హృదయం మళ్లీ తేలికైంది.

'చాలా సేపటికి వచ్చావు చిన్నత్తా! నీకోసం కుముదక్క వచ్చి వెళ్లింది! ఈ నోట్సులు యివ్వమంది. బెనారస్‌నుంచి తెల్లపట్టు చీరె తెమ్మని డబ్బుకూడా యిచ్చింది. రేపు బెంగుళూరునుంచి వాళ్లక్క వస్తుందట. ఆమెకోసం—' అంటూ చేతిలో బరువు అందుకుంది సావిత్రి.

అలసటగా కుర్చీకి చేరబడింది సుమిత్ర.

* * *

"హల్లో" అంటూ లోపలికి వచ్చాడు బసవరాజు. అప్పుడు ఎనిమిదిగంటలైంది.

'రండి — కూర్చోండి' అని నీరసంగా ఆహ్వానించింది సుమిత్ర.

'ఇంతసేపూ చీరెల బేరం తెగింది కాదు— ఎవరికో ఒకరికి టాక్స్ వేయండే దానికి 'తోచదు—' ముఖం తుడుచుకుంటూ అన్నాడు అతను.

సుమిత్ర చిన్నగా నవ్వి వూరుకుంది.

'మీరు చాలా చిక్కిపోయారు. ఇవ్వాళ మరీ నీరసంగా కనపడుతున్నారు— ఎక్కువ సేపు చదవడం వొంటికి మంచిదికాదు' స్నేహం కురిసే కంఠం అతనిది.

'నేను ప్యాసవడం మీకు బొత్తిగా యిష్టం లేనట్లుంది—'

'నాకన్న ఎక్కువ చదివేవాళ్లంటే నాకు భయం!'

'భయం వుండడం మంచిదేకదూ?' కర్చీఫ్ అడ్డం పెట్టుకుని నవ్వింది సుమిత్ర.

'పేరుకి ఆస్తిపరుణ్ణి— కానీ నా జీతం కూడా నాకు ఫ్రీగా ఖర్చుపెట్టుకునే ఛాన్స్ లేదు— ఇది వుంచండి మీ దగ్గర— నిన్న గోవిందస్వామిదగ్గర తెచ్చాను—' పర్సులోనుంచి అయిదు వంద రూపాయల నోట్లు తీసి యివ్వబోయాడు బసవరాజు.

'నేను కల్యాణిదగ్గర తీసుకున్నాను— నాకు కావలసింది అప్పు — మీరు అప్పు యివ్వరని నాకు తెలుసు— మీకు ఋణ పడడం నా కిష్టంలేదు— అందుకే మీ రెలాగా యివ్వబోతారని తెలిసి ముందే తీసు కున్నాను— అపార్థం చేసుకోకండి— నా కోసం మీరు వడ్డీలకి తేవడం బాగుండ లేదు' అంది సుమిత్ర.

నిజానికి అతను గోవిందస్వామి దగ్గర చాలా ఎక్కువ వడ్డీకి ఆ డబ్బు అప్పు తెచ్చాడు! సుమిత్రకి ఒకనాడిచ్చిన మాట కోసం.

అది తీరే విధానమూ కష్టమే!


'మీకు కల్యాణే ఎక్కువ స్నేహితురాలు— నా కన్నా—'


'ఈ లాజిక్ నాకు నచ్చదు— ఆ డబ్బు తీసుకు పోయి గోవిందస్వామికిచ్చెయ్యండి' విసుగ్గా అన్నది సుమిత్ర.

'మా చెల్లెలు ఇంట్లో ఇవాళ పెద్ద దుమారం లేవదీసింది. ఒక్కొక్కసారి ప్రేమకీ వాత్సల్యానికీ కట్టుబడి వుండడం కూడా చేతగానితనం క్రింద పరిగణింప బడుతుంది. అల్లాంటి వాళ్లని మరీ బంధించాలని చూస్తారు చుట్టూ వాళ్లు. ఎలాంటి వాళ్లకి అలాగే పాఠం చెప్పాలి' అన్నాడు బసవరాజు వెళ్లబోతూ—

'అవును— నాకు తెలుసు—' స్వగతంలో అనుకుంది సుమిత్ర.

(ఇంకావుంది)





మనమాట భాషతీరు

వేమూరి ఉమ

ఆమధ్య మా చుట్టాలావిడ అమెరికా నుండి వచ్చిందంటే చూడడానికి వెళ్ళాను. పట్టుమని పదినిమిషాలు కూర్చున్నానో లేదో, సంభాషణ ఎక్కడో శృతి తప్పి నట్లనిపించింది. ఏదో కృత్రిమమయిన వాతావరణంలో వున్నట్టనిపించింది. కాని దానికి కారణమిదమిద్ధమని చెప్పలేక పోయాను. ఇంటికొచ్చిన తర్వాత బుర్ర పట్టుకొని ఆలోచిస్తే చటుక్కున తట్టింది. ఆవిడ నాతో మాట్లాడినది ఇంగ్లీషులోకాదు తెలుగులోనే అని తట్టే సరికి నా అస్వస్థత అంతా మటుమాయం అయిపోయింది.

ఆ అమెరికానుండి వచ్చిన పెద్దమనిషి మాటలు కొన్ని వుదహరించకుండా నేను చెప్పదల్చుకున్నది చెప్పడం కష్టం. ఆమె మనదేశంలో బయలుదేరుతూ వున్నప్పటి సంఘటన యిది. 'అమెరికా ఫ్లైట్ అవడానికి ఎయిర్‌పోర్టుకి డ్రైవ్ చేసికొనివెళ్ళి, టికెట్ కౌంటర్‌దగ్గర టిక్కెట్ పికప్‌చేసి గాంగ్‌వే దగ్గరికి రన్ చేసికొంటూ వెళ్ళు, తీరా చూస్తే, ప్లేను టేకాఫ్ అయిపోతున్నాదని గేటుదగ్గర స్టాప్ చేసేస్తే ఎంత ఏంగ్రీగా ఫీలవుతామో మీరే చెప్పండి.'

దూరదేశాలు ఎంత తిరిగినా, యితర భాషలలో ఎంత పాండిత్యం గణించినా, మన మాతృభాషని యింతలా దూషించ వలసిన అగత్యం నాకేమీ కన్పించలేదు. మన భాషలో లేని మాటలను పర భాషల నుండి స్వీకరించడం ఎప్పుడూ మంచిదే కోర్టు వ్యవహారాలలో వాడే భాషలో ఎన్నో ఉర్దూ పదాలు ఉన్నాయి. కోర్టు, రోడ్డు, బస్సు, కిరసనాయిల్లు, పెన్సిలు వంటి ఇంగ్లీషు పదాలెన్నో తెలుగులో కలిసాయి. కాని (ఒకటే వేలం వెర్రిగా) మాకూ ఇంగ్లీషు వచ్చని లోకానికి చాటడానికా అన్నట్లు తెలుగు వాక్యాలలో ఇంగ్లీషు మాటలు జల్లడం ఆంధ్రుల జాతీయ క్రీడ అయిపోయింది. పోనీ, తెలుగులో మాట్లాడుతూ, మధ్యలో ఇంగ్లీషువాక్యం పూర్తిగా చెప్పినా అంత ఫరవాలేదు. అబ్బే! మళ్లా వ్యాకరణ యుక్తంగా ఇంగ్లీషు మాట్లాడడం కూడా చేత కాదుగా! ఇంగ్లీషు పదాలు, తెలుగు క్రియలు, మరొక వ్యాకరణంతో తెలుగుని ఖూనీచేసి వదలిపెడుతున్నారు.

ఇదే విషయాన్ని, మళ్లా సందర్భం వచ్చినప్పుడు ఆమెగారితో కదిపి చూశాను. మనస్సు బితుకు బితుకుమంటూనే వుంది. గాలివానలా సమాధానం రానూ వచ్చింది, నాకు బుద్ధీ వచ్చింది.



'తెలుగు ఒట్టి యూస్‌లెస్ భాష అనుకోండి. తెలుగులో కాన్వర్సేషన్ కంటిన్యూ చేద్దామని ఎంత బాదర్ అయినా కరెక్టుఅయిన వర్డ్ ఒక్కటి స్ట్రైకు అవదుగదా. అసలు ఆ మాటకొస్తే మా వారు తెలుగులో థింకు చెయ్యలేరంటే మీరు బిలీవ్ చేస్తారా ?'

'హా! హతవిధీ!!' అనిపించింది. అమెరికా వెళ్ళి యీవిడ నేర్చుకున్నది అహం భావం, గొంతు చించుకుని అరవడం, అదే ఆధునాతన సంస్కృతి అని భ్రాంతిపడడం.

నిజమే! క్లిష్టమయిన సాంకేతిక భావాలని తెలుగులోకి తర్జుమా చెయ్యడం కష్టమే. తెలుగుభాషలో స్వతస్సిద్ధంగా వున్న లోపాలవల్ల వచ్చిన యిబ్బంది కాదు యిది. మన దృక్పథంలో మార్పు తీసికొని రాడానికి మన నిరాకరణ యీ పరిస్థితికి కొంత తోడ్పడు తున్నది. తెలుగునాట శాస్త్రీయ పరిశోధనలు పెద్దఎత్తున జరిగితే తెలుగులో సాంకేతిక పదాలుపుట్టే అవకాశం వుంది. హిందూ వేదాంతం భారతీయ భాషలలో చెప్పినంత బాగా ఇంగ్లీషులో చెప్పలేము. అలాగే జ్యోతిష శాస్త్రంలోని విషయాలు భారతీయ భాషలలో సునాయాసంగా వ్రాయ వచ్చు. వేదాంతం, జ్యోతిష శాస్త్రం, గణితము మొదలగువాటిలో భారతీయులు ఒరవడి పెట్టారు గనుక ఆయా రంగాలలో విషయాలు తెలుగులో వ్రాయగలగడం ఏమంత కష్టంకాదు. అదీ ఎలక్ట్రానిక్స్ శాస్త్రంలోవాడే సాంకేతికపదాలు మచ్చుకి మూడైనా తెలుగులో కనిపించవు. ఎందు చేత? ఎలక్ట్రానిక్స్ మనదేశానికి పూర్తిగా పరాయి శాస్త్రమైపోయినది. తెలుగు దేశంలో తెలుగు పుస్తకాల నుపయోగించి, తెలుగు పాఠాలు చెప్పి, తెలుగులో మాట్లాడితే మరేమీ మహాపాపం కాదన్న భావాన్ని మనం ప్రజలలో కల్గించిననాడు తెలుగు కూడా ఒక లెక్కింపదగ్గ భాషగా తయారవుతుంది. ఆమాటకొస్తే, తెలుగేకాదు, ఏ భారతీయ భాషైనా ఎంతో పటిష్టంగా తయారవుతుంది. జపానులో జపాను భాష, చైనాలో చైనాభాష, జర్మనీలో జర్మనుభాష, ఇజ్రాయిలులో హీబ్రూభాష మాట్లాడడానికి ఆ ప్రజలు ఎంతో గర్వ పడతారు. మన మాతృభాష మాట్లాడ డానికి మనం కించపడతాము.

నా పూర్వకదంపుడు భావాలకి ఒళ్ళు మండిందిగానీ లు— 'ఓకే అంటీ! బజారుకెళ్ళి మిల్కుగ్లాసుక్కుని ఇంటి కెళ్ళాలి. మావారు వచ్చేటయిమయింది' అని ఆవిడ లేచి వెళ్ళింది.

ఈ ద్విభాషా పద్ధతి సంభాషణల్లోనే కాదు వ్రాతలోకూడ రివాజయి పోతున్నాది. మనతెలుగు వారపత్రికలలో ఈ ఇంగ్లీషు పదాల వాడుక మరీ వేలంవెర్రి అయిపోతున్నది. గిరీశంచేత గురుజాడవారు ఇంగ్లీషు మాట్లాడించేరంటే అది ఆయన పాత్ర పోషణకై చేశారు. ఒక సన్నివేశాన్ని రక్తికట్టించడానికిగాని, సందర్భోచితంగా ఇంగ్లీషుమాటలు వాడితే రాణిస్తుందిగాని సంస్కృత సమాసాలలో వెన్నెలను వర్ణిస్తూ, అదే వాక్యంలో 'టేబుళ్ళమీద



ప్లేట్లలో సర్వర్లు డిన్నర్ సెర్వ్ చేస్తూ వుంటే' అన్న ఇంగ్లీషుపదాలు గుప్పించి, వాక్యం చివర పాకశాస్త్రంపై మళ్ళీ నాలుగు సంస్కృత సమాసాలు విసిరితే, ఆ కథ ప్రచురించే సంపాదకుల కెలా వుంటుందోగాని, చదవడానికి కొంచెం ఇబ్బందిగానే వుంది.

అలాగయితే 'సిగ్నల్' అన్నమాటని 'ధూమశకట గమనాగమన భయసూచక లోహపట్టిక' అని అనువదిస్తే ఎబ్బెట్టుగా లేదా. అందుచేత సిగ్నల్ అన్నమాటనే వుపయోగిస్తూ మనవచ్చు. ఇటువంటి పరిస్థితులలోనుండి బయటపడడానికి మార్గాంతరాలు లేకపోలేదు. ఒక భావాన్ని ధరించే ఇంగ్లీషు మాటకి సరియైన [illegible] స్వయంబోధకమైన తెలుగు మాట లేనప్పుడు క్రొత్తమాటలు సృష్టించడంలో తప్పేమిటో నాకు అర్థమవడంలేదు. సాంకేతిక రంగాలలో యీ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా అమలులో వున్నదే! క్రొత్తదేమీకాదు.

'సిగ్నల్' అంటే రైల్వేస్టేషన్‌లో వుండేదే కాదు. 'సిగ్నల్' అంటే ఒక వార్తని ఒక స్థలమునుండి మరొక స్థలానికి పంపడానికి క్లుప్తంగా వాడబడే ఒక సంకేతము. ఇంకా టూకీగా చెప్పాలంటే సిగ్నల్ అనేది ఒక వార్తకి సంకేతము, లేక వార్తా సంకేతము. ఈ రెండు మాటలనీ కలిపి వాకేతము అని అనువదించ వచ్చు. పదిసార్లిలా అంటే పదకొండోసారికదే అలవాటవుతుంది. ఇంగ్లీషులో 'ట్రాన్సిస్టర్' అన్నమాట యిలాగే పుట్టింది. 'ట్రాన్స్‌ఫర్' (బదిలీ) అన్న మాటలోని మొదటిభాగం, 'రెసిస్టర్' (అవరోధకి) అన్న మాటలోని చివరిభాగాన్ని కలిపి ట్రాన్సిస్టర్ అని చేశారు. కనుక ట్రాన్సిస్టర్ విద్యుచ్ఛక్తికి కలిగే అవరోధాన్ని ఒక చోటనుండి మరొక చోటకి బదిలీ చేస్తుందన్న మాట.

ఇటువంటి వూహాలు మన భాషలో లేక పోలేదు. కనిష్ఠ సామాన్య గుణిజము అన్న దానిని మన పాఠశాలలో కసాగు అని అనడం లేదూ? ఈ కసాగు పద్ధతి నుపయోగించి తయారు చేసినవే ఇంగ్లీషులోని 'రాడార్', 'లేసర్' అన్న మాటలు.

ఏ విధంగాను ఆంధ్రీకరణకు లొంగని మాటలను ఆవళంగా వాడక ఎలాగా తప్పదు. నేనిలా అంటే నాకు ఇంగ్లీషు రాక యిలా తప్పించుకుంటున్నానన్నారు. నికితా క్రుశ్చేవ్, జనరల్ డిగాల్ ... వీళ్ళంతా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారా? మాతృభాషలో మాట్లాడినంత మాత్రాన వారి ఔన్నత్యమేమైనా తగ్గిందా?

తెలుగువాళ్ళల్లోనే కాదు; తమిళ సోదరులలోకూడా యీ ద్విభాషా పాండిత్యం మరొక రకంగా కనిపిస్తుంది. మెరుగైన విషయం ఏమిటంటే, ముందు తమిళంలో ఒక వాక్యం పూర్తిగా చెప్పి, అదే గుక్కలో ఆ వాక్యాన్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసి చెబుతారు—'అద్దాన్నాన్ పాత్రె', 'దటీజ్ హ్వాట్ ఎగ్జాక్ట్లీ ఐ సే': 'అను'.'డస్ప్రైట్' ●

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని కథల వ్రాతప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాగల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజీగల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో యిటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు. 100 అరఠావు పేజీలయిన వున్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపకోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాగల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరిచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయములో [illegible] వంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ కథలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రపత్రిక వారపత్రిక

పాపం సుబ్బారావు!

ప్రశాంత



ఆడపిల్లలు టిఫిన్ క్యారేజీ బొంతుల్లా ఎగరేసుకుంటూ అందుకోడానికి ఎగురుతూ రోడ్డుమీద వెళ్తున్నారు. ఆకాశంలోని విరిసిన మబ్బుల్ని తలదన్నా అన్నట్లు కొంగలు బారులుదీరి మధ్యమధ్య పల్టీలుకొడుతూ పరవశంగా పోతున్నాయి. అందంగా ఫ్యాషన్లలో అపరంజి బొమ్మల్లా అలంకరించుకున్న కాలేజి విద్యార్థినులు ఒయ్యారంగా ఫ్యాన్సీ షాపులముందు బేరాలు చేస్తున్నారు. ఇంకా పత్రికల్లో వచ్చిన కొత్త డిజైనులు మార్కెట్‌లోకి రానందుకు విసుగు, దానికనుంచి విసుర్లు వేస్తున్న కుర్రాళ్లగోలకి కొంచెం చిరాకు, వెళ్లిపోతారేమో వింటర్ సైనుమెంటు లేకుండా అని మరోవైపు దిగులు.

ఆంధ్రదేశంలోని ఓ సుబ్బారావు ఆఫీసు నుండి బయటపడి ఎటుచూసినా నిండి పోయిన బజారులోని కలర్‌ను చూస్తూ మెల్లిగా నడుస్తున్నాడు. ఈ సుబ్బారావులు తెల్ల నయాపైస బిళ్లల్లాంటివారు. పెద్ద ప్రయోజనమూ లేదు, జారిపోయినా అంత ఇబ్బందీ లేదు, మహా అవసరం అయితే పడ్డీవారికి ఇవ్వవలసిన చిల్లర దగ్గరా, బ్యాంకుల్లోనూ. సుబ్బారావు పేరున్నవాళ్లెవరూ దేశంలో గొప్పపేరు సంపాదించలేదు. అందుకే సుబ్బారావుకి తనమీద కాదుకాదు తన పేరుమీద దాన్ని పెట్టిన తల్లిదండ్రులమీదా ఎంతగానో కోపం. ఏమీ తోచకపోతే తల్లిదండ్రులు 'సుబ్బారావు' అని పెడతారు, ఏమీ తోచకపోతే ముష్టివాడికో నయాపైస వేసినట్లు.

అందుకే అతను తన ఊహ వచ్చినప్పటి నుండీ అనుకునేవాడు, తను ఏదైన ఘన కార్యంచేసి తన పేరున్న వాళ్లందరికీ గొప్పపేరు ప్రఖ్యాతులు సంపాదించాలని. తనపేరున్న వాళ్లందర్నీ కలిపి ఒక సంఘంలా తయారుచేసి సాంఘికంగా కళా రంగంలో, శాస్త్రాల్లో అఖండం అయినవి సాధించాలని. ఎంతోకాలం ఆలోచించి ఆఖరికి ఒకరోజు కొంతమందిదగ్గర బయటపెడితే, నవ్వినవాళ్లు కొందరు, ఏడిపించిన వాళ్లు ఇంకొందరు. కనీసం ఆపేరున్న పదిమంది అయినా అంత పెద్ద ఆసక్తి కనబరచక పోయేసరికి, తన ప్లాను అన్నీ కాయితాలమీదే నిలిచిపోయాయి. ఇప్పటికీ ఆ దుమ్ముపట్టిన కాయితాలు

చూసుకోవడం, కాస్సేపు వాటన్నాన్ని మెరవడం ఒక అలవాటయిపోయింది. అతని ఖర్మకి తగ్గట్లే భార్యపేరు 'కమల' నాన్సెన్స్! కమలేమిటి? ఎప్పుడో కృష్ణదేవరాయలుకాలంనాటి పేరు. కాస్త ముద్దుగా రాధ అనో గీత అనో అనుపమ, సమత, కవిత — ఇలా ఏదయినా కాకూడదూ. పెళ్ళిచూపులు దగ్గరే తనకు కమల వద్దంటే కారణం చెప్పమని తల్లి గుచ్చి గుచ్చి అడిగేసరికి తప్పనిసరి అయి చెప్తే అంతా నవ్వారు. 'వెర్రివాయినా పేరుదేముందిరా? నీచేతిలో పని. నీ పెళ్ళాన్ని ఏలా పిలిస్తే మాత్రం నిన్నుకాదనే దెవరు?'

'అదిగాదు అసలు నాకు ఆ పేరు నచ్చలేదు'

'నీకు వచ్చినట్లుగా మార్చుకో'

'దేశం అంతా 'కమల' అనే తెల్సుగదా!'

'నువ్వు మార్చేశావని దండోరా వెయ్యి అందరూ ఒప్పుకొంటారు.' చటుక్కున తలవంచక తప్పలేదు సుబ్బారావు.

తలుపులు దగ్గరా పెళ్ళిలో అదేతంతు. పానీతే ఆడదిగదా అని సిగ్గులనీ తనే ముందు చెప్పాడు. అందరూ గొల్లుని ఒక్కసారిగా నవ్వారు. తనకి ఏడుపు వచ్చినంత పని అయింది. అయినా ధైర్యంగానే చెప్పాడు తనుపేరు మార్చేశానని.

'ఆ అధికారాలేం లేవు. అయినా అప్పుడే అధికారాలదాకా వచ్చారే. అదేం కుదరదు...' అంది పక్కనుంచి ఓ కొంటె మరదలు.

'మీ ఇష్టం అయిన పేర్లన్నిటికి పలకాల్సిన అవసరం మా కమలకి లేదు. చక్కగా 'కమల' అనండి. ఒప్పుకుంటాం. అప్పటిదాకా లోపలికి పంపేదే లేదు' అందుకుంది మరో వనితాలోకం రెగ్యులర్‌గా చదివే కాలేజీ విద్యార్థిని.

సుబ్బారావుకి బాగానే కోపం వచ్చింది. అలస్యంగా పరీక్షకివెళ్ళి తెల్లగర్ పేపరు ఇవ్వమని పొమ్మన్న రోజునకంటే ఎక్కువగా వచ్చింది. ఎలాగ్గైనా తన పంతమే నెగ్గించుకోవాలనుకున్నాడు సుబ్బారావు. ఎందుకంటే రేపటినుండి మరీ లోకువ కట్టేస్తుంది.

'అదిగాదు సుబ్బారాయుడుగారూ...'

'కాదు సుబ్బారావ్'

'ఏదైతేనేం మొత్తంమీద అర్థం ఒకటేగా'

'వరే నీ యిష్టం'

ఇలా సాగుతున్నది ధోరణి. అపద్బాంధవులెవరయినా కనిపిస్తారేమోనని చూశాడు. కానీ వెధవలు అందరికి అమ్మాయిలను చూడటమే సరిపోతున్నది. నోరు తెరుచుకొని చూస్తున్నారు. పక్కనే ఉన్న సుబ్బారావు కాలుదొక్కాడు పెళ్ళికొడుకు సుబ్బారావు. అయితే ఈ సుబ్బారావు హార్స్‌పవర్ కొంచం ఎక్కువే. అందుకే వెంటనే సంగతి అర్థం చేసుకొని 'అదేం కుదరదు మావాడు తనయిష్టం వచ్చినట్లు పిలుస్తాడు. భార్య భర్తమాట వినాలి' అనగానే పొడుగాటిజడ ముందు కేసుకొన్న ఒక కోణంగి 'ఆహా! చెలి ఆ రామాయణం ఇలా అందుకో. ఇంత గొప్పసత్యం చెప్పినందుకు పత్కారిద్దాం దాన్ని బహూకరించి' అంది.

పెద్ద ముత్తయిదువులంతా విడ్డూరంగా చూస్తున్నారు, తమ పెళ్ళినాటి తలుపుల దగ్గర అనుభవాలతో బేరీజు వేసుకుంటూ.

'ఏమండోయ్! ఆరోజులు పోయాయి. ఇప్పుడు అందరూ సమానం'

'ఎందులో సినిమాల్లోనా?'

'కాదు జీవితంలోనే. మేమేం తక్కువ కాదు. చంద్రమండలానికి గూడా పోయి వచ్చాం తెలుసా?' అంది ఒక సైన్సు విద్యార్థిని.

'అయితే అవి సినిమా సీట్లలోనూ బస్సుల్లోనూ ఎందుకు పాటించరో?' రెండుజడలు క్షణం తికమకపడ్డాయి. వెంటనే ఓ చారెడుకళ్ళచంచలాక్షి కళ్ళు మెరిశాయి. 'అదంతా మాయిష్టం పైగా మీరు ఊరికే కూర్చోరు...'

'ఓహో! అలాగా, అయితే ఏం చేస్తాం చెప్పండి?'

అమ్మాయిల అల్లరి అతక్షణం నిశ్శబ్దం అయింది.

'ఊ! చెప్పండి. ఏం చేస్తాం?'

'ఏంచేస్తారు? వెధవపనులు చేస్తారు. కోతి కొబ్బరికాయ దగ్గర ఎంతసేపు బుద్ధిగా ఉండగలదు?' మళ్ళీ చంచలాక్షే అంది.

'కాబట్టి మీరు మా చేతుల్లో కొబ్బరికాయలాంటివారు. ఒప్పుకుంటున్నారుగా? అందుకే చెప్పినమాట వినాలి అనేది' రవి ఉత్సాహంగా అన్నాడు.

'అదేం కుదరదు' మొండిగా అంది మరో విశాలాక్షి.

'ఇంతలో ఒక ఆమె కల్పించుకొని 'పోనీండి వాయినా, చిన్నపిల్లలతో మీకూ పంతం ఏమిటి?'

'మీకు తెలీదు కమలమ్మా...' పెళ్ళికొడుకు.

'అదుగో. పిలిచేశారు, చూశారా?' గవ్వలన్నీ గలగల మన్నాయి.

'నేను మీ కమలను పిలవలేదు, మా అత్తయ్యతో మాట్లాడుతున్నా'

'అది మా కనవసరం. మా కమల పేరు వచ్చింది. అదే మాకు కావల్సింది'

సుబ్బారావు దిక్కుమోహం వేశాడు. మిగిలిన సుబ్బారావు దిగులుగా చూశాడు. రవి అందుకున్నాడు సమర్థిస్తూ 'పోనీ లేరా సుబ్బా, ఏదో ఆడపిల్లలు' మళ్ళీ నవ్వులు, గోల, చప్పట్లు. తలి మళ్ళీ పోయి అలవాటుకొద్దీ సుబ్బా అన్నాడు. సుబ్బారావు మింగేస్తున్నట్లు చూశాడు.

అందరు ఆడపిల్లలూ, ఇంకా ఏడిపించడం బాగుండదని 'దయచేయండి' అన్నట్లు దారి తప్పుకున్నారు.

'మరి మీ అమ్మాయి మా వాడి పేరు చెప్పలేదు'

చంచలాక్షి 'చెప్పనే కమలా సుబ్బారావు అని' వెక్కిరింతగా తక్కువమని రెప్పపాటు ఆలస్యం చెయ్యకుండా 'సుబ్బారావు' అనడం గది మారుమోగడం దూరంగా టేపు రికార్డు 'సుబ్బారాయుడు పెళ్ళి' చూసి వస్తాము రండి' అని వినిపించడమూ జరిగాయి.

తల వంచేసుకొని గబగబా ముందుకు వెళ్ళిపోయాడు సుబ్బారావు అనబడే తెలుగు బెలగుండా.

అర్థగంట తరువాత ఉన్నట్లుంటి 'మీ వ్యవహారం నాకేం బాగోలేదు'

'అయ్యో రామా, నేనేం చేశానండీ మధ్య?' వెంటనే అనేసింది కమల తడుముకోకుండా. 'చెయ్యకపోవడం ఏమిటి? అంతా ముందుగా ఏర్పాటు చేసుకొని నీ స్నేహితురాళ్ళందరిచేతా నన్ను గోల చేయించావ్'

'అక్కడ మీ కుర్రాళ్ళేనా తక్కువ వున్నది. సాధనా అనీ జమునా అనీ అజంతా

లిటక్విజ్ నెం. 53 — 18 క్లూలు

1. గర్వం వలెనే ఆశ, అభివృద్ధి/న్యాయబుద్ధి కి గొప్ప ప్రతిబంధకం. మరి ఈ రెండున్ను నిర్దాక్షిణ్యంగా తొలిగింపబడవలెను.

2. భారతదేశంలో ఇప్పటికిన్ని ధరిత్రి మీద అత్యంత అధిక ప్రాచీన/సంబద్ధ సంయుత గలదు.

3. ప్రమాదంలో మానవ యుక్తి ఉల్లాసం/సాహసం అయి వున్నది.

4. ఉత్పాదన విస్తారమై యున్నప్పుడుమాత్రమే మరియు ఉత్పాదక శక్తులలో నిర్బంధాలు లేనప్పుడే అపమూల్యన / ముద్రాస్ఫీతి దేశానికి సహకరింపగలదు.

5. ఆధునిక మనుష్యుడు దాని సృష్టిలో తన పురఃసర్త్వం లేనటువంటి విస్తార మరియు చిక్కైన సభ్యతలో వసించుతాడు; అయితే తాను చిన్నవాడు / నిశ్చేష్టితుడు గా భావించుకొన్నచో ఆశ్చర్యం ఏమీ లేదు.

6. సభ్య సమాజానికి ఆదిమముకు తోడుగా సభ్య భావనలు / రివాజులు కావలసియున్నవి.

7. సామాజిక జీవనమందలి సాంస్కృతిక ఆకృతులలో అనుశాసనానికి ఆవశ్యకత లేదు, ఇచట మనం మన క్షమతలను / కల్పనలను ఉపయోగిస్తుంటాము.

8. కళాకారుని అన్వేషణ వైజ్ఞానికుని అన్వేషణకంటె తక్కువ లాభదాయకం / తథ్యపూర్ణం మరియు యత్నభరితమైనది కాదు.

9. గోధుమ అధికంగా పండుట మానవుని యొక్క కంటె ఎక్కువగా ప్రకృతి యొక్క ప్రామాణికం / దక్షత వల్లనే.

10. మనలను మానవులుగా జేయునది పరివర్తన / విచారత గురించి మన క్షమతయే.

11. రాష్ట్ర నిర్మాణ కష్ట సాధ్య కార్యయత్నంలో, ఆర్థిక వికాసం, దేశ భౌతికాభివృద్ధి ఎంత అవసరమో, మౌలిక విచారణ మరియు జాగృత జీవనం / ప్రేమ వల్ల ఉత్పన్నమైన సృజనాత్మక సాహిత్యం అంత ఆగత్యం.

12. ఇదియొక ప్రాచీన యుక్తి; మీ స్వార్థ్య రాజనీతిక ప్రయోజనాలను దాచి యుంచుటకున్ను, మీ లోపయుక్త పాపముల నుండి ధ్యాసను మరలించే నిమిత్తమున్ను మీరు పని ఎంత తక్కువగా చేయ నుంకింతురో అంత ఎక్కువగా ప్రతిజ్ఞలు / వాక్కులు ప్రసరింపవలసి యుంటుంది.

13. మౌలిక అనుసంధానాలు విజ్ఞానంలోవలెనే కళలోకూడ అరుదు/లాభదాయకం అయినవి.

14. ధరిత్రిమీద మానవుడుగా అవతరించినందుకు మరి దేనినీ ఆశించక సంసార భోగములకే ఆత్రపడే మానవుని అస్తిత్వం యొక్క అసలైన ఉద్దేశ్యం / గౌరవం అణిగిపోయింది.

15. ప్రపంచంలో ప్రయోజనకరంగా ఏదైన సత్కార్యమును సాధించిన జనులు సర్వదా తిరుగబడువారుగా / క్రియాశీలురుగా వుంటారు.

16. [illegible] మూలమందు క్రాస్, ముక్తి/సహనశీలతా చిహ్నమై యున్నది.

17. మనము ఎంత ఎక్కువ స్వార్థులం / అవిశ్వాసులం గా అయి వుంటామో అంత ఎక్కువగా మానంతట మనకు చెరుపు కలిగించుకొని, నిజంగా మన ఇరుగు పొరుగు వారికి కూడ కలిగించినవారల మౌతాము.

18. తెరటములు/శబ్దములు(మాటలు)యందు ఇంద్రజాలం మరియు ప్రమాదం రెండున్ను గలవు.

No. 53: 18 CLUES

(1) Like Pride, Greed is a great obstacle to **Advancement / Judgement**, and both of these must be ruthlessly washed away.

(2) India still has the most **Ancient/ Coherent** civilization on earth.

(3) **Cheer / Courage** is man's salvation in danger.

(4) **Devaluation Inflation** can only help a country when the production is abundant and when there are no restraints on the forces of production.

(5) Modern man lives amid an Immense, complex civilization that he did little to create; it is not surprising if he feels **Diminutive / Passive**.

(6) A civilised society needs civilised **Emotions / Institutions** in addition to the primitive ones.

(7) In the cultural aspects of social life, there is little need for discipline. Here we **Exercise** our **Faculties/Fancies**.

(8) The exploration of the artist is no less **Fruitful / Touthful** and strenuous than that of the scientist.

(9) Wheat grows more by nature's **Honesty / Ingenuity** than by man's.

(10) What makes us human is our capacity for **Innovation / Reflection**.

(11) In the uphill march of nation—Building, Creative literature, born of creative thinking and enlightned. **Living Love**, is as much needed as the economic development and material uplift of the country.

(12) It is an old tactic: The less you mean to do The more you have to keep **Promising /Talking**, to conceal your selfish political expediencies, and to distract attention from your sins of omission.

(13) Original discoveries are as **Rare / Rewarding** in art as in science

(14) The true **Reason / Record** of man's existence on earth has been over shadowed by his anxiety to obtain from his incarnation nothing but worldly gain.

(15) People who have achieved anything worth achieving in this world have ever been **Rebels / Restless**.

(16) The cross, at the core of its faith, is a symbol of **Salvation/ Suffering**.

(17) The more **Selfish /Suspicious** we are the more evil we do to our selves, and indeed to our neighbours.

(18) There is both magic and menance in **Waves /Words**.

గమనిక: పై క్లూలు ప్రసిద్ధ గ్రంథకర్తల పుస్తకములనుండి తీసుకొనబడినవి. అవి పూర్తి వాక్యములు మరియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి. గ్రంథకర్తలు, వారి పుస్తకముల పేర్లు అఫిషియల్ సొల్యూషన్‌తో పాటు లిట్‌క్విజ్ వీక్లీలో ప్రచురించబడును.

పాపం సుబ్బారావు

అనీ, చంచలాక్షి అనీ ఎందుకనాలంట నా స్నేహితురాలని. అక్కడికి మీరు పేర్లు పెట్టి పెక్కిరిస్తుంటే మేం పడిఉండాలి గాబోలు'

సుబ్బారావుకి తెలుసు తన స్నేహితులంతా కమల ఫ్రెండ్స్‌ను ఎంతగా ఏడిపించిందీ. పచ్చ చీర కట్టుకొనివచ్చిన అమ్మాయిని చూసి 'అజంతా ఎప్పుడు వెళ్ళావు ?' అని ఒకడంటే 'ఇంతకు మించిన అజంతా ఇంకెక్కడుం'దని ఇంకొకడు. భోజనాలదగ్గర బంగారంలా మెరిసిపోతూ వచ్చిన పొడుగమ్మాయిని చూసి రవి 'ఏం మామిడిపండురా ? కోనసీమలో గూడా ఇలాంటివి దొరకవు'

'చచ్చువెధవా ! ఎదురుగా ఉన్నదాన్ని అనుభవించక ఎక్కడిదాన్నో ఆలోచిస్తావెందుకు. ఊ ఊ కాని తొందరగా'

'అబ్బ ! గట్టిగా ఉందిరా, కొరకబడటం లేదు'

పెళ్ళిలో భోజనాల దగ్గర ఈ సంభాషణ అంతా వింటూనే ఉన్నాడు తను. అయినా ఏం మాట్లాడలేదు, ఎందుకంటే ఏదన్నా అంటే గింటే ప్లేట్లు తన మీదకే తిరిగొయ్యగల ప్రబుద్ధులు.

సుబ్బారావు మళ్ళీ మొదలు పెట్టాడు 'వాళ్ళు ఏదో నాలుగు మాటలేగా అంది. దానికి మీరుచేసిన పని ఏమిటి ? కిళ్ళీల నిండా ఇసకపోశారు, పులుసునిండా చేదు దోసకాయల ముక్కలు కలిపారు, ఒంకీలకి తగిలించిన నవ్వుల గుండీలు కోశేశారు. కాఫీలు కషాయం చేశారు—చాలా ఇంకా ఏమన్నా చెప్పాలా ?'

'ఏమో ! అవన్నీ మీకే తెలియాలి'

'తప్పించుకోకు ఇవి అన్నీ మీకు తెలీకుండానే జరిగాయంటావా ?'

'మీ ఫ్రెండ్స్ అంతా మీకు తెలిసే అవి అన్నీ చేసినట్లయితే, ఇవి అలాగే తీసుకోవచ్చు. అయినా మీ వాళ్ళు చేసిన గోలకి సమాధానంగా చేశారు నా ఫ్రెండ్స్. అందుకని వాళ్ళదేమీ తప్పులేదు. కాదు అంటారా, ఇక మీ యిష్టం. యూ కెన్ టేకిట్ ఆర్ లీవ్ యిట్'

కమల మొదటిసారిగా వేసిన ఇంగ్లీషు మాట కాదు చెణుకు. అబ్బ ! కమల ఎంత చక్కగా అంది. అయితే రోజా తను కాసేపు ఎదురుగా కుర్చీలో కూర్చో

నెం. 51 లో ఒక్క ఆల్ కరెక్టు విజేతకూడా రాలేదు. ఒక్క తప్పుగల ఎంట్రీలు పంపిన 21 మంది మొదటి బహుమతిని పంచుకొనిరి. ఒక్కొక్కరు ఒక మర్ఫీ ట్రాన్‌సిస్టరు వంతున 170 మంది పొందియున్నారు. రూ. 10,000 లకు పైగా అదన బహుమతులు.



—: ముఖ్యాంశములు :—

1. మొదటి బహుమతి మొత్తము హెచ్చింపు.
2. 4 & 5 బహుమతుల మొత్తం హెచ్చింపు
3. మిని క్విజ్ లో 4 తప్పుల వరకు బహుమతులు గలవు.
4. మిని క్విజ్ లో రన్నర్స్ అప్ బహుమతుల మొత్తం హెచ్చింపు.
5. చందాదారుల బహుమతులకు కొత్త పథకము. హెచ్చింపు మొత్తము.

లిట్‌క్విజ్ వీక్లీ ఉచిత కాపీకై వ్రాయండి.

లిట్‌క్విజ్ నెం. 53 అధికార ఎంట్రీ ఫారము.

ఆఖరు ముగింపు తేది 20-8-69 బుధవారం

ADDRESS: LITQUIZ No. 53 ALANKAR, BALARAM STREET, BOMBAY-7. (W B)

గమనిక: 1) ఒక్కొక్క కాలంలో మీరు వద్దనే పదమును కొట్టివేయండి. (2) ఒక కూపన్ మాత్రం పంపినచో ఇతర కూపనులను కొట్టివేయండి. (3) ఎంట్రీరుసుము M.O. ద్వారా పంపినచో, పోస్టాఫీసునుండిపొందిన M.O. రసీదును ఎంట్రీ ఫారముపకు జతపరచవలెను. M. O. రసీదు లేని ఎంట్రీలు నిరాకరింపబడును. (4) I. P. O. క్రాస్‌చేయువద్దు. అవి లిట్‌క్విజ్ నెం. 53 బొంబాయి—7 వారికి చెల్లించునటు ఉండవలెను.

Rs. 1	1		Rs. 1	2		Rs. 1	3		Rs. 1	4	
1	ADVANCEMENT	JUDGEMENT	1	ADVANCEMENT	JUDGEMENT	1	ADVANCEMENT	JUDGEMENT	1	ADVANCEMENT	JUDGEMENT
2	ANCIENT	COHERENT	2	ANCIENT	COHERENT	2	ANCIENT	COHERENT	2	ANCIENT	COHERENT
3	CHEER	COURAGE	3	CHEER	COURAGE	3	CHEER	COURAGE	3	CHEER	COURAGE
4	DEVALUATION	INFLATION	4	DEVALUATION	INFLATION	4	DEVALUATION	INFLATION	4	DEVALUATION	INFLATION
5	DIMINUTIVE	PASSIVE	5	DIMINUTIVE	PASSIVE	5	DIMINUTIVE	PASSIVE	5	DIMINUTIVE	PASSIVE
6	EMOTIONS	INSTITUTIONS	6	EMOTIONS	INSTITUTIONS	6	EMOTIONS	INSTITUTIONS	6	EMOTIONS	INSTITUTIONS
7	FACULTIES	FANCIES	7	FACULTIES	FANCIES	7	FACULTIES	FANCIES	7	FACULTIES	FANCIES
8	FRUITFUL	TRUTHFUL	8	FRUITFUL	TRUTHFUL	8	FRUITFUL	TRUTHFUL	8	FRUITFUL	TRUTHFUL
9	HONESTY	INGENUITY	9	HONESTY	INGENUITY	9	HONESTY	INGENUITY	9	HONESTY	INGENUITY
10	INNOVATION	REFLECTION	10	INNOVATION	REFLECTION	10	INNOVATION	REFLECTION	10	INNOVATION	REFLECTION
11	LIVING	LOVE	11	LIVING	LOVE	11	LIVING	LOVE	11	LIVING	LOVE
12	PROMISING	TALKING	12	PROMISING	TALKING	12	PROMISING	TALKING	12	PROMISING	TALKING
13	RARE	REWARDING	13	RARE	REWARDING	13	RARE	REWARDING	13	RARE	REWARDING
14	REASON	RECORD	14	REASON	RECORD	14	REASON	RECORD	14	REASON	RECORD
15	REBELS	RESTLESS	15	REBELS	RESTLESS	15	REBELS	RESTLESS	15	REBELS	RESTLESS
16	SALVATION	SUFFERING	16	SALVATION	SUFFERING	16	SALVATION	SUFFERING	16	SALVATION	SUFFERING
17	SELFISH	SUSPICIOUS	17	SELFISH	SUSPICIOUS	17	SELFISH	SUSPICIOUS	17	SELFISH	SUSPICIOUS
18	WAVES	WORDS	18	WAVES	WORDS	18	WAVES	WORDS	18	WAVES	WORDS

FREE AFTER 4 COUPONS 53



MINIQUIZ

ADVANCEMENT	JUDGEMENT	DIMINUTIVE	PASSIVE	HONESTY	INGENUITY
ANCIENT	COHERENT	EMOTIONS	INSTITUTIONS	INNOVATION	REFLECTION
CHEER	COURAGE	FACULTIES	FANCIES	LIVING	LOVE
DEVALUATION	INFLATION	FRUITFUL	TRUTHFUL	PROMISING	TALKING

3/61 ANNUAL SUB. No. ____ / NEW.

ఈ క్విజ్ ప్రవేశమునకు సంబంధించిన నిబంధనలను, షరతులను పాటించుటకు అంగీకరిస్తున్నాను. మరియు కాంపిటీషన్ ఎడిటరుగారి నిర్ణయమును తుది నిర్ణయముగాను, న్యాయబద్ధమైనదిగాను అంగీకరించుటకు ఆమోదిస్తున్నాను. ప్రతి కూపనుకు ఎంట్రీ ఫీజు రు. 1/—. ఈ పూర్తి ఎంట్రీఫారము (4 కూపనులకు) ఫీజు రు. 4/—M. O. రసీదు/I.P.O./లిట్‌క్విజ్ క్యాష్ రశీదు/ప్రైజు కార్డు జతపరుస్తున్నాను. వాటి నెం.............

53 (ASVP)

CAPITAL LETTERS

NAME...

....

ADDRESS ....

....

....

ఈ పూర్తి ఫారము కత్తిరించి పంపవలెను

చందాదారుల బహుమతి రూ. 1,500/— లిట్‌క్విజ్ వీక్లీకి 3 నెలల, 6 నెలల మరియు సంవత్సర చందాదారులు 4వ కూపనులో కడపటి 4 క్లూలకు సరియైన జవాబులు యిచ్చినయెడల రు. 1500 లకు 1 : 2 : 3 నిష్పత్తిలో పంచుకొనవలెను. అనగా 3 నెలల చందాదారుకు తన వాటాకు రు. 10 వచ్చినయెడల, 6 నెలల చందాదారునకు రు. 20; సంవత్సర చందాదారునకు రు. 30 వచ్చును. మినిక్విజ్ క్రింద ప్రత్యేకించిన స్థలములో మీ చందా నెంబరు తప్పక గుర్తించవలెను. రు 3 (3 నెలలకు), రు 6 (6 నెలలకు) లేక రు 12 (సంవత్సరమునకు) చందాను మీ ఎంట్రీతో పంపి, ఈ బహుమతికి అర్హులు కండి. ఇలా పంపేవారు మినిక్విజ్ క్రిందగల 'న్యూ' అనే పదమును కొట్టివేయండి.

ఆఖరు ముగింపు తేది: 20—8—69.
రిజల్ట్సు ఆంధ్రపత్రిక: 24-8-69.
* రిజల్ట్సు వెంటనే పొందుటకు: 10 పైసల స్టాంపు, స్వంత అడ్రసుగల కార్డును వెంటనే పంపవలెను.

పాపం సుబ్బారావు

పెట్టుకొని పక్కవాటాల్లో వాళ్ళకి విన బడేలా కమలతో ఇంగ్లీషు మాట్లాడ వచ్చునన్న మాట. అబ్బ! తను ఎంత అదృష్టవంతుడో! సోడాపుప్పొసేసిన బజ్జీలా క్షణంలో పొంగిపోయాడు. అందుకే అంటారు 'పాపం, పిచ్చాడు!' అని. అందుకే ఆ మాటకే సుబ్బారావుకి కోపం వచ్చేది, కానీ మరేంచేస్తాం.

కాపరానికి వచ్చిన మొదటిరోజునే కాస్త సీరియస్‌గా చెప్పాడు 'కమలా, నీపేరు నాకేం బాగోలేదు'

'దానికి నన్నేం చెయ్యమంటారు?'

'అసలు నీకు ఈపేరు పెట్టిందెవరు? ఎవరు పెట్టమన్నారు ?'

'మీకు సుబ్బారావు అని ఎవరుపెట్టారో, నాకూ వాళ్ళే' ఆడవాళ్ళు బయట మొగుడిపేరు చెప్పడానికి సిగ్గుపడతారే గానీ ఇంట్లోపడరు అని అవేళ బాగా తెలిసింది అతనికి. అయితే బయట నిజంగా సిగ్గునటనా అని అతనికి ఎంతకాలం నుంచో తీరని సమస్య.

సుబ్బారావుకి సమాధానం చప్పున దొరకలేదు 'అలా ప్రతిదానికీ సమాధానం చెప్తే ఎలా ? నేను ఒకటి అడిగితే ఇంకోటి చెప్తావెందుకు ?'

'నే చెప్పింది నిజంగాదంటారా ? మీకు మీ నాన్న పెట్టినట్లే నాకూ మానాన్న పెట్టాడు. పోనీ మీకు నచ్చలేదని అప్పుడే చెప్పకపోయారా, మార్చేశేవాళ్ళు' అంది కొంటెగా.

'సరే ఇప్పుడు చెప్తున్నాగా, రేపట్నుంచి మార్చేసుకో'

'ఇరవైఏళ్ళు వచ్చాక ఇంకెలాగండీ ? 'కమలా' అని వినగానే కాళ్ళు అసంకల్పంగా తలుపుతియ్యడానికి వెళ్తాయిగానీ ఇప్పుడు ఇంకోపేరు పెడితే ఎలా ? ఏమయినా నాకు ఈ పేరే బాగుంది ? గట్టిగా వత్తి పలుకుతూ.

'మరి నా సంగతేమిటి? నిన్ను ముద్దుగా 'రాధా' అని పిలవాలని, అలా పిలుస్తూ తలుపు తట్టాలనీ, కాఫీ తెప్పించుకోవాలి అనీ ఎంతకాలంనుంచీ అనుకొంటున్నానో తెలుసా ?'

'ఏమో బాబూ అవన్నీ నాకు తెలీదు' అమాయకంగా.

కమల మెత్తబడింది, ఇంతకన్నా మంచి సమయం దొరక్కపోవచ్చు. అదనులోనే చేనుకి పదును పెట్టాలన్నారు పెద్దలు.

మెల్లగా దగ్గరికి తీసుకుంటూ 'నువ్వొకన్ని ఇంక నా ముద్దులు చెల్లించే దెవరు చెప్పు ? నా మాట వినవా ? ఏ పేరాయి ఆడదాన్నో పిలిస్తే ఊరు కుంటుందా ?'

'పోనీ పిలవగూడదూ, ఎలా ఉంటుందో చూద్దాం ?' అందులోని ధ్వని అర్థం చేసుకున్న సుబ్బారావు 'ఎలా ఉంటుంది, ఏడిచినట్లు ఉంటుంది'

'మీకు ఆ పేరుమీద అంత మోజు ఉంటే మన పక్కయింటి పాపపేరు రాధే గాబట్టి రోజుకి వందసార్లు పిలుచుకోండి. నేను కాదనను'

'పిలవచ్చు. కానీ అందులో నువ్వు ఉండవే. నీ మధురభావనలు ఇచ్చే ఆనందం దొరకదే. నిన్ను రోజూ వందసార్లు విసుగు పుట్టేట్లు నీ కొంగుపట్టుకొని రాధా రాధా అని పిలుస్తూ గడపాలి అని ఉంది.'

'అంటే ఉద్యోగం మానేస్తారేమిటి ఖర్మ'

'ఏం ? అవసరం అయితే మానేస్తాను. నీకోసం ఏదయినా చేసేస్తాను'

'ఇదంతాగూడా మీ ఫ్రెండ్స్ తర్ఫీదేనా ?' బాగా రిహార్సల్స్ ఇచ్చి పంపిస్తున్నారే'

'ఛా ఛా! మధ్యలో ఆ వెధవల సంగతి ఎత్తకు'

'అసలుగుట్టు బయట పడుతుందనా ?'

'అదికాదు రాధా' కమల లేచింది తను పోతున్నా నన్నట్లు. ఆమెను కూర్చోపెట్టి ఇంకా తన ధోరణిలోనే...'రాధా, నీ భావనలో నీ సాక్షాత్కారంలో నీ మధుర స్మృతులలో ఈ తనువు పల్లవించి కోటి వసంతాలు వెల్లివిరియాలి. రోజూ డాబాకింద సిరిమబ్బు నీడలలోనుంచి వచ్చే వెన్నెల మెరుపులో నీ సౌందర్య స్వప్నాలు సాక్షాత్కరించు కోవాలి. ఎవరూ లేని నడిరేయిన యమునాతీరాన నిశ్శబ్ద నిశీధిలో తన కదలికే ప్రశాంతతకు భంగం అయ్యేట్లు రాధ కృష్ణుడికోసం చూసి చూసి...'

'అలా నేను మీ కోసం రోజూ చూస్తుండాలంటారా ?'

'నాన్సెన్స్! నీతో అసలు రమణీయ భావనలే లేవేమిటి ?' కోపంగా.

'నాకురావు బాబూ అవి అన్నీ. ఇంట్లో అమ్మ వంట నేర్పింది. బళ్ళో మాస్టర్స్ పాఠాలు నేర్పారు'

'కాదు! అందరూ కలిసి నిన్నో మొద్దుని చేశారు నా పాలిట పడేశారు'

'ఏమండీ, మీరు కవిత్వం రాస్తారా ?'

'లేదు! రేపట్నించిమాత్రం 'నీలాంటి భార్యను ఇచ్చావేమిటిరా భగవంతుడా' అని ఏడుస్తా'

'అవేం మాటలండీ, ఇప్పుడు నేనేం చేశానని' ముద్దు ముద్దుగా. మైనంలాగా కరిగిపోయాడు సుబ్బారావు

'కాస్త పేరు మార్చుకోమంటే ఇంత రభస చేస్తున్నావే, ఇంక నీతో నేనెలా వేగగలను ? శంకరగిరిమాన్యాలు పట్టిపోవల్సిందే అంతానాఖర్మలే, వెళ్ళిపడుకో'

కమలకి నిజంగా కష్టం వేసింది, భర్త మనసు నొచ్చుకున్నందుకు. అయినా ఆపది క్షణంలో మరిపించగలదు. అందుకే అన్నిటికీ సమర్థురాలు అన్నారు. 'అన్నిటికి' అంటే అసలైన అర్థం ఏడిపించడానికీ— నవ్వించడానికీ అని. అంతేగానీ బరువు లెత్తడానికీ కొంప లార్పడానికీ అనిగాదు.

'మాడండి. ఎందుకప్పుడే కోపం. మీకు అలా మాటమాటకీ కోపంవస్తే నే నూరుకోను' ముద్దుగా గడ్డం నిమురుతూ. సుబ్బారావు ప్రబంధ నాయకుడే అయిపోయాడు. సమాధానం చెప్తే, ఆపేస్తుందని బలవంతంగా మౌనం వహించాడు.

'నామీద కోపం వచ్చింది గదూ! ఇదుగో నావేపు చూసి చెప్పండి' సుబ్బారావు కదిలాడు. 'అబ్బ ఉండండి, మరీ చిన్న పిల్లలయిపోతే ఎలా ?'

'ఇంక ఈ చిన్నపిల్లాడి అల్లరి పడలేవనే మా అమ్మ నీ కిచ్చేసింది'

హాయిగా కమల ఒళ్ళో తలపెట్టుకుని భుజాలమీద చేతులువేస్తూ 'నువ్వు నిజంగా అందమైనదానివి రాధా !'

'మీకుమాత్రం ఏం తక్కువ'

'అదేమో నీకే తెలియాలి' అంటూ మీదకి లాక్కున్నాడు.

*   *

ముత్తంమీద నాలుగు నెలలకి సాధించే గలిగాడు సుబ్బారావు. కమల ఏ మూడ్స్‌లో ఉందో ఓ శుభ ముహూర్తాన ఒప్పుకో వడం ఆ మర్నాటి ఉదయంనుండీ ఆ పేరుతో పిలవడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి. అయితే ఆ ముచ్చట అట్టే కాలం నిలవలేదు.

'దైవంబు వేరొండు విధంబుగ దలువ వరుడేమి సేయుగల...'డన్న సత్యం బుజా వయింది సుబ్బారావు విషయంలో.

కమల రాధగా మారిన పదిరోజుల్లో పక్కవాటలోని వారు వెళ్ళిపోవడం, ఆ తరు వాత మరో రెండురోజులకి ఎప్పుడూ తలలో గులాబిపువ్వు ఒకటి పెట్టుకొనే ఒక అమ్మాయి ఖరమ్మగలి రాధ అనే పేరు తోనే రావడం జరిగి పోయాయి. సరిగ్గా తను ఆఫీసుకి బయలుదేరే సమయంలోనే ఝమ్మని తయారయి ఘుమ ఘుమ లాడుతూ తయారయేది కాలేజీకి రాధ.

మూడురోజులకల్లా ఇద్దరూ అక్క చెల్లెళ్ళ వరసన పడటం, మధ్యలో తను కొత్తగా బావ అవడం జరిగాయి. జూనియర్ రాధకి మొదట్లో తికమక పడింది కమల నామద్వయానికి. బావగారిమోజు తెలుసుకొని విరగబడి నవ్వుతుండటం అప్పుడే సుబ్బా రావు లోపలకి రావడం జరిగాయి.

'ఏమిటి రాధా అలా నవ్వుతున్నావ్' ఇద్దరూ క్వశ్చన్‌మార్క్ ముఖం పెట్టారు. సంగతి అర్థంచేసుకొని 'విన్నే జూనియర్ రాధా!'

'నేనేం జూనియర్ రాధనుగాను ఉత్త రాధను మాత్రమే'

'ఎలాగయితేనేం పోయిందిలే'

'అందుకే మా అక్కయ్యను మామూలు పేరుతోనే పిలవండి'

పజషన్‌గా తీసుకోవాలో అర్థరుగా భావిం బాలో అర్థంగాలేదు. 'అటేం కుదరదు అంతగా అయితే నీపేరే మార్చుకో'

'మీకోసం నేనెందుకు మార్చుకోవాలి. పైగా యూనివర్సిటీవాళ్ళు ఒప్పుకోరు.'

'రేపు రాబోయే ఆయనగూడా' కమల.

'అబ్బో! భలే తెలివిగలవాళ్ళేనే మీ మగాళ్ళంతా' వెక్కిరిస్తూ లోపలికి వెళ్ళి పోయింది జూనియర్ రాధ.

'రాధ, తన పేరుపెట్టి నన్ను పిలవ డానికి వీల్లేదని గొడవ చేస్తున్నాదండీ.'

'అలాగా!'

'కమల అనే పేరే నాకు బాగుంటుం దట.'

'అయితే ఇప్పుడేం చెయ్యమంటావ్ ?'

'కమలా, అని పిలవమంటా.'

'అదేం వీల్లేదు.'

'సరే కానిండి, నాకెందుకొచ్చిన గొడవ!

ఆ గొడవ అంతతో ఆగలేదు. పది

రోజులు తర్వాత ఒకనాడు సాయంత్రం కూరలు కొనడానికి బజారు వెళ్లింది కమల, రాధను ఇంటికి కాపలా పెట్టి. ముందుగదిలో వీధివేపుకి వీపు పెట్టి పడక్కుర్చీలో పడుకొని సీరియస్‌గా సీరియల్ చదువుకుంటున్నది రాధ. ఆదరా బాదరాగా లోపలికి వచ్చిన సుబ్బారావు బూట్సు విప్పుకొంటూ 'రాధ ఇవాళ అబ్బిగాడు ఆఫీసుకు వచ్చాడే. వెధవ వస్తూనే "సుబ్బా!" అని కేకేసేసరికి అందరూ గొల్లుమని నవ్వేశారు. ఈడియట్ పదిమందిలో ఎలా పిలవాలో తెలీదు.

మన పెళ్లిలో మీ ఫ్రెండ్స్ అంతా ఎలా గోల చేసిందీ కాంటీన్‌లో చెప్పడం నవ్వడం. పైగా నువ్వొక పెద్ద అందగత్తెవట. డామిట్! నన్ను తలదన్నే అమ్మాయి ఒకర్తి...'

ఇంకా ఏం చెప్తాడో విందామని బలవంతంగా కదలకుండా ఊపిరి బిగపట్టి వింటున్నది చిలిపి రాధ.

'... వచ్చిందని చెప్పాలే. రాధ కాలేజీకి వెళ్ళాలంటే బజారుకే ఒక పెద్ద గ్లాసురమనే. సరిగ్గా 1.30కి ఎండలో ఇంటికి వస్తున్నప్పుడు చూడాలి' కమలను ఉడికిస్తున్నానని తెలుసు సుబ్బారావుకి. మాట్లాడక పోయేసరికి ఇంకా ఏడిపించాలని 'రాధ మన ఇంటికి వస్తేనే సందడి. లేకపోతే లేదు. పెళ్లి చేసుకోకుండా ఇంక కొలుగేస్తున్నా ఆగినా బాగుండేది.'

'ఏం చేసేవారు?'

గతుక్కుమన్నాడు సుబ్బారావు. లాటరీలో గెలుపొందిన స్కూటర్ ఆఖరి క్షణంలో తనదికాదు అని చెప్పినట్లయింది.

'నన్ను చేసుకొనే వాళ్లా?'

ఏం చెప్పడానికీ తోచని అయోమయంలో పడ్డాడు పాపం, సుబ్బారావు. 'ఉండండి. అక్కయ్య రాగానే చెప్తా'

'అదిగాదు రాధా, కమల ఎక్కడికి వెళ్లింది?'

'బజారుకి వెళ్లింది'

'చంపేశావు పో. సరేగానీ ఈ మాట ఎక్కడా అనొద్దు. అసలే ఏడుస్తుంది అది'

'అలాగా పాపం!'

'ఎంత పెద్దా మా రాధ గూడా ఆడది గదా! అసూయ ఎక్కడికి పోతుంది?'

'మధ్యాహ్నం ఒంటిగంటకు రోజూ

పాపం సుబ్బారావు

నన్ను చూస్తూంటారన్నమాట'

'అబ్బే నేనన్నానా?'

'ఇప్పుడేగా బావగారూ చెప్పింది'

'అది నేను చెప్పిన మాటలు కాదు రాధా, ఎవరో అంటుంటే విన్నమాట'

'అంటే నా గురించి అనుకొనే వాళ్లందరి దగ్గరా చేరడం తప్ప మీకు ఇంకో పని లేదన్నమాట'

'.........'

'ఉండండి మీరు అన్నవన్నీ...అమ్మో అమ్మో!' వెక్కిరింతగా 'మా ఆయన నోట్లో నాలిక లేని వారమ్మా, బెల్లం ముక్క కొరకడం గూడా రాదు' అంటుందే అక్క, దాని సంగతి చెప్తా'

'రాధా, రాధా ప్లీజ్'

'.........'

'ఇంకెప్పుడు అనను గా. నిజం నా మాట నమ్మి'

'మీమాటా? అందులో మీ లాంటి మొగాళ్లమాటా?' కళ్లు పెద్దవి చేస్తూ. 'పోనీ ఈ ఒక్కసారి శాంపిల్ చూడరాదా?'

'దేనికి? ఇలాంటి మాటలు మాట్లాడడానికా?'

'అహా!'

'ఇంకా రెండు జడల పక్కింటి అమ్మాయి మీద కవిత్వం రాయడానికా? ఇందుకేనన్నమాట మా ఇద్దరికీ ఒకే పేరు పెట్టి అక్కను కాదని నన్నూ, నన్ను కాదని అక్కని ఏడిపిస్తూ మీ ఇష్టం వచ్చినట్లు ఇద్దర్నీ ఏడిపించడానికే నన్నమాట. అమ్మా! మీరెంతో అమాయకులనుకున్నా బావగారూ...'

సుబ్బారావుకి ఇంక నిజంగా కోపం వచ్చింది. ఎండా కాలంలో తిరక్కుండా ఆగిన పంకామీద వచ్చినంత వచ్చింది. ఎందుకని తనని మాట్లాడితే అమాయకుడు, పసిపిల్లాడు అంటుంది. తనకేం తెలీదని. దేశంలో ముఖ్యం అయిన విషయాల్లో తనకి ఏం తెలీదు. ఇదంతా ఆ కమల చేసినపని. తన గొప్పదనం చెప్పుకోడానికి కమల తనను ఒక సుబ్బారాయుడిగా అభివర్ణించి ఉంటుంది. ఎలాగయినా రాధకు తన గొప్పదనం తెలియజెయ్యాలి. తను అందరూ అనుకొనే సుబ్బారావులాంటి వాడుగాడు అని నిరూపించాలి. దేనికయినా సమయం రావాలి.

'మీ ఫ్రెండ్స్ దగ్గరగూడా నన్ను వర్ణిస్తుంటారా?' విసుగ్గా 'అంతకన్నా నా కింకేపని లేదనుకున్నావా?'

'అయితే కమలదగ్గరమాత్రం ఎందుకు నాసంగతి చెప్పాలి? నాగురించి మాట్లాడే అధికారం మీ కెవరు ఇచ్చారు?' గంభీరాన్ని నటిస్తూ. సుబ్బారావు గుండె వేగం ఎక్కువయింది. ఎందుకొచ్చిన గొడవరా భగవంతుడా? కొంపదీసి ఇంతలో కమల గానీ వచ్చిందో మరీ గొడవ, ఎలా రాధను సమాధాన పరచడం?

'మిమ్మల్నే అడుగుతున్నది!'

'అడగుతున్నావనుకో...చెప్తే ఇబ్బంది పడ్తావ్' కొంటెగా.

'చెప్పండి. ఫర్వాలేదు'

'ఆరెండు కళ్లు!'

'ఆ! అంది హఠాత్తుగా. ముఖంలోని రక్తమంతా చెక్కిళ్లలో చేరి చక్కిలిగిలి పెట్టింది.

'అదుగో అక్క వస్తున్నాది మీపని చెప్తా ఉండండి'

దూరంగా వీధిలో కనబడ్డ కమలను చూడగానే 'ఆపద్బాంధవా అనాథ రక్షకా నీవేదిక్కు. ఈగండం గడిచిందంటే రాధతో, కాదు కాదు కమలతో నీ కొండకువచ్చి మొక్కు తీర్చుకుంటా' అనుకున్నాడు.

* * *

రెండునెలలు గడిచిపోయాయి

స్పోర్ట్సుకాలం, వారపత్రికల్లో రచయితల పేర్లు, అఫిషియల్ పోస్టింగ్స్ అన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తాడు. పైపదవుల్లోకి వెళ్తున్నవాళ్లకి ఎంతకష్టపడి అయినా ప్రైజ్ సంపాదించి ముందంజ వెయ్యమని భారతావనిలో 'సుబ్బారావు' పేరు శాశ్వితం చెయ్యమని ఉచితంగా అమూల్య సలహా ఇస్తుంటాడు. అయితే అవి వచ్చేది ఒక సాధారణ యు. డి. సి. దగ్గరనుండి గాబట్టి అంతగా ప్రాముఖ్యత లభించలేదు. ఓ సుబ్బారావు రాసిన నవల ఒకటి ఓ శుభముహూర్తాన అతని చేతుల్లో పడటమూ దాన్ని విడవకుండా మూడు సార్లు నాలుగు రాత్రులు కూర్చుని చదవడమూ జరిగాయి.

వారం రోజులు తిరగకుండానే అభినందన పరంపర పంపుతూ స్వయంగా రెండు రోజులు తర్వాత కలిశాడు. ఆ రచయిత అయితే అర్ధగంటసేపు ఎంతయినా అవస్థ పడ్డాడు. తన నవల అంత గొప్పదా అని శంక కలిగింది. కారణం పత్రికలలో 'స్వీకరణ' కన్నా స్థానం లభించలేదు.

'ఈసారి ఇంతకన్నా గొప్ప పుస్తకం రాయండి. చందాలు వసూలుచేసి బ్రహ్మాండం అయిన పబ్లిసిటీతో రిలీజ్ చేయిద్దాం. నా ఉద్దేశ్యం మీరచనలు అన్నీ ఇంగ్లీషులో తర్జుమా అవాలి. ఫారిన్ కంట్రీస్ అన్నీ మీకు జోహారు పెట్టాలి. మీ కలంనుండి నోబుల్ బహుమతికి పనికివచ్చే పుస్తకం రావాలి. అప్పటివాకా విశ్రమించవద్దు' భుజం తట్టి వెళ్లిపోయాడు మన సుబ్బారావు. ఆ తరువాత రచయిత సుబ్బారావుకి వారంరోజులు పట్టింది ఈ జ్వరంనుండి కోలుకొనడానికి.

సుబ్బారావు పనులన్నీ ఇలాగే ఉంటాయి. ఒకసారి వాళ్ల ఊళ్లో నాటక పోటీలు జరుగుతుంటే 'సుబ్బారావు' అనే నటుడికి ఎలాగయినా బహుమతి వచ్చేటట్లు చూడమని జడ్జీలలోని ఒక సుబ్బారావుని అడిగితే ఆయన ముక్క చీవాట్లు పెట్టి పంపాడు. అప్పుడు అర్థం అయింది ఐక్యత అనేది ఆంధ్ర దేశంలో ఎంత అబద్ధమో. ఆ మర్నాడే 'ఆంధ్రులు—'ఐక్యత' అని పెద్ద వ్యాసం రాసి పంపాడు. అయితే ఆ పత్రికాధిపతి ఎవరో ప్రచురించను గూడా లేదు. అదే ఆంధ్రుల ఐక్యతారాహిత్యానికి ఒక పెద్ద నిదర్శనం అని కనిపించని 'వాళ్లందరికీ చెప్పాడు. దానికీ ఎవరి దగ్గర నుండి సరి అయిన రెస్పాన్స్ రాకపోయే సరికి నాలుగురోజులు మహా విసుక్కొన్నాడు తన మీద తనే. ఎలా ఈ జాతి బాగుపడు తుందా అని ఒక పెద్ద సమస్య.

మర్నాడు తెల్లారి ఇంకా ఏడు కాలేదు' రాధ అప్పుడే పరుగెత్తు కొచ్చింది పేపరు తీసుకొని 'బావగారూ చూశారా, ఎవరో సుబ్బారావనే ఆయన నిన్న రైలు క్రింద పడి చచ్చిపోయాడట' తనకి ఎందుకు చెప్పిందీ తెలుసు. అందుకే గంభీరంగా 'మన ప్రభుత్వం రైళ్లు అంత చక్కగా నడుపుతున్నాది. ఏం చేస్తాం!' అని టవల్ భుజాన వేసుకొని వెళ్లాడు. అతని బాధ ప్రభుత్వం సరిగ్గా రైళ్లు నడపనందుకు కాదు. అయితే ఎందుకు? అంతమాత్రం అర్థం చేసుకోగల తెలివిగలది రాధ.

ఈ వార్త అతన్ని బాగా క్రుంగ దీసింది. పదిహేను ఇరవైరోజులు దాకా మనస్థిమితం లేదు. వెధవలు ప్రతివాడూ తనని పిలిచి చెప్పడమే: తనే పోయి నట్లు. శలవు పెట్టి నాలుగురోజులు అరుణాచలం వెళ్లి వచ్చాడు. వస్తూ వస్తూ సుబ్బారావుగారి 'ఎంకిపాటలు' తెచ్చాడు. అతని స్థితికి జాలీ, నవ్వూ రాధకీ కమలకీ. మధ్యలో మీదేంపోయిం దండీ అనబోతే కమల మీద కస్సుమన్నాడు. మౌనమే అన్నింటి కన్నా మంచి మందను కొంది ఆ తెలివిగల ఇల్లాలు.

ఓ శుభ ముహూర్తాన సుబ్బారావుకి సుపుత్రుడుదయించాడు. పేరు దగ్గర కావలసినంత రభస జరిగింది.

'పోనీ సుబ్బారావు అని పెట్టండి బావగారూ'

'ఏం? దానికొచ్చిన లోటేమిటి? ఖచ్చితంగా అదే పెడతా'

'దాన్ని ఎవరూ ఆపలేరు'

పేరు పెడితే పెట్టారు, దాని ప్రభావం మాత్రం పడనివ్వకండి. మేమంతా వాడు డాక్టర్ అవుతాడనుకొంటున్నాం. కానీ మీరు మాత్రం సుబ్బారావు అనే పేరు పెట్టారో, గోవిందా'

'చూస్తాను. వెధవ డాక్టరేమిటి? కలెక్టరవుతాడు'

'అనే మీ అమ్మగారూ అనుకున్నా రట మీ విషయంలో. కానీ మీరు కలక్ట రాఫీసులో గుమాస్తా అయ్యారు. ఏంచేస్తాం' పెద్ద సానుభూతితో. సుబ్బారావు ఆఖరికి బ్రహ్మప్రళయం మీద తనమాట దక్కించుకొన్నాడు. పేరు అయితే తనదే పెట్టాడుగానీ ఆపేరుతో పిలవడం తనకే ఏదోగా అనిపించింది. పైగా రాధతో ఇంకా ఇబ్బంది అయింది. ఆ చిన్నవాడి మీద పెట్టి చెణుకులు విసరడం మరీ ఎక్కువయింది. క్వినైన్‌మాత్రలా మింగు తున్నాడు అతను.

పాపం సుబ్బారావు

అవేళ ఆదివారం. చిన్నాడు పెరట్లో ఆడుకుంటున్నాడు, కమల ఎంత చెప్పినా వినకుండా. దూరంగా తను వింటున్నాననే 'పోవితే అక్కా, పెద్దయ్యాక రెవిన్యూ ఆఫీసులో ఉద్యోగం చెయ్యలేవూ. నువ్వు ఏదో పెద్ద కలక్టరు చెయ్యాలి అని బొమ్మలు, కొళ్ళు ఆడుకోడానికి కొంటావు, చెప్తున్నా వినకుండా' ఆగి 'ఏరా చిన్నా నువ్వుగూడా రెవిన్యూ ఆఫీసులో పని చేస్తావా బడిపంతులవుతావురా?' సుబ్బారావులు ఎక్కువమంది బడిపంతుళ్ళే అని రాధ విశ్వాసం.

ఇంకో నెలరోజులలో నాటకపోటీలు ఉన్నాయనితెలిసి రంగంలోకి దిగాడు సుబ్బారావు. సుబ్బారావుఅని పేరున్న వాళ్ళందర్నీ ఓ ఇరవైమంది దాకా పోగుచేసి, పాపం వాళ్ళకేం తెలీదని గోలపెడ్తున్నా వినకుండా నిర్వహణ, దర్శకత్వం, మేకప్ ఇత్యాదివగైరా వగైరాలతో పేర్లు ఇరికించి రిహార్సల్స్ బిగిన్‌చేశాడు. ఇంటి పేర్లు తప్ప అందరూ సుబ్బారావులే. అదే ఒక స్పెషల్ ఎట్రాక్షన్. జడ్జీలూ, ప్రేక్షకులూ ఎవరు ఎవరో తెలీక తన్నుకోవాలి. రచన దగ్గరనుంచి తాడులాగే వాడిదాకా అందర్నీ జాగ్రత్తగా కుదుర్చుకొని రాత్రింబవళ్ళు కృషి చేశాడు. వెధవ గొడవ, మంచి ఎఫెక్ట్స్ ఎలా తేవాలో పూర్తిగా తెలీక, ఎవర్నయినా అడగడానికి నామోషీ: ఆ దుర్తి దొబుకుతాడేమో, రెండురోజులు తీసుకొద్దామని ఎంతో ప్రయాస పడ్డాడుగానీ శుభాకాంక్షలుతప్ప దొరకలేదట. అవే శ్రీరామరక్ష అనిపించింది. అన్నింటిలోనూ దాదాపు కృతకృత్యుడయ్యాడుగానీ 'హీరోయిన్' మాత్రం ఆ నాలుగక్షరాలలో దొరకలేదు. ఆఖరికి తొలిఅక్షరం 'సు'తో పేరున్న ఒక ఆమెతో తృప్తిపడవలసి వచ్చింది. ఇతని హడావిడీ, గందరగోళం, కంగారు కొందరికి నవ్వుని తమాషాను కలిగించాయి. మొత్తంమీద ఈ తమాషా నాటకం ఎలా ఉంటుందో చూడాలని వచ్చారు చాలామంది. తన తమ్ముడికి ఒడుగు అని ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిపోయింది కమల.

'సరదా సుబ్బారావు...' నాటకంబాగానే విజయవంతం అయింది. తను చూసిన సినిమాలు, నాటకాలమీద తను చేసిన సృష్టి అంతా ధారపోశాడు. ఈ యత్నంలో విజయం లభించకపోతే తన గతి అందరిలో వర్ణనాతీతం అని.

ఇండియా ఆటంబాంబు పేల్చినట్లుగా జనం అరిచేశారు సుబ్బారావుకి ఉత్తమ నటుడు బహుమతి ఇచ్చేసరికి. జానపద చిత్రాల్లో కాంతారావు రాజసభ నంతా ఒక్కసారి చూసేటట్లు చూశాడు. ప్రైజ్ తీసుకొని వెళ్తాడనుకున్నవాడల్లా మైకును దగ్గరకు లాగి 'ఈ నాటకం విజయానికి అనేకమంది సుబ్బారావుల ఆదరణ, శ్రమ కారణం. కాబట్టి ఈ బహుమతి నామమాత్రంగా నాకు ఒక్కడికే ఇచ్చినా దీన్ని తయారుచేయడానికి ఉపయోగించిన ప్రతి అణువులోనూ వారంతా ఉన్నారు. వారందరికీ జోహార్' మహా గంభీరంగా స్టేజి దిగాడు. కొంటె గుంపులోనుంచి ఒకడు 'సుబ్బారావుకి' అనగానే పక్కనున్న పదిమందీ 'జై' అనీ ఇంకోవేపునుండీ 'గోవిందా గోవిందా' అనడమూ, ఆడిటోరియం మారుమోగిపోడమూ జరిగాయి.

సభ గూడా ముగిసింది. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. సుబ్బారావు పక్కకి తిరగ్గానే తెల్లటి చీరలో మల్లెపూల మధురిలాగా రాధ నిలబడి ఉంది. జనం అంతా చూస్తున్నారు. ఆ ఎట్రాక్షన్ ఆమెవలన వచ్చిందని సుబ్బారావుకి బాధ. లేకపోతే ఎంతో ఆనందించేవాడు. ఎంతో మంది తెలిసినవాళ్ళూ తెలీనివాళ్ళూ అభినందించిపోతున్నారు.

రాధకు కొంచెం ఈర్ష్య కలిగింది, ఇహ ఈ వెర్రిబాగుల సుబ్బారావు మళ్ళీ పదిహేనురోజులుదాకా మామూలు మనిషి కాదు అని. అతని మనసు గుడ్ కండక్టర్ లాంటిది. తొందరగా హీటెక్కిపోతుంది. ప్రతి చిన్న విషయమూ బలంగా తీసుకుని ఫీల్ అవుతాడు సుబ్బారావు. కాస్తంతదానికే బెంబేలు పడిపోతాడు. జన్మతః మగవాడే అయినా, మానసికంగా ఆడదానికన్నా కనాకష్టం. అయితే అందులో ఒక ఆనందం ఉంది. అందుకే ఆమె ఎప్పుడూ ఎగతాళి చెయ్యడం. ఒక్కొక్కసారి తను అడిగే దానికి సమాధానం దొరక్క అతను తిప్పలు పడ్తుంటే అప్పుడు ఆ ముఖం రాధకి వింతయినా ముద్దు వస్తుంది. సుబ్బారావు చిన్నపిల్లాడయినా కాదు, ఒళ్ళో పెట్టుకొని ఆడించేది.

'నే వెళ్తున్నా బాబూ, నాకు ఆకలేస్తున్నాది' విసుగ్గా అంది రాధ.

'వచ్చేస్తున్నా, వన్ మినిట్, జడ్జీలని ఒక్కసారి కలిసి వస్తా. రిక్షాలో కూర్చో. నేను సైకిల్ తీసుకువస్తా'

'ఆలస్యం అయిందో—'

'ఇంటిదగ్గర మాట్లాడతానని తెలుసుగా పద'

పదినిమిషాలకిగానీ సుబ్బారావు బయటపడలేకపోయాడు.

'ఏమయింది, అలా ఉన్నారు'

'నా సైకిల్ ఎవరో వేసుకెళ్ళారు. నువ్వు పద. నేను నడిచివస్తా'

'డబ్బుల్లేవా, పాపం'

'ఛ! అదేంకాదు'

'మరింకేమిటి ? ఎక్కండి ఆడనకుండా. ఆకలి మండిపోతున్నాది. ఊ! మిమ్మల్నే, ఎంతసేపు ఈ రోడ్డుమీద రామాయణం ?'

సుబ్బారావు అవస్థ అవస్థలా లేదు. మునిసిపాలిటివాళ్ళ 'ధర్మమా' అని వార పత్రికలలో తను చదివిన సన్నివేశాలన్నీ గుర్తు వస్తున్నాయి.

'ఏమిటి ఆలోచిస్తున్నారు ?'

'ఏం లేదు'

'మీ హీరోయిన్ సురేఖగురించా ?'

'ఛ ! అదేంగాదు'

'లేకపోతే సినిమాల్లో ఛాన్సుగురించా?'

'అబ్బ ! నీకు అంతా ఎగతాళే. మన మొహానికి అంత గీతగూడానా ?'

'మీకేంలేండి. ఇన్నాళ్ళూ ఏమో అనుకొన్నా.' గర్వంగా గాలిపీల్చాడు సుబ్బారావు

'అయితే ఇప్పుడేం అనుకుంటున్నావ్?'

'చెప్పమన్నారా ?'

బండి రివ్వున తిరిగింది సైడ్. రాధ గాజులు తాకిడికి అతనినరాలు జివ్వుమన్నాయి. మరీ పూలచెండును సింపుల్‌గా స్వైరవిహారానికి వదిలేసిందేమో కొత్త ఫ్యాషన్ మ్యూజింగా, సుబ్బారావు భుజంమీద పడుతున్నది. ట్యూబ్‌లైటు వెలుతురులో రాధ ముఖం విప్పిన పట్టుచీరలాగా మెరుస్తున్నది. సుబ్బారావుకి ఇలా పరాయి ఆడవాళ్ళతో రాత్రిళ్ళు ఇరుకు రిక్షాలో

కూర్చోడం తొలిసారి. పెళ్ళయిన మొదట్లో మోజుకొద్దీ నాలుగుసార్లు కమలతో తిరిగాడు గానీ రిక్షా ఖర్చులు భరించలేక స్వస్తి చెప్పాడు. పైగా రిక్షాల్లోనాళ్ళమీదే కళ్ళు కొందరికి.

'ఎందుకంత ఇరుగ్గా కూర్చుంటారు. ఫ్రీగా కూర్చోండి.'

'అబ్బే! సరిపోయింది'

'పర్వాలేదు. మొగాళ్ళు సిగ్గును అర్ధ్యంగా అభ్యసిస్తున్నారు.'

ఇంటికెళ్ళి గుడ్డలు మార్చుకొని సుబ్బారావు పడక్కుర్చీలో వాలాడు. రాధ అప్పుడే భోజనం చేసి వచ్చేసి అలా తదేకంగా అతన్నిచూస్తూ నిలబడ్డది. ఎంత సేపటికీ తనను గుర్తించే స్థితిలో రాక పోయేసరికి తనే చిన్నగా దగ్గింది.

'భోజనం అయిందా రాధా!'

'ఆ! అందరూ పడుకున్నారుగూడా'

'మరి నువ్వు పడుకోలేదెందుకు?'

'తమరు?'

'చూస్తున్నావుగా?'

'అదిగాదు. భోజనం సంగతి అడిగేది'

'ఆకల్లేదు'

'కారణం చెప్పేదా?'

'చెప్పుకో చూద్దాం' భయంగానే అన్నాడు, మళ్ళీ ఏ బాణం విసురుతుందో నని.

'కమల గుర్తు వచ్చి ఉంటుంది'

'కాదు'

'ఈ మొగాళ్ళకి తమను నమ్ముకున్న ఆడవాళ్ళెందుకు గుర్తుంటారు' అందులో శ్లేషో, వ్యంగ్యమో, సాధారణ సత్యమో (జనరలైజేషనో) ఏదో అర్థంగాక భోజనం ముందు కూర్చున్నాడు. భోజనాల దగ్గర అంతా నాటకం విషయమే దొర్లింది. తను ఎంత కష్టపడ్డాడో చెప్పుకు పోతున్నాడు.

పక్క అంతా శెడీచేసి రాధ వెళ్ళ బోయింది.

'రాధా!' వెనక్కి పిలిచాడు.

'ఒక్కమాట అడుగుతా. నిజం చెప్తావా?' రాధ ఒణికింది. కళ్ళల్లో ఆందోళన ఏదో తియ్యని భావన మెరుపులా మెరిసి ఆగినట్లయింది. ఏం అడుగుతాడో నని పాదం ముందుకు వెయ్యలేక పోయింది.

ఏం రాధా చెప్తావా?'

పాపం సుబ్బారావు

'.........'

'నాటకంలో నా పాత్ర ఎలా ఉంది!' రాధ ముఖంలో రంగులు తిరిగాయి. వాలిపోయింది. ఏదో వెలితి, తికమక. అదేనా ఆమె ఆశించిన ప్రశ్న!

'ఏం రాధా మాట్లాడవేం?' రాధ దగ్గరికి వచ్చింది. మంచం మీద పడుకున్న అతని పక్కన మెల్లిగా కూర్చొని మీదకి కొంచెం వంగి 'అదేనా మీరు అడగదల్చుకుంది?' రాధను అంత దగ్గరలో చూసి అతనిలో నరాలు వశం తప్పాయి. 'మిమ్మల్నే అడిగేది' మృదువుగా షర్టు బటన్ తిప్పుతూ.

'అదే రాధా నేను అడిగేది......!'

'అయితే వెళ్తున్నా' అని లేవబోగానే చప్పున చెయ్యిపట్టుకోగానే గుర్రపు తోక లాంటి జెత్తెడు పమిటా జారి అతని గుండెల మీద పడటమూ, ఆమె అప్రతిభురాలయి సర్దుకోబోవడమూ జరిగాయి.

'కాదు, నాకు సమాధానం చెప్పేదాకా కదలనివ్వను.'

'మీ నటనకి నా మాటలు చాలవు. కాదు, మనస్ఫూర్తిగా చెప్తున్నా...'

రాధా! థాంక్స్'

'.........'

'రాధా.' మెల్లిగా అతని గుండెల మీద ఒరిగిపోతున్నది రాధ. అతనిలో ఆనందం అతీత శక్తిగా ఆవిర్భవిస్తోంది. మృదువుగా ఆమె జడలోకి చేతులు పోనిస్తూ 'లే రాధా'

రాధ తల అడ్డంగా తిప్పింది.

తలుపు ఎవరో బయట నుండీ తడుతున్నారు. కమల ఆలోచన వచ్చి ఇద్దరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సుబ్బారావు తలుపు తీశాడు. బయట మాట్లాడి వచ్చి చొక్కా వేసుకుంటూ, నేను అలా బయటికి వెళ్తున్నా, సుజాతను ఊరికి పంపాలిట. నువ్వు వెళ్ళి పడుకో'

'లేదు. మీరు వచ్చేదాకా ఉంటా'

'ఆలస్యం అవుతుందేమో. అయినా ఎందుకనవసరంగా నిద్ర పాడుచేసుకోవడం. పోయి హాయిగా పడుకో'

'అలా కాదు. నీ కోసం...' ఇంకేమీ వినిపించుకోకుండా సుబ్బారావు వెళ్ళిపోయాడు, ఒక్కసారి భావగర్భితంగా ఆమె ముఖంలోకి చూస్తూ.

అర్ధగంట తరువాత సుబ్బారావు పంపాడని ఎవరో మనిషి ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. కాయితం విప్పింది.

రాధా!

లోకంలో అంతా చూసే సుబ్బారావు వేరు. నీకు కనిపించిన సుబ్బారావు వేరు. నాలో నిజంగా ఉన్నది మరో సుబ్బారావు. నేను ఎంత అమాయకుడ్ని, అల్పసంతోషిని అయినా బలీయంగా విశ్వసించే నమ్మకాలు, కొలబద్దలూ కొన్ని ఉన్నాయి. ఈ రోజు రాత్రి నిన్నూ నీ ఆవేశాన్నీ అర్థం చేసుకొన్నాను. పరీక్షకొద్దీ అపమార్గంలో అడుగు వెయ్యబోతున్న నన్ను దేముడే బయటనుండి లేపాడు. నీ ఆకర్షణను నీలోని ఉద్రేకాలను సానుభూతితో చూడగలనేగానీ ఆస్వాదించలేను. ఎందుకంటే నేనూ మానవుడ్ని, అందులోనూ మధ్యతరగతి బేల గుండెల తెలుగువాడ్ని. పదహారణాల సుబ్బారావును. అందుకే ఇప్పుడే సుజాతతో కలిసి రైల్లో మా ఊరు వెళ్తున్నా. కమలతో కలిసివస్తా. 'నీకోసం' అన్న నీ చివరి మాటలు బాగా గుచ్చుకొన్నాయి. కొద్ది కాలం ఆగు. నీకోసం పరితపించే దైవం రాబోతున్నాడు. ఆ దేముడికి ప్రసాదించబోయే ప్రసాదాన్ని, ప్రయాణపు బడలిక కొద్దీ దారిలో చిల్లర దేముళ్ళకీ, చిట్టి చిట్టి రాళ్ళకి నైవేద్యంగా అర్పిస్తావా?

మళ్ళీ కలుద్దాం ఆనందంగా అందరం.

ఇట్లు

ఎప్పుడూ నువ్వు ఏడిపించే

సుబ్బారావు

ఉద్రేకం తగ్గిపోయిన రాధలో వివేకం కలతబెట్టింది మనస్సును. 'జోహార్ నీకు సుబ్బారావు' అంది మనసు. తలుపు దగ్గరికి వేసి అతని పటం ముందు క్షణంసేపు తదేకంగా చూసింది.

అమాయకంగా నవ్వుతున్న ఆ కళ్ళు ఏవో చెప్తున్నాయి. అప్పుడు అనుకొంది ఆమె, తనకు సాధారణంగా కనిపించే సుబ్బారావు నిజంగా సాధారణుడు గాదని.

పాపం, సుబ్బారావు...

మనస్ఫూర్తిగా నమస్కరించింది సుబ్బారావుకి. దూరంగా కోళ్ళు కూస్తున్నాయి. తూర్పు ఎరుపెక్కబోతున్నది.

బ్రూక్ బాండ్ బ్రూ ఇన్‌స్టంట్

క్షణంలో తయారు! కప్పులకొలది సంతృప్తి!


ఇది క్షణంలో అయేది!
సమయం మిగిలిస్తుంది!
డబ్బు ఆదా చేస్తుంది!

బ్రూ చెయ్యడం అతి సులభం! వేడినీళ్ళు, రుచికై పాలు, పంచదార కలపండి అంతే. నిజమైన కాఫీ చికరి సువాసనతో మీకు హాయి కొలిపే బ్రూ క్షణంలో తయారవుతుంది!

జ్ఞాపకం ఉంచుకోండి, హడావిడి గాని, గొడవ గాని వడపోయటంలో సమయనష్టం గాని బ్రూ తో లేదు.


అది గాక మీ రుచికి తగినట్లుగా, కప్పుకి కొంచెం ఎక్కువగా గాని తక్కువగా గాని కలిపి తయారు చేసుకోవచ్చును.

బ్రూ కొరకు అడగండి—కాఫీ చికరి ఎలా రుచించాలో తెలిసిన బ్రూక్ బాండ్ నిపుణులచే, జాగ్రత్తగా కలుప బడినది.



Bensons/3388/2 TELG

అనంతపురంలో రామారావు ప్రజాసేవపట్ల హర్షం!



'ఆంధ్ర వరదబాధితుల సహాయనిధి'కి సహాయం చెయ్యండి బాబూ అని అడుగుతున్న కాంతారావు, సావిత్రి, రామారావు, దేవిక

ఎంత కోలాహలం? ఎన్నెన్ని కానుకలో? అనిపించింది అనంతపురం వీధుల్లో శ్రీ ఎన్. టి. రామారావుకు దండ ప్రయాణం చేసిన జనసందోహాన్ని చూచి. శ్రీ ఎన్. టి. రామారావు చొరవను కళ్ళారా చూడగలిగాను. ఆయన జోలె పట్టి పురవీధుల్లో నడుస్తుంటే, అటు దేవళ్ళ పాపాయి మొదలు ఎనభై ఏండ్ల వృద్ధులవరకు శ్రీ రామారావు సంచిలో పైసా మొదలు వందరూపాయలవరకు వేసి ఆయనపట్ల, ఆయన చేస్తున్న ప్రజాసేవ పట్ల హర్షాన్ని వెల్లడించారు. శ్రీ రామారావు ఒకవైపు, శ్రీ జగ్గయ్య ఒకవైపు, అనంతపురం వడివీధుల్లో భిక్ష పట్టడాన్ని చూసి 'పిల్లను చూడరా ఎంత కష్టపడుతున్నారు? అయ్యో పాపం అనిపిస్తుంది కదూ' అంటూ తమకు తోచిన సహాయాన్ని అందించారు. అలాగే శ్రీమతి సావిత్రి, దేవికలు సాటి దగ్గర కోర్టు కేసు వైపులా, తెలిసిన దుకాణాల్లోకి వెళ్ళి 'చిలుం ప్యాకెట్లు, తినుబండారాలు' తీసుకొచ్చేవారు. అలాగే శ్రీయుతులు కాంతారావు, రేలంగి, ప్రభాకరరెడ్డి, ధూళిపాళ, చంద్రమోహన్. మిక్కిలినేని కుమారి అనిత, శ్యామల, శ్రీమతి ఛాయాదేవి, జగ్గారావులు కూడా జోలెపట్టుకుని 'దయచేసి రండి ఏదయినా సహాయం చెయ్యండి.' అంటూ జనంవద్ద ధనమో, వస్తువో పొందేవారు.

ఎన్. టి. ఆర్. టూర్‌లో తమాషాలు

* శ్రీమతి సావిత్రివద్ద షేక్‌హ్యాండు తీసుకుందామని చాలామంది అనుకున్నారు. ఒక షేక్‌హ్యాండుకు అయిదు రూపాయలు. ఎవరికి చాలామంది వెనక్కు తగ్గారు. ఒక అభిమాన ప్రేక్షకుడు మహానుభావుడు మాత్రం అయిదు-పదిహేను రూపాయలు చెల్లించి మరీ షేక్‌హ్యాండు అందుకుని నవ్వుముఖంతో వెళ్ళిపోయాడు.

* శ్రీమతి దేవిక కూలింగ్‌గ్లాసు పెట్టుకుని వీధి వసూళ్లకు వచ్చేది. "అమ్మా, దేవికా, ఆ గ్లాసులు తీసివంటే పది రూపాయలు ఇస్తాననే" వారు.

* శ్రీ ఎన్. టి. రామారావుకు ఒక్క రూపాయి నోట్లతో దండలువేసి "కలియుగ రామా, నీవు ధన్యచరితుడవయ్యా" అంటూ ప్రశంసించేవారు.

* స్త్రీవారికి మాతోపాటు ఒక అందమైన అమ్మాయి వచ్చేది. ఆమె సినిమానటి అని చాలామందికి తెలియదు. ఆ అమ్మాయి పేరు చెప్పండి అని అడిగేవాళ్ళు, ఒక్క రూపాయి ఇస్తే చెప్తాననగా రూపాయి ఇచ్చి ఆమె పేరు 'శ్యామల' అని తెలుసుకునేవారు.

* ఇటువైపు తిరుగు సావిత్రిగారు అని ఒక ప్రక్క, అటు చూడండి డబ్బులు వేస్తామంటు ఇటు అని మరొకవంక చెప్తుంటే పాపం, శ్రీమతి సావిత్రి రెండు వైపులకు వెళ్లి విధి వసూళ్లు చేసేది.

* అభిమాన ప్రేక్షకులు మామిడిపండ్లను, కూలింగ్ గ్లాసులను, పెనాలను విసిరేవారు. ఒక పెన్ను రెండు రూపాయలు, ఒక మామిడిపండు రూపాయి చొప్పున శ్రీమతి సావిత్రి అమ్మేవారు.

* వేలయ్యా డ్రైవరు ఎ. ఎన్. రావును, అంటూ ఆయన క్యాప్ చూపించేవారు. "నన 'ఏక వీర' ధన్యునంగా, వెయ్యండి మనవాడు" అంటూ వేసేవారు.

* "అన్నా, రేలంగన్నా, ఇటు చూడు నాయనా" అంటూ ఆయన సంచిలోనూ డబ్బులు వేసే వారు.

* ఒక తొంభై యేండ్ల ముదుసలి శ్రీమతి సావిత్రి దగ్గరకు వచ్చి "అమ్మాయ్, లక్ష్మీదేవిలాగా వున్నావే. నీ బుల్లి చల్లంగావుండ, నీ బిడ్డాపాపా బాగుగా వుండాలంటూ" అని దీవించి వెళ్ళింది.

* శ్రీ ఎన్. టి. రామారావు జీపు బయల్దేరబోతుంటే ఆయన అభిమానులవెంట కొబ్బరి కాయలు కొట్టేవారు.

సావిత్రి 'షేక్‌హాండ్'
దేవిక కళ్ళజోడు

శ్రీమతి సావిత్రికి 'షేక్‌హ్యాండ్' ఇవ్వాలని తహతహ పడేవాళ్ళు, శ్రీమతి దేవికను కళ్ళజోడు విప్పమని చెప్పేవాళ్ళు, 'పవిత్ర కుటుంబం'కు జై, 'సిపాయి చిన్నయ్య'కి జై అనేవాళ్ళు. మేడపైనుండి పేనాళ్ళను విసురుతూ పిల్లలను, మామిడిపండ్లను విసిరేవాళ్ళు. 'సావిత్రి, మా చిన్నారి పాపాయికి ముద్దివ్వు' అని ప్రాధేయపడే వాళ్ళు 'దేవికా, ఇటు తిరిగి చూడమ్మా' అని కోరే ప్రజలు — ఒకప్రక్క కోరుతూ, మరొక ప్రక్కనుంచి 'మా కలానాయకుడికి సహాయపడుతున్న మహానుభావులారా, మీరందరూ చల్లగా వుండాలి' అని ఆశీర్వచనం పలుకుతుంటే, సినిమా తారలపై ప్రేక్షకులకున్న అభిమానబలం ఎంత గొప్పదా? అనిపించింది. శ్రీ వీర ఆచార్యను యువాజీనా గద్దెపట్టేవారు (ప్రతిభా) వెంటనే 'గండికోట రహస్యం' విడుదల వదలరు, చిక్కడు— దొరకడు' జరుగుతున్నాయా? మా కాంతారావుతో ముంచి తయిట్ పిక్చర్ తీయవయ్యా' అంటూ

అనిపేవారు అలాగే శ్రీ కేలింగిని వేలాది జనం చుట్టుముట్టేవారు


ఎవరు ఎక్కడ ఎప్పుడూ బాధపడ్డా కమిటీ సేవ

'ఉదయం ఎనిమిది గంటలకు వీధి సమావేశాలకు బయల్దేరి, మధ్యాహ్నం ఒంటిగంట వరకు అనంతపురం పుర వీధుల్లో మండు టెండలో తిరిగినా, మాకు అలసటగానీ, తలనొప్పిగానీ, ఒళ్ళునొప్పి గానీ రావేదంటే మాకు హాయి అనిపించిం దనేగా అర్థం.' ఆరోజు రాత్రి ప్రోగ్రా మంకు అనంతపురం జిల్లా కలెక్టరు అధ్య క్షత వహిస్తూ, శ్రీ రామారావు చేస్తున్న ప్రజాసేవను వేనోళ్ళ ప్రశంసించారు. తమ జిల్లాలో వసూలైన లక్ష రూపా యల నిధిని శ్రీ రామారావు చేతికి సమర్పించారు. శ్రీ రామారావు అనంతపురం ప్రజలకూ, ప్రభుత్వోద్యోగులకూ, తనకు సహాయపడుతున్న తన తమ్ముడు శ్రీ జగ్గ య్యకు, ఎన్. టి. ఆర్. ఆర్ట్స్ అసోసియేషన్‌కు, తన ప్రత్యేకాభిమానం కొద్దీ వచ్చిన ప్రేక్షకులకు అభినందనలను తెలుపుతూ, ఎక్కడ, ఎప్పుడు, ఎవరు బాధపడినా తాను, తన కమిటీ ముందుకు వచ్చి ప్రజాసేవ చెయ్యడానికి వెనకాడమని ప్రకటించారు. మీటింగు అయిన పిదప, 'శ్రీ కృష్ణ తులాభారం' నాటకం, శ్రీ ఘంటసాల కచ్చేరి, 'దంతవేదాంతం' నాటకం, శ్రీమతి రాజసులోచన నృత్యం, శ్రీ వేణు మాధవ్ మిమిక్రీ జరిగాయి.

బళ్లారిలో ఘనస్వాగతం

అనంతపురంలో పిదప బళ్ళారిలో కూడా శ్రీ ఎన్. టి. రామారావు అండ్ పార్టీకి ఘన స్వాగతాన్ని ప్రజలు పలికారు. ఇరవై వేల రూపాయలను తమ జిల్లా ప్రముఖుల ద్వారా అందజేసి సోదర బాధిత ప్రాంతాల్లో తమకుగల ప్రగాఢ సానుభూతిని ప్రకటిం చారు. ఆరోజు రాత్రి మామూలు ప్రదర్శ నలు యథావిధిగా జరిగాయి. ఆనాటి సభలో శ్రీ జగ్గయ్య లేనిలోటు కొట్టొచ్చినట్లు కనిపించింది. శ్రీ జగ్గయ్య సురేష్ షూటింగుకి హాజరవడానికి మద్రాసుకు వెళ్ళి మరుదినం బెంగుళూరులో వచ్చి మాతో కలుసుకున్నారు.

—శ్రీ—



బెంగుళూరులో శ్రీయుతులు జగ్గయ్య, ఎన్. టి. రామారావు
మైసూరు ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రపాటిల్, శ్రీ ఎం. జి. రామచంద్రన్

బెంగుళూరులో కార్యక్రమం

బెంగుళూరు పట్టణంలో మైసూరు ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రపాటిల్ అధ్యక్షత న 20 వ తేది కార్యక్రమం ప్రారం భంగా సాగింది. ఆనాటి సభకు మైసూరు పరిశ్రమ శాఖామాత్యులు శ్రీ రాజశేఖర మూర్తి ప్రసంగించారు. శ్రీ జగ్గయ్య ఆంగ్లంలో ప్రసంగిస్తూ 'ప్రకృతి విలయ తాండవం చేసిన పర్యవసానంగా ఆంధ్రలో వుండిన నాలుగుకోట్ల జనాలు చిన్నాభిన్నమై పోయాయి. మన పూర్వీకులు ఎన్నడూ, కనీ విని యెరుగని విధంగా ప్రజా, పశు సంపదలు సర్వనాశనమై పోయాయి. ఆంధ్ర ప్రజలకు ఏర్పడ్డ విపత్ సంభవాన్ని మనం యెంత యిచ్చినా, ఏం చేసినా తీర్చడం దుస్సాధ్యం. అయినప్పటికీ మానవ ధర్మంగా మనం ఆపదలో వున్నవారిని ఆదు కోవడం మన కనీస ధర్మం. ఈ ధర్మ నిర్వహణలో శ్రీ ఎన్. టి. రామారావు ప్రత్యేక శ్రద్ధాసక్తులను ప్రకటిస్తూ ప్రజాసేవకుడిగా తన వ్యక్తి ధర్మాన్ని వ్యయప్రయాసలకోర్చి నిర్వహిస్తున్నందుకు హార్ది కంగా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నా కీర్తికి సంబంధించిన మా ఉన్నత పరిస్థితి



'శ్రీ కృష్ణ తులాభారం' నాటకంలో
శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీమతులు ... శ్యామల, శ్రీ కాంతారావు

రచయిత(త్రు)లకి మనవి

కొందరు పాఠకులు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో పడే రచనలు వ్రాసినవారి చిరునామా కోసం రాస్తూ ఉంటారు. ఈ సమాచారం రచయిత(త్రు)ల అనుమతి లేనిదే తెలుపటం వీలుకాదు. కాబట్టి తమ చిరునామా ప్రచురణకి అభ్యంతరంలేని రచయిత(త్రు)లందరూ తమ వ్రాత ప్రతుల మీద ఆ విధంగా పేర్కొంటే బాగుంటుంది. (సం)

పయి ప్రకటన దృష్ట్యా ఏటి పరిస్థితులలోనూ రచయిత(త్రు)ల చిరునామాకోరే ఉత్తరాలకి సమాధానం ఇవ్వటం జరగదు. (సం)

ఎన్. టి. ఆర్. తో...


కారకులయిన మీరు మాకు యిస్తున్న సహాయ సహకారాలను జీవితాంతం మరువలేము. ఎక్కడ, ఎప్పుడు, ఎలాంటి విషాదభరితమయిన సంఘటనలు జరిగినా, అలాంటివారికి మా సేవ తథ్యం అని మీకు హామీ యిస్తున్నాను.' మైసూరు ముఖ్యమంత్రి, శ్రీ వీరేంద్రపాటిల్, పరిశ్రమల మంత్రి శ్రీ రాజశేఖరమూర్తి శ్రీ ఎన్. టి. రామారావు చేస్తున్న నిస్వార్థ ప్రజాసేవను కొనియాడుతూ, మైసూరు ప్రజలు విరివిగా విరాళాలిచ్చినందుకు, వారికి తమధన్యవాదాలర్పించారు.

ముఖ్య అతిథిగా ఎం. జి. రామచంద్రన్

శ్రీ ఎన్. టి. రామారావు మైసూరు ముఖ్యమంత్రిని, మైసూరు ప్రజలను అభినందిస్తూ, తుఫాను బాధితులకు ప్రప్రథమంగా 50 వేల రూపాయల చెక్కును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపిన శ్రీ వీరేంద్రపాటిల్ ప్రత్యేక ప్రశంసకు పాత్రులయ్యారని వుగ్గడించారు' అలాగే తమిళతెర మహానటుడు శ్రీ ఎం. జి. రామచంద్రన్ ముఖ్య అతిథిగా వచ్చి యీ సభను అలంకరించడం తనకు పరమానందంగా వుందని వెల్లడించారు. అనాటి రాత్రి శ్రీ విశ్వనాథన్ సంగీత దర్శకత్వంలో శ్రీయుతులు టి. ఎం. సౌందరరాజన్, పి. బి. శ్రీనివాస్, ఎల్. ఆర్. ఈశ్వరి, రాధల గానకచ్చేరి జరిగింది. శ్రీమతి రాజసులోచన బాంగ్రా డ్యాన్సు, కుమారి జయలలిత రాసలీల నృత్య ప్రదర్శనం, శ్రీ కృష్ణ తులాభారం నాటకం, శ్రీ నాగేష్ హాస్యప్రదర్శనం, శ్రీ రాజకుమార్ కన్నడ నాటకాభినయం, శ్రీమతి జయంతి కన్నడ నాటిక, శ్రీ ఘంటసాల పాటకచ్చేరి వరుసగా జరిగాయి. ఆనాటి ప్రదర్శనలకు యాభైవేలమంది వచ్చివుంటారని వూహించబడుతుంది.

మరువలేని మధురఘట్టం

మేము జులై 14 నుండి జులై 20 వరకు ఏడురోజులు సాగించిన పర్యటన జయప్రదంగా జరిగింది. శ్రీ యన్. టి. రామారావు అధ్వర్యంలో మేమందరం క్రమశిక్షణా బద్ధంగా, కార్యక్రమాలను కొనసాగించాము. మాకు రవాణా సౌకర్యాలను యేర్పరచడంలో శ్రీ గంగాధరరావు కనబరచిన శ్రద్ధ, భోజనం రుచికరంగా వుండే విధంగా ఆయా ప్రదేశాల్లో వంటను తయారుచేయించిన శ్రీ బలరాం ఆసక్తి, ఆ భోజనాలను సకాలంలో అందే విధంగా యేర్పాట్లను గావించిన శ్రీయుతులు జగన్నాథరావు, రామస్వామిల చురుకుదనం మేము యెన్నటికీ మరువలేము. ప్రతి కేంద్రంలో స్టేజి యేర్పాట్లను అద్భుతంగా వుండడానికి తోడ్పడిన శ్రీ డి. ఎల్. నారాయణ కృషిని ప్రశంసించడం మా ధర్మం. మాకు విశ్రాంతి గదులను సకల సౌకర్యాలతో యేర్పరచిన శ్రీ పింజల సుబ్బారావును, మాపై ప్రేమాభిమానాలను యెప్పటికప్పుడు చూపుతూ మమ్మల్ని గౌరవించిన శ్రీయుతులు ఎన్. టి. రామారావు, త్రివిక్రమరావు, పుండరీకాక్షయ్య డి. వి. ఎస్. రాజులకు కృతజ్ఞతలను తెలపడం మా కనీసధర్మం. మొత్తానికి 'మా యీ వారంరోజుల ప్రయాణం మేము మరువలేని మధురఘట్టం'అనడం వుచితం.



శ్రీ ఎన్. టి. రామారావు జోలిసంచిలో డబ్బువేస్తున్న ఒక అవ్వ
(మధ్యన వున్నవారు విజయా భాస్కరరావు)

— శ్రీనివాస్

ఉత్తరాలు

(4—వ పేజీ తరువాయి)

లేదు. వారు (ఆంధ్రులు) యీ 12 సంవత్సరము లలో చూపిన సుపీరియారిటీ కాంప్లెక్సుతో తెలుస్తే. వి. కృష్ణ, (వరంగల్లు)

[* జవాబు

'ఆంధ్రప్రదేశ్ అల్మనాక్ 1968' ప్రకారం 1961 జనాభా సంఖ్యలు ఈ క్రింది విధముగా ఉన్నాయి.

తెలంగాణా	12,712,000
ఆంధ్రప్రాంతం	23,671,000

పాఠకులు శ్రీ వి. కృష్ణ ఉత్తరాన్ని సవరించకుండా యథాతథంగా వేశాము. —సం.]

* * *

పరిమళసోమేశ్వర్‌గారు వ్రాసిన భర్తను లొంగ దీసుకోవటము ఎలా అనే వ్యాసం నేను 3 పత్రికలలో చదివినాను. 14—7—69 తేదీ వ్రాసిన వ్యాసం నాకు నచ్చలేదు. ఈ మాదిరిగా రాయడం బాగాలేదు. ఇప్పటికే చాల ఇండ్లలో నేను చూచినాను. భర్త చేత వంట చేయింపటము మీరు చేయించుచుంటె వుండవచ్చును. మీరు దేశమంతటా ప్రచారము చేయుటము బాగలేదు. ఈ మాదిరి భర్తచేత వంట చేయించటం ఇత్యాదిపనులు మీరు ఇకమీదట ఇటు వంటి వ్యాసాలు రాయవద్దని నా ప్రార్థన.

ఎం. భారతిదేవి, (వెల్లూరు)

* * *

ఇది కేవలం తమకు పురుషజాతిమీద వున్న కసి వెళ్ళగక్కుకునేందుకూ, వారిని దుయ్యబట్ట డానికీ రాసినట్లుగా కనిపిస్తోంది. ఆ దుయ్యబట్టడం కూడా ఎంతవరకూ పోయిందంటే రవంత్రి అవతార పురుషుడైన నాటి శ్రీరామచంద్రుణ్ణి కూడా ఏకపత్నీవ్రతాన్ని పటించేడని, అదంతా అబద్ధ మనీ నిందించేందుకు సిద్ధమయేరు! (దేవుడు క్షమించుగాక!)

ఇటువంటి రచనలవల్ల దుష్ప్రయోజనాలేకాని సత్ప్రయోజనాలు శూన్యం. సంసార జీవితంలో స్త్రీ పురుషులిద్దరూ సమానభాగస్వాములు. ఇరు వురికీ హక్కులూ బాధ్యతలూ కూడా సమానమే. అందువల్ల ఒకరు రెండవవార్ని లొంగదీసుకోవడం, వారిపై అధికారాన్ని చెలాయించడం అనే ప్రసక్తే లేదు. రచయిత్రులు ఇటువంటి వ్యాసాలు వ్రాసి స్త్రీజాతిని పురుషజాతి మీద విప్లవం లేవదీసేటట్లు పురిగొల్పడం చాలా విచారకరం. అందుకు బదులుగా స్త్రీ పురుషుల మధ్య సరియైన సామరస్యాన్ని కుదర్చి సంసారాలని సుఖమయం చేయడానికి దోహద మయ్యే చిట్కాలు, వ్యాసాలు వ్రాస్తే ఎంతో బాగుంటుంది.

వే. రామకృష్ణశాస్త్రి (సికింద్రాబాద్)

* *

ఉత్తరాలు

మేము ప్రతివారం మీ అభిమాన పత్రిక చదువుతాము. శ్రీమతి పరిమళా సోమేశ్వర్‌గారి 'భర్తను లొంగదీసుకోడం ఎలా' మాకు చాలా నచ్చుతున్నది. కాని చిన్న సందేహం. వారిస్తున్న చిట్కాలు భర్తలు కూడా చదువుతూంటారుకదా!! మరి వారు ఇవన్నీ ముందే గుర్తించి లొంగకపోతే ఎట్లా?

కుమారి ఉమ, కుమారి రాజీవి (హైదరాబాద్)

* * *



'భర్తను లొంగదీసుకోవడం ఎలా?' అన్న వ్యాసంతో పరిమళసోమేశ్వర్‌గారు స్త్రీలలో సంచలనాన్ని తేవడాన్ని తమ ధ్యేయంగా ప్రయత్నిస్తున్నట్టుంది. అంతేకాకుండా వీరు మన గొప్పవారైన మునీశ్వర, కవీశ్వరులను కాక దేవతలను సైతం విమర్శించేస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే వీరికి భగవంతునిపైన నమ్మిక లేనట్టుంది. లేకున్న భగవంతుడు కూడ పురుషుడే యెప్పుడు అయిన సృష్టిలో స్త్రీ పురుషులు కాగా, ఈ విమర్శనాయుక్తే శ్వేతో అర్థం కావడంలేదు. ముఖ్యంగా 'అది అహంభావం, మగవాడినన్న అతిశయం' అన్నది ఏమంత సబబుగా లేదు.

ఎం. రాంమోహన్ (నిర్మల్)

* * *

'భర్తను లొంగదీసుకోవడం ఎలా?' అనేకంటే 'భర్తను లొంగదీసుకోవడం ఏల?' అనే వ్యాసం ప్రచురించి ఉంటే, నేనేకాదు, ఇంకా చాలామంది, అద్భుతంగా సంతోషించేవారేమో! రచయితలు ఆడవాళ్లను విమర్శించడం కంటే, రచయిత్రులు మగవాళ్లను విమర్శించడమే ఈమధ్య ఎక్కువగా ఉంది. ఇలా ఎందుకు జరుగుతుందో!

భర్తను లొంగదీసుకునే మార్గాలతో ముందుకు వచ్చిన భారత స్త్రీని నేనెంతో అభినందిస్తున్నాను. ఎందుకంటే ప్రస్తుతం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలనే అగ్నికి ఆజ్యం పోస్తున్నందుకు. నన్నడిగితే చాలామంది ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య ఏదంటే, భార్యాభర్తలమధ్య అసంతృప్తి, అనురాగలోపం. . . . భార్యాభర్తలు అనురాగంతో, సంతృప్తిగా అన్యోన్యంగా ఉండగలగటానికి మంచి చిట్కాలతో ఎవరైనా ముందుకు వస్తే వారికి సంఘం చాలా ఋణపడి ఉంటుంది. రచయిత్రి నన్ను అపార్థం చేసుకోరని తలుస్తున్నాను.

కూర్మినాయక్ మోతీలాల్ (జమ్‌షెడ్‌పూర్)

ఒక విధంగా కొందరు తెలంగాణా పెద్దలు—వారికి తెలియకుండానే ఆంధ్రులకు ఒక గొప్ప సహాయం చేశారు. అది—ఇప్పటివరకూ దక్షిణాది వారందరూ 'మద్రాసీ'లనే పిలువబడేవారు—దేశంలోనే కాక—ప్రపంచమంతటా కూడా.

కాని, ఇప్పుడు 'తెలంగాణా' పోరాటం వలన దేశంలోనే గాక, ప్రపంచంలోనే ఒక స్థాన మేర్పడింది ఆంధ్రులకు. అయితే... అది ఒక చెడ్డ ప్రవర్తన గావించిన విధంగా మాత్రమే అందరికీ తెలుసు. మరి గొప్పదనం తెలియజేసేదెలా?!


మంచి కంటే ఎప్పుడూ చెడుకు స్థానం త్వరగా లభిస్తుందంటారు. అద్దేనేమో!?

ఆంధ్రులందరికీ తలవంపులు తెచ్చే విధంగా చేసిన ఆ పెద్ద—మనుష్యులకు 'శిక్ష' వారిని(వి) నాయకులుగా చేసిన ఆ ప్రజలే విధించాలి!!?

బ్రహ్మయ్య (బెంగుళూరు)


Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

లిప్టన్ రూబీ డస్ట్ టీ



చక్కని రంగు, మంచి రుచి, కమ్మదనము వీటన్నిటితో నిండినది అతి త్వరలో తయారగును

మంచి టీని మెచ్చేవారికి లిప్టన్స్ రూబీ డస్ట్. పైగా రూబీ డస్ట్ ప్రతి పొట్లానికి ఎన్నో కప్పులు ఎక్కువ టీని ఇస్తుంది. బలమైన పానీయ లక్షణంగల టీ. మిక్కిలి రుచి. హాయి గొల్పించే సువాసన. రూబీ డస్ట్ టీని త్రాగడం ఆహ్లాదకరం. ఎక్కువ పొదుపు కూడ యిచ్చును.



లిప్టన్స్ అంటే మంచి టీ

LIPTON

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.